సూర్య 18వ వసంతంలోకి...
www.suryaa.com
visit us @ http://epaper.suryaa.com
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
గురువారం | 14 నవంబర్ 2024 | హైదరాబాద్
సంపుటి 18 | సంచిక 23
| పేజీలు 10+8 | వెల: రూ. 6.50
Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi

విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



☞ APPSC,TSPSC పోటీపరీక్షల గైడెన్స్
☞ నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
☞ కరెంట్ అఫైర్స్
☞ నమూనా ప్రశ్నాపత్రాలు
☞ విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్ www.suryaepaper.com చూడండి.

అనుగ్రహం
శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - వర్ష ఋతువు, కార్తీక మాసం త్రయోదశి ఉ.7.35, చతుర్దశి తె.5.12 వర్జ్యం రా.8.20 నుంచి 9.49 వరకు
రాహుకాలం మ.1.30 నుంచి 3.00 వరకు దుర్ముహూర్తం ఉ.9.52 నుంచి 10.37 వరకు తిరిగి 2.21 నుంచి 3.06 వరకు

## భారతీయ భాషల్లో
# వైద్య విద్య


- రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు
- 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు'తో బడుగులకు సేవలు
- గత ప్రభుత్వాలు చేసినవి కేవలం తప్పుడు వాగ్దానాలు
- దర్భంగా సభలో ప్రధాని నరేంద్ర మోడీ



త్వరలోనే హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను జోడిరేచామని.. రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు. దేశంలో 1.5 లక్షలకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. బిహార్ లోని దర్భంగాలో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

6లో

## నష్టాలలో స్టాక్ మార్కెట్‌లు



5లో

- వరుసగా ఐదో రోజు నష్టపోయిన స్టాక్ మార్కెట్
- అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్, నిఫ్టీలకు నష్టాలు
- సెన్సెక్స్-30 ప్యాక్ లో 27 షేర్లు పతనం

## మీ కాళ్లపై మీరు నిల్చోవడం నేర్చుకోండి



6లో

- శరద్‌పవార్ ఫొటోలు, వీడియోలు ఉపయోగించొద్దు
- అజిత్ పవార్ వర్గాన్ని సుప్రీం ఆదేశించింది

ఎన్‌సీపీ వ్యవస్థాపకుడైన శరద్‌పవార్ ఫొటోలు, వీడియోలు ఎన్నికల ప్రచారంలో వినియోగించొద్దని ఆదేశించింది. అలాగే సొంతకాళ్లపై నిల్చోవడం నేర్చుకోవాలని చురకలు వేసింది.

## తెలంగాణ దేశానికే
# రోల్ మోడల్


- నూతన ఆర్‌ఓఆర్ చట్టం
- వికారాబాద్ ఘటన బాధ్యులపై చర్యలు తప్పవు
- ఎంతటి వారు ఉన్నా వదిలే ప్రసక్తే లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

వికారాబాద్ కలెక్టర్, అధికారులపై దాడి ఘటన వెనుక ఎంతటి వారున్నా వదిలే ప్రసక్తే లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి త్వరలోనే మీడియా ముందుకు తీసుకువస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొంతమంది కుట్రలు చేస్తున్నారని, అలాంటి వారి ఆగడాలు ఏమాత్రం సాగవని మంత్రి హెచ్చరించారు.



7లో

## ప్రధాని మోడీ నోబెల్ శాంతి బహుమతికి అర్హులు



6లో

- అన్ని దేశాలతో మోడీకి సత్సంబంధాలు
- మార్కెట్ వెటరన్ మార్క్ మోబియస్ వెల్లడి

భారత ప్రధాని నరేంద్ర మోడీ నోబెల్ శాంతి బహుమతికి అర్హులు అని జర్మనీ పెట్టుబడిదారుడు మార్క్ మోబియస్ అభిప్రాయపడ్డారు.

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## అక్రమ కట్టడాలను
# కూల్చివేస్తాం

- బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం తీసుకువస్తాం
- హైదరాబాద్‌లో మరోసారి హైడ్రా కూల్చివేతలు
- రాంపల్లి సమీపంలోని రాజ్‌సుఖ్ నగర్‌లో కూల్చివేతలు
- రెండు బృందాలుగా విడిపోయి, జేసీబీలతో కూల్చివేతలు
- హైడ్రా కమిషనర్

హైదరాబాద్ నగరంలోని బతుకమ్మకుంటపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు నెలల్లో బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం తీసుకొస్తామని వెల్లడించారు.



## గవర్నర్ అనుమతి రాగానే
# కేటీఆర్‌పై విచారణ

- టిఆర్ఎస్ హయాంలో అవినీతిపై స్పందించకుండా కాంగ్రెస్‌పై విమర్శలు
- కెసిఆర్ కుటుంబ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్ ఆరోపణలు
- మహారాష్ట్రలో బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయట్లేదు
- బిజెపితో మిలాఖత్ అయిన బిఆర్ఎస్
- రక్షణ కోసమే కేటీఆర్ ఢిల్లీ టూర్
- సీఎం రేవంత్ రెడ్డి



3లో


## రేవంత్ రెడ్డిది
# తుగ్లక్ విధానం

- అల్లుడి కోసమే ఫార్మా కంపెనీ ఏర్పాటు
- తుగ్లక్ విధానాల వల్లే లగచర్ల ఘటన
- పట్నం నరేందర్ రెడ్డిది అరెస్టు కాదు..కిడ్నాప్
- సురేష్ అనే వ్యక్తి బరాబర్ బీఆర్ఎస్ నాయకుడే
- రేవంత్‌పై కేటీఆర్ ఫైర్



7లో

## అంతే ఇంతే!



గతంలో మన పాలసీనే అనుసరిస్తున్నారు సార్

## వయనాడ్ ప్రజలు
# ఓ ఛాన్స్ ఇవ్వండీ



పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ప్రియాంకా గాంధీ

కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక పోలింగ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పలు పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా పరిశీలించారు.

వివరాలు-6లో

## కాచిగూడ రైల్వే స్టేషన్‌లో
# జనౌషధి

- భారతీయ జనౌషధి కేంద్రాన్నిప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోడీ



3లో

బీహార్‌లో రూ. 12,100 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేసి మరియు జాతికి అంకితం చేసిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ
గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈరోజు అనగా నవంబర్ 13, 2024న రిమోట్ వీడియో లింక్ ద్వారా కాచిగూడ రైల్వే స్టేషన్‌తో సహ దేశవ్యాప్తంగా 18 ప్రదేశాలలో ప్రధాన్ మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలను ప్రారంభిచారు.



## గ్రామాల్లోనే
# పోలింగ్ జోరు



- ఝార్ఖండ్ లో కొనసాగుతున్న తొలి విడత పోలింగ్
- ఝార్ఖండ్ అసెంబ్లీకి రెండు విడతల్లో పోలింగ్
- ఝార్ఖండ్ అసెంబ్లీలో మొత్తం 81 స్థానాలు
- నేడు తొలి దశలో 43 స్థానాలకు ఎన్నికలు
- మధ్యాహ్నం ఒంటి గంటకు 46.25 శాతం పోలింగ్

వివరాలు-6లో



# ఏపీలో గత ప్రభుత్వానికి సంబంధించి కీలక వివరాలు వెల్లడించిన కాగ్

భారత ప్రభుత్వ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) ఏపీలో గత ప్రభుత్వానికి సంబంధించిన కీలక వ్యవహారాలను వెల్లడించింది. 2023 ఏప్రిల్ నాటికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వద్ద రాష్ట్ర నిల్వ రూ.19 కోట్ల లోటు ఉందని తెలిపింది. 2024 మార్చిలో ఆర్బీఐ వద్ద రాష్ట్ర నిల్వ రూ.33 కోట్ల లోటు ఉందని పేర్కొంది. ఆర్థిక సంవత్సరం చివరి నాటికి పెట్టుబడుల ఖాతాలో అసలు నగదు నిల్వలే లేవని కాగ్ స్పష్టం చేసింది.

2022-23లో ప్రభుత్వ అప్పులు రూ.4,86,151 కోట్లు అని వెల్లడించింది. ప్రభుత్వ అప్పులు రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో 34 శాతంగా ఉన్నాయని వివరించింది. 2023-24లో రూ.2,23,004 కోట్ల మేర ప్రభుత్వ గ్యారెంటీలు ఇచ్చారని... రూ.69,626 కోట్లు కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి పీడీ ఖాతాలకు బదిలీ చేశారని కాగ్ తెలిపింది.

కాగ్ వెల్లడించిన ఇతర అంశాలు...

2023-24లో రూపాయిలో 52 పైసలు పన్ను వసూళ్ల ద్వారానే వచ్చాయి.
గత ప్రభుత్వ హయాంలో రూపాయిలో 30 పైసలు రుణాలు తెచ్చారు.
రూపాయిలో... గ్రాంట్ ఇన్ ఎయిడ్ 14 పైసలు, పన్నేతర అంశాల ద్వారా 3 పైసలు, రుణాల రికవరీ ద్వారా 1 పైసా ఆర్జించారు.
రూపాయిలో 15 పైసలు జీతాల కోసం ఖర్చు చేశారు.
డీబీటీలకు 13 పైసలు, వడ్డీలకు 12 పైసలు చెల్లించారు.



# జలవనరుల శాఖపై చంద్రబాబు సమీక్ష

**● రాష్ట్ర ప్రభుత్వ వాటర్ పాలసీ, గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానంపై చర్చ ● నదుల అనుసంధానంతో ప్రతి ఎకరాకూ నీరు ● ఆర్థిక సమస్యలు, సవాళ్లు ఉన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టులపై ముందుకుపోతాం**

**● ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలనే లక్ష్యంతో రాష్ట్రంలో కొత్త సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. నదుల అనుసంధానం ద్వారా...వృాఎధాగా సముద్రంలో కలుస్తున్న నీటితో ప్రతి ఎకరాకు నీరు ఇవ్వొచ్చని సీఎం అభిప్రాయ పడ్డారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో పట్టిసీమ ద్వారా గోదావరి-కృాఎష్ణా నదుల అనుసంధానం పూర్తిచేసి లక్షల ఎకరాల సాగునీటి అవసరాలు తీర్చామని సీఎం అన్నారు. ఇప్పుడు దానికి కొనసాగింపుగా......నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకువెళ్లే ఆలోచనలో ఉన్నట్లు సీఎం చెప్పారు. ఇందులో భాగంగానే గోదావరి-కృాఎష్ణ-పెన్నా నదుల అనుసంధానంపై దృాఎష్టిపెట్టినట్లు సిఎం తెలిపారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే గోదావరి జలాలను రాయలసీమకు తీసుకువెళ్లేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని....ఇప్పుడు ఆ ప్రతిపాదనలను ముందుకు తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దీన్ని ముందుకు తీసుకువెళ్లడంలో భాగంగా సిఎం సూచనల మేరకు ఇరిగేషన్ అధికారులు గోదావరి-కృాఎష్ణ-పెన్నా నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ప్రతిపాదనలు సిద్ధం చేసి ముఖ్యమంత్రి ముందు ఉంచారు. గోదావరి-కృాఎష్ణ-పెన్నా నదుల అనుసంధానంపై వివిధ ప్రతిపాదనలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. గోదావరి నీటిని పోలవరం నుంచి కృాఎష్ణా నదికి, అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయర్ కు, అక్కడి నుంచి బనకచర్లకు తరలించే ప్రాజెక్టు ప్రతిపాదనలపై చర్చించారు. రెండో ప్రతిపాదన కింద....పోలవరం నుంచి కృాఎష్ణానదికి, అక్కడి నుంచి బొల్లాపల్లికి, అక్కడి నుంచి సోమశిల ప్రాజెక్టుకు నీటిని తరలించే ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి చర్చించారు. ఎక్కువ మొత్తంలో గోదావరి నీటిని తీసుకునేందుకు పోలవరం కుడి కాలువ సామర్థ్యం పెంచడం కోసం విస్తరణ చేపట్టాలా లేక కాలువకు సమాంతరంగా మరో కాలువ తవ్వాలా అనే అంశంపైనా చర్చించారు. రెండు ప్రతిపాదనల్లో దేని ద్వారా అయితే సత్వర ఫలితాలు వస్తాయి....దేనికి తక్కువ ఖర్చు అవుతుందనే అంశాలపైనా అధికారులు ప్రాథమిక వివరాలు తెలిపారు. మూడు నదుల అనుసంధానంతో పాటు....పోలవరం కాలువ సామర్థ్యం పెంపుపై మరింత కసరత్తు చేయాలని సిఎం సూచించారు. ఆర్థికంగా ఇదొక పెద్ద సవాల్ అయినా....రైతాంగ అవసరాలను, రాష్ట్ర ప్రజల భవిష్యత్ ను దృాఎష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టు చేపట్టాలనే ఆలోచనలో తాను ఉన్నట్లు సిఎం తెలిపారు.

అనంతరం....పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ పనులపై అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వునరావాసం కోసం ఇంకా 18,925 ఇళ్లు నిర్మించాల్సి ఉందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో 2022 నుంచి పోలవరం వునరావాస కాలనీల్లో అన్ని నిర్మాణాలను కాంట్రాక్టర్లు నిలిపివేసినట్లు అధికారులు వివరించారు. ప్రస్తుతం ఆ కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులే రూ.155 కోట్లు వరకు ఉన్నాయని తెలిపారు. పాత రేట్లతో ఇప్పుడు పనులు చేయలేమని కాంట్రాక్టర్లు చెవుతున్నారని అధికారులు వివరించారు. దీనిపై చర్చించి నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని సీఎం సూచించారు. తిరిగి పోలవరం పనులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో.....భూసేకరణ, వునరావాసం పనులు కూడా సమాంతరంగా చేపట్టాలని సిఎం సూచించారు. వీటికి తక్షణ అవసరాల కింద రూ.2,600 కోట్లు అవసరమని అధికారులు తెలపగా..దీనిపై త్వరలో ఆదేశాలు ఇస్తానని సిఎం తెలిపారు. పోలవరం డయాఫ్రం వాల్ నిర్మాణం, ఈసీఆర్ఎఫ్ డ్యాం నిర్మాణంపై ప్రాజెక్టు వద్ద జరిగిన వర్క్ షాప్ లో వచ్చిన అభిప్రాయాలు, నిర్ణయాలను అధికారులు సిఎంకు వివరించారు. పోలవరం పనుల షెడ్యూల్ పై పూర్తి స్థాయి స్పష్టత వచ్చిన తరువాత తాను పోలవరం ప్రాజెక్టును సందర్శించి...అక్కడే పనులపై షెడ్యూల్ ప్రకటిస్తానని ముఖ్యమంత్రి అధికారులకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకురానున్న వాటర్ పాలసీపైనా సమీక్షలో చర్చ జరిగింది. మరికొంత కసరత్తు తర్వాత దీన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించనుంది. ఈ సమీక్షలో జనవనరుల శాఖా మంత్రి రామానాయుడు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ మాఫియా అక్రమార్కులకు మంత్రి నాదెండ్ల వార్నింగ్

**● రేషన్ అవినీతిపరుల అరెస్టులు తప్పవన్న మంత్రి నాదెండ్ల ● కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 1,010 కేసులు నమోదు చేసినట్టు వెల్లడి ● 60 వేల మెట్రిక్ టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నామని వివరణ ● అక్రమ రవాణా జరగకుండా ప్రజల భాగస్వామ్యం అవసరమని పిలుపు**



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీ పౌరసరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రేషన్ మాఫియాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద ప్రజల కోసం సబ్సిడీపై రేషన్ బియ్యం అందిస్తుంటే... కొంతమంది రేషన్ మాఫియాగా ఏర్పడి అక్రమంగా రేషన్ బియ్యం తరలించడం దారుణం అని అన్నారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ, బియ్యం అక్రమ రవాణాపై కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 1,010 కేసులు నమోదు చేయడంతో పాటు 60 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సాధీనం చేసుకున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం అక్రమార్కుల అరెస్టులు తప్పవని హెచ్చరించారు. రేషన్ లో అవినీతికి పాల్పడిన వారు తమ నుంచి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రైస్ మిల్లులపై తనిఖీలు జరుగుతున్నాయని, ఇప్పటికే కృాఎష్ణా, గోదావరి, గుంటూరు, పల్నాడు జిల్లాలో స్వయంగా తానే తనిఖీలు నిర్వహించినట్లు గుర్తు చేశారు. అదేవిధంగా ప్రతి జిల్లాలో అక్రమ రవాణాపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాకినాడలో 13 రైస్ మిల్లులపై గతంలో తనిఖీలు నిర్వహించి క్రిమినల్ కేసులు నమోదు చేసినట్టు నాదెండ్ల పేర్కొన్నారు. పేదలకు అందాల్సిన బియ్యాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయకుండా అడ్డుకునేందుకు చెక్పోస్టును కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంస్కరణల్లో భాగంగా జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, సివిల్ సప్లై అధికారులు కలిసి ఎన్ఓసీ సర్టిఫికెట్ ఉంటేనే పోర్ట్ అధికారులు బియ్యం ఎగుమతికి అనుమతించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం కిలో 43 రూపాయల 40 పైసలకు కొనుగోలు చేసి పేద ప్రజలకు అందిస్తున్న బియ్యాన్ని కొందరు అక్రమ రవాణా చేయకుండా ప్రజలు కూడా అడ్డుకోవాలని మంత్రి నాదెండ్ల మనోహర్ పిలువునిచ్చారు. పీడీఎస్ రైస్ అక్రమ మళ్లింపులో కొంతమంది ఎండీయూ ఆపరేటర్ల ప్రమేయం ఉందని స్పష్టం చేశారు. అందులో భాగంగా కాకినాడ జాయింట్ కలెక్టర్ ఎనిమిది మంది ఎండీయూ ఆపరేటర్లకు జరిమానా విధించడంతో పాటు ఒక ఎండీయూ ఆపరేటర్ను తొలగించడం జరిగిందని మంత్రి నాదెండ్ల మనోహర్ శాసనమండలిలో వివరించారు.

# నిరుద్యోగులకు శుభవార్త చెప్పిన లోకేష్

**● రెండో రోజు ప్రజా ప్రాధాన్యత కలిగిన అంశాలపై చర్చ ● సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి చర్యలు ● రెండేళ్లలో ట్రైబల్ యూనివర్శిటీ ● వికేంద్రీకరణకు ప్రాధాన్యత**



ఏపీ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ అసెంబ్లీ సమావేశాలకు దూరంగా ఉన్నప్పటికీ, అధికార పార్టీ ప్రజలకు ఉపయోగ పడే అనేక అంశాలపై అర్థవంతమైన చర్చలు కొనసాగించింది. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు సంబంధించి తీసుకున్న చర్యలను సంబంధిత మంత్రులు వివరించారు. ప్రధానంగా డీఎస్సీ నోటిఫి కేషన్, ట్రైబల్ వర్సిటీ స్థలం, చింతలవూడి ప్రాజెక్టు, ఎర్ర కాలువ ఆధునీకరణ, మెట్రో రైల్ మార్గం వంటి ప్రధాన అంశాలపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.

**డీఎస్సీ నోటిఫికేష్ :** త్వరలోనే డీఎస్సీ నోటిఫి కేషన్ ఇవ్వబోతున్నట్లు మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. అసెంబ్లీలో ఇవాళ ఓ ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ విద్యపై తెలుగుదేశం పార్టీ ఎప్పుడు బాధ్యతగా వ్యవ హరిస్తుందన్నారు. టీడీపీ ఆవిర్భావం తర్వాత 11 డీఎస్సీల ద్వారా 1.5 లక్షల మంది ఉపా ధ్యాయులను నియమించినట్లు తెలిపారు. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి సంతకం మెగా డీఎస్సీ పైనే పెట్టామని గుర్తు చేశారు. అభ్యర్థుల సూచన మేరకు టెట్ తరువాత డీఎస్సీ పెట్టాలని భావించామని తెలిపారు. త్వరలోనే డీఎస్సీ ద్వారా 16 వేల పైచిలుకు పోస్టులు భర్తీ చేయబోతున్నట్లు పేర్కొన్నారు. సూపర్ సిక్స్ హామీలలో భాగంగా 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వచ్చే డీఎస్సీ ని పకడ్బందీగా అందరికీ ఆమోద యోగ్యంగా ఇవ్వాలని భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలని అధికారులు ఆదేశించినట్లు చెప్పారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ ఉపాధ్యాయ పోస్టులను కూడా వచ్చే ఏడాది భర్తీ లోకేశ్ ప్రకటించారు.

**రెండేళ్లలో ట్రైబల్ వర్సిటీ :** గత ప్రభుత్వ హయాంలో ట్రైబల్ వర్సిటీ స్థలం మార్చి అయిదేళ్లు పనులు సాగకుండా జాప్యం చేశారని, రాజకీయంగా తమకు మంచి పేరు వస్తుందని స్థలాన్ని మార్చారని మంత్రి లోకేశ్ చెప్పారు. 2019లో నిర్ణయించిన స్థలంలోనే వచ్చే రెండేళ్లలో సెంట్రల్ ట్రైబల్ వర్సిటీ పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. శాసనసభ్యులు బుచ్చయ్యచౌదరి, బోండా ఉమ అడిగిన ప్రశ్నలకు అసెంబ్లీలో ఆయన ఈ సమాధానమిచ్చారు.

**వికేంద్రీకరణకు ప్రాధాన్యత :** 2014-19 మధ్య సీఎం చంద్రబాబు అభివృాఎద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యతనిచ్చారని చెప్పారు. అనంతవురం జిల్లాకు కియా తెచ్చారు, చిత్తూరులో ఎలక్ట్రానిక్స్, నెల్లూరులో విండ్ టర్బయిన్, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, సెల్ ఫోన్, ఉభయగోదా వరిలో ఆక్వా, ఉత్తరాంధ్ర ఐటీ, మెడికల్ డివైస్, ఫార్మా పరిశ్రమలను ప్రోత్సహించారని చెప్పారు. విద్యాసంస్థల్లో ఐఐటీ తిరుపతికి, ఐఐఎంవిశాఖకి, ఎన్ఐటీ తాడేపల్లిగూడెంకు, ట్రిపుల్ ఐటీ కర్నూలుకు, సెంట్రల్ వర్సిటీ అనంతవు రానికి కేటాయించారని వివరించారు. అభివృాఎద్ధి వికేంద్రీకరణ అంటే ఇదని, రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడం కాదని లోకేశ్ పేర్కొన్నారు. ఆయా విద్యాసంస్థలకు పెండింగ్ లో ఉన్నరోడ్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృాఎషిచే స్తామని మంత్రి తెలిపారు.

**రెండేళ్లలో చింతలవూడి ప్రాజెక్టు :** రెండేళ్లలో చింతలవూడి ప్రాజెక్టును పూర్తి చేసి, సాగునీరు అందిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. చింతలవూడి ఎత్తిపోతల పథకం వురోగతిపై శాసన సభలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృాఎష్ణ ప్రసాద్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. 2014- 19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఈ ఎత్తిపోతల ప్రాజెక్ట్ కు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. రూ.3038 కోట్లు ఖర్చుపెట్టి 40 పనులు పూర్తి చేశామని తెలిపారు. గత ప్రభుత్వం కేవలం రూ.760కోట్లు ఖర్చుపెట్టి 5 శాతం పనులు చేసిందని ఆరోపించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ప్రాజెక్టు కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రాజెక్ట్ కున్న అవరోధాలను అధిగమించేందుకు, ఐదు నెలల్లోనే సీఎం ఆదుసార్లు సమీక్ష చేశారని వివరించారు.

**ఎర్ర కాలువ ఆధునికీకరణపై దృాఎష్టి పెడతాం :** ఎర్ర కాలువ ఆధునీకరణ పనులపై సభ్యులు అడిగిన ప్రశ్నకు కూడా మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. 2014లో గత టీడీపీ పాలనలో 6 వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న ఎర్ర కాలువను 20,250 క్యూసెక్కులకు పెంచేందుకు రూ.143 కోట్లు కేటాయించామన్నారు. 2018 లో భారీ వర్షాలకు ఎర్రకాలువ సామర్థ్యానికి మించి వరద రావడంతో గండ్లు పడ్డాయన్నారు. 2014-19 మధ్య రూ.52 కోట్ల పనులు చేసినట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో ఎర్ర కాలువ ఆధునికీక రణకు రూపాయి కూడా కేటాయుంచలేదని వివరించారు. నిధుల సమస్య ఉన్నా ఎర్రకాలువ ఆధునికీకరణ పనులపై ప్రత్యేకదృాఎష్టి పెడతామని మంత్రి స్పష్టం చేశారు. ప్రాజెక్టు కోసం ఇంకా 934 ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉందని తెలిపారు. భూసేకరణను 3 నెలల్లో పూర్తి చేసి, రూ.2500 కోట్లతో మొదటి దశలో పనులు చేపడతామని తెలిపారు. వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేసి 3 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు.

# చేనేత ఉత్పత్తుల అమ్మకాలకు - బిర్లా గ్రూపు సహకారం

**● ఒప్పందంలోని అంశాలపై చర్చ**

**● ఆద్యం రాకతో చేనేత వస్త్రాల విక్రయాలకు పెరగనున్న మార్కెట్ ● నేతన్నలకు ఏడాది పొడువునా ఉపాధి ● రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించడంతో పాటు నేతన్నలకు 365 రోజుల పాటు పని కల్పించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు నేతృాఎత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దీనిలో భాగంగా ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ఆద్యం హ్యాండ్-వోవెన్ సంస్థతో ఒప్పందం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని చేనేత ఉత్పత్తులు ప్రపంచ ప్రఖ్యాతి గాంచాయన్నారు. వాటిలో ఉప్పాడ జమధాని చీరలు, మంగళగిరి చీరలు, వెంకటగిరి చీరలు, ధర్మవరం సిల్క్ చీరలు, పావడాలు జియోగ్రాఫికల్ ఇండికేషన్ (.) హోదాను కలిగి ఉన్నాయన్నారు. ఈ వస్త్రలకు మరింత ప్రాచుర్యం కల్పించడంతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కలిగించడానికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కార్యాచరణ ప్రారంభించారన్నారు. దీనిలో భాగంగా రాష్ట్ర ఉత్పత్తులైన ఉప్పాడ-కాటన్ జమధాని, వులగుర్త-మల్కా ఖాదీ, అంగర-కాటన్ చీరలు, వెంకటగిరి-కాటన్ చీరలు, కోడుమూరు గద్వాల్ - కాటన్ చీరలకు ఆద్యం హ్యాండ్-వోవెన్ సంస్థతో కలిసి మార్కెటింగ్ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ లో ఉన్న ఆద్యం సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ ప్రతినిధి మనీష్ సక్సేనాతో కలిసి ఒప్పందంలోని అంశాలను గురువారం ఖరారు చేయాలని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ కమిషనర్ రేఖారాణిని ఆదేశించినట్లు తెలిపారు. ఆద్యం సంస్థ ఇప్పటికే దేశంలో వారణాసి, పోచంపల్లి, భుజ్ ప్రాంతాలకు చెందిన చేనేత సంఘాలతో పనిచేస్తోందన్నారు. ఏపీకి చెందిన చేనేత వస్త్రాల మార్కెటింగ్ పై ఆ సంస్థతో ఒప్పందం ఖారారైతే నేతన్నలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. స్వయంగా ఆ సంస్థ ఆధ్వర్యంలో చేనేత వస్త్రాల విక్రయాలకు మార్కెట్ సదుపాయం కలుగుతుందన్నారు. దీనివల్ల చేనేత వురాతన డిజైన్లను ఆద్యం సంస్థ భద్రపరచడంతో పాటు ఏపీ చేనేత కార్మికులకు ఏడాది పాటున ఉపాధి లభించి, ఆర్థిక భరోసా కలుగుతుందని మంత్రి సవిత ఆశాభావం వ్యక్తం చేశారు. గడిచిన అయిదేళ్లలో అన్ని రంగాలతో పాటు చేనేత రంగం కూడా నిర్వీర్యమైందన్నారు. అప్పటి ప్రభుత్వ నుంచి ఏవిధమైన భరోసా లభించకపోవడం, పెట్టుబడులు పెరగడం, వస్త్రాలకు మార్కెట్ సదుపాయం లేకపోవడం, చేసిన అప్పులు తీర్చేమార్గం లేకపోవడం వంటి కారణాలతో ఎందరో చేనేత కార్మికులు బలవర్మరణాలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో మరోసారి సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి రావడంతో, చేనేత పరిశ్రమకు మంచిరోజులు వచ్చాయన్నారు. 2014-19లో అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అమలుచేసిన అన్ని పథకాలను కూడా అమలు చేయనున్నామని తెలిపారు. అదే సమయంలో చేనేత వస్త్రాలపై జీఎస్టీ మినహాయింపునకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. నేతన్నలు గౌరవ ప్రదమైన జీవనం సాగించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

## అభివృద్ధి వికేంద్రీకరణ అంటే 500 కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడం కాదు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : 2014-19 మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృాఎద్ధి వికేంద్రీకరణకు ప్రాధాన్యతనిచ్చారని మంత్రి లోకేష్ తెలిపారు. ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన సెక్టార్ వైజ్ ఫోకస్ పెట్టి అభివృాఎద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. అనంతవురం జిల్లాకు కియా తెచ్చారు, చిత్తూరు జిల్లాకు ఎలక్ట్రానిక్స్, నెల్లూరు జిల్లాలో విండ్ టర్బయిన్, కర్నూలుకు రెన్యువబుల్ ఎనర్జీ, సెల్ ఫోన్, ఉభయగోదావరిలో ఆక్వా, ఉత్తరాంధ్రలో ఐటీ, మెడికల్ డివైసెస్, ఫార్మా పరిశ్రమలను ప్రోత్సహించారు. విభజన చట్టంలో రాష్ట్రానికి కేటాయించిన విద్యాసంస్థలను కూడా వేర్వేరు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఐఐటి తిరుపతికి , ఐఐఎం విశాఖకి, ఎన్ఐటి తాడేపల్లిగూడెంకు, ట్రిపుల్ ఐటీ కర్నూలుకు, సెంట్రల్ వర్సిటీ అనంతవురానికి కేటాయించారని అసెంబ్లీలో జరిగిన చర్చలో వివరించారు. అభివృాఎద్ధి వికేంద్రీకరణ అంటే ఇదేనని, 500 కోట్లతో ప్యాలెస్ కట్టుకోవడం కాదన్నారు.

## అసభ్యకర పోస్టులపై కేసు పెడితే తప్పేముంది..?



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై పోలీసులు కేసులు పెడుతున్నారంటూ పిల్ వేయడంపై హైకోర్టు అభ్యంతరం తెలిపింది. సోషల్ మీడియా యాక్టివిస్టుపై పోలీసులు మూకుమ్మడిగా కేసులు నమోదు చేయడంపై జర్నలిస్టు విజయబాబు వేసిన పిల్పై ఇవాళ విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఈ కేసులకు సంబంధించి పిల్ వేయడంపై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసభ్యకర పోస్టులు పెట్టిన వారిపై పోలీసులు కేసులు పెడితే తప్పేముందని న్యాయస్థానం ప్రశ్నించింది. న్యాయమూర్తులను కూడా అవమానపర్చేలా పోస్టులు పెట్టారని వ్యాఖ్యానించింది. పోలీసుల చర్యలను నిలువరిస్తూ ఎలాంటి బ్లాంకెట్ ఉత్తర్వులు ఇవ్వలేమని స్పష్టీకరించింది. పోలీసులు పెట్టిన కేసులపై అభ్యంతరం ఉంటే నేరుగా ఆయా కోర్టులను ఆశ్రయించవచ్చని వెల్లడించింది. తగిన ఉత్తర్వులు ఇస్తామని హైకోర్టు ధర్మాసనం వెల్లడించింది.

## ఆడవాళ్లను ఏమైనా అంటే రాయలసీమ వాసులు ఊరుకోరు

**● తల్లి, చెల్లిపై పోస్టులు పెట్టిన వాళ్లను జగన్ ఏమీ చేయలేకపోయారన్న అనిత ● కూటమి ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకుంటోందని వెల్లడి ● కొన్ని పోస్టులు చూస్తే దారుణంగా ఉన్నాయని ఆవేదన ● ఎలాంటి వాళ్లకు మద్దతిస్తున్నారో ఆలోచించుకోవాలని జగన్‌కు హితవు**




ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైఎస్ విజయమ్మ, షర్మిలపై సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో జగన్ ఎలాంటి చర్యలు తీసుకోలేదంటూ ఏపీ హోంమంత్రి అనిత విమర్శనాస్త్రాలు సంధించారు. ఆడవాళ్లను ఏమైనా అంటే రాయలసీమ వాసులు ఊరుకోరని... కానీ సొంత తల్లిని, చెల్లిని తిట్టిన వాళ్లను మీరు ఏమీ చేయలేకపోయారంటూ ఎత్తిపొడిచారు. మీ తల్లిని, మీ చెల్లిని తిట్టిన వాళ్లను ఇప్పుడు మేం అరెస్ట్ చేస్తున్నాం అని వెల్లడించారు. ఎలాంటి వారికి మీరు మద్దతు ఇస్తున్నారో ఓసారి ఆలోచించుకోవాలని అని జగన్ కు హితవు పలికారు. సోషల్ మీడియాలో కొన్ని పోస్టులు చూస్తే దారుణంగా ఉన్నాయని హోంమంత్రి అనిత ఆవేదన వ్యక్తం చేశారు. ఆఖరికి జడ్జిలను, వారి కుటుంబ సభ్యులను కూడా నోటికి వచ్చినట్టు మాట్లాడారని మండిపడ్డారు. ఆ సోషల్ మీడియా పోస్టులపై కోర్టు కూడా మొట్టికాయలు వేసిందని అన్నారు. ఇటువంటి దుర్మార్గమైన పోస్టులు పెట్టేవారిని ఏం చేయాలో ప్రజలే చెప్పాలని అనిత వ్యాఖ్యానించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన అనేకమంది టీడీపీ నేతలపై కేసులు పెట్టారని వెల్లడించారు.

## జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఆర్చరీలో ఆంధ్రప్రదేశ్‌కు బంగారు పతకాలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ ఆర్చరీలో ఆంధ్రప్రదేశ్ అండర్ 17 బాలురు మరియు బాలికల విభాగంలో బంగారు పతకాలు సాధించినట్లు రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ జి.భానుమూర్తి రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతున్న 68వ జాతీయ స్కూల్ గేమ్స్ ఈ నెల 11 నుండి 12 వరకు గుజరాత్ రాష్ట్రం నడియాడ్‌లో జరిగాయని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను మరియు టీం కోచ్, మేనేజర్లను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామ రాజు, సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఉప సభాపతి పదవికి రఘురామ నామినేషన్ దాఖలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ ఉప సభాపతి పదవికి ఉండి శాసన సభ్యులు కనుమూరు రఘు రామ కృాఎష్ణంరాజు పేరును ప్రతి పాదిస్తూ బుధవారం మూడు నామి నేషన్ దాఖలు అయ్యాయి. ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ఉప సభాపతి పదవికి వీరి పేరు ఖరారు కావడంతో ఎన్డీఏ కూటమి మూడు పార్టీలకు చెందిన పలువురు మంత్రుల నేతృాఎత్వంలో శాసన సభ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర కు ఆయన తరవున నామినేషన్ పత్రాలను అందజేశారు. శాసన సభ్యులు కనుమూరు రఘురామ కృాఎష్ణంరాజు పేరుని ప్రతిపాదిస్తూ ఎన్డీఏ కూటమిలోని మూడు పార్టీల తరువున మూడు నామినేషన్లను దాఖలు చేయడం జరిగింది. టి.డి.పి. తరవున రాష్ట్ర మానవ వనరుల అభివృాఎద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, జనసేన తరవున రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ మరియు బి.జె.పి. తరవున పెన్మత్స విష్ణుకుమార్ రాజు వేరు వేరుగా సంతకాలు పెట్టి ఉప సభాపతి పదవికి ఉండి శాసన సభ్యులు కనుమూరు రఘురామ కృాఎష్ణంరాజు పేరును ప్రతిపాదిస్తూ మూడు సెట్ల నామినేషన్లను దాఖలు చేయడం జరిగింది. ఉప సభాపతి పదవికి నేటి ఉదయం జారీచేసిన నోటిఫికేషన్ లో నేటి ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల్లోవు నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలనే నిబంధల మేరకు సాయంత్రం 4.30 గంటల సమయంలో ఈ నామినేషన్ పత్రాలను దాఖలు చేయడం జరిగింది. నేటి సాయంత్రం 5.00 గంటల కల్లా నామినేషన్లు దాఖలు చేసే గడువు ముగియడంతో, మరెవ్వరూ ఈ పదవికి నామినేషన్ దాఖలు పర్చకపోవడంతో రేవు మధ్యాహ్నం 12.00 గంటలకు ఉప సభాపతి పదవికి కనుమూరు రఘురామ కృాఎష్ణంరాజును ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించే అవకాశం ఉంది. రాష్ట్ర మానవ వనరుల అభివృాఎద్ధి శాఖ మంత్రి నారా లోకేష్, రాష్ట్ర ఆర్థిక శాఖ మాత్యులు పయ్యావుల కేశవ్, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరావు అచ్చెంన్నాయుడు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మరియు గాజువాక శాసన సభ్యులు మరియు టిడిపి రాష్ట్రాధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సూర్య
హైదరాబాద్
గురువారం
14 నవంబర్ 2024


# కలెక్టర్‌పై కావాలనే బీఆర్ఎస్ శ్రేణులు దాడి చేశాయి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: దాడులు సమస్యలకు పరిష్కారం కాదన్న ఉపముఖ్యమంత్రి లగచర్లలో కావాలనే కుట్రపూరితంగా కలెక్టర్పై బీఆర్ఎస్ శ్రేణులు దాడి చేశాయని తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన కొడంగల్ను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారన్నారు.
తెలంగాణ పారిశ్రామికంగా అభివృద్ధి సాధిస్తేనే ప్రపంచంతో పోటీ పడగలదన్నారు. పరిశ్రమలు రావాలంటే భూసేకరణ జరగాలని, అందుకే పరిశ్రమలు పెద్ద ఎత్తున తీసుకువచ్చి యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఫార్మా సిటీ కోసం భూమి కోల్పోతున్న రైతుల బాధను తాము అర్థం చేసుకోగలమన్నారు. అందుకే వారికి మెరుగైన ప్యాకేజీతో పాటు పరిశ్రమలో ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇళ్లు కోల్పోతున్న వారికి మంచి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. అయినప్పటికీ బీఆర్ఎస్ నాయకులు అమాయక గిరిజనులను రెచ్చగొట్టి కలెక్టర్పై దాడికి ఉసిగొల్పారని మండిపడ్డారు. కలెక్టర్, అధికారులపై దాడిని తాము ఖండిస్తున్నామన్నారు.
దాడులు సమస్యలకు పరిష్కారం కాదని గుర్తించాలన్నారు. తమది ఇందిరమ్మ రాజ్యమని, భావవ్యక్తీకరణకు స్వేచ్ఛ ఉందన్నారు. తెలంగాణకు పరిశ్రమలు రావడం బీఆర్ఎస్కు ఇష్టం లేనట్లుగా ఉందని, అందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. అధికారులపై దాడులు చేస్తే వెనక్కి తగ్గుతామని భావిస్తున్నారేమో... కానీ అలా జరగదని స్పష్టం చేశారు. వారి కోసం అమాయక ప్రజలు నష్టపోవాలా? అని ప్రశ్నించారు. ఉద్యమం సమయంలో కూడా అమాయకులను రెచ్చగొట్టి ప్రాణాలు తీశారని ఆరోపించారు.

# కాచిగూడ రైల్వే స్టేషన్‌లో జన ఔషధి

● వర్చువల్ గా ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీ ● కాచిగూడతోపాటు దేశ వ్యాప్తంగా 18చోట్ల జన ఔషధి కేంద్రాలు ● కాచిగూడ స్టేషన్ నుంచి ప్రతిరోజు 47వేల మంది రాకపోకలు ● పాల్గొన్న హైదరాబాద్ డీవీఎం, రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ ● అదనపు డీవీఎం ఎమ్.ఏ.రెహ్మాన్






హైదరాబాద్: బీహార్లో రూ. 12,100 కోట్ల విలువైన బహుళ అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసి పూర్తయిన వాటిని జాతికి అంకితం చేశారు. రిమోట్ వీడియో లింక్ ద్వారా కాచిగూడ రైల్వే స్టేషన్తో సహ దేశవ్యాప్తంగా 18 ప్రదేశాలలో ప్రధాన్ మంత్రి భారతీయ జనౌషధి కేంద్రాలను ప్రారంభి%శీ%చారు. ఈ సంధర్భంగా కాచిగూడ రైల్వే స్టేషన్లో కూడా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్‌బీ హైదరాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ఎమ్.ఏ.రెహ్మాన్ మరియు ప్రధాన కార్యాలయం మరియు హైదరాబాద్ డివిజన్ నుండి ఇతర రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈరోజు గౌరవ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ బీహార్లోని దర్భంగాలో దాదాపు రూ 12,100 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఈ అభివృద్ధి ప్రాజెక్టులలో ఆరోగ్యం, రైలు, రోడ్డు, పెట్రోలియం మరియు సహజ వాయువు రంగాలు ఉన్నాయి.
ఈ సభలో ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ప్రజల సంక్షేమం మరియు దేశ సేవ పట్ల ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, రోడ్డు, రైలు మరియు గ్యాస్ మౌలిక సదుపాయాలతో కూడిన సుమారు రూ.12,000 కోట్ల విలువైన నేటి అభివృద్ధి పథకాలను ప్రధాన మంత్రి ప్రస్తావించారు. అతి తక్కువ ధరలకు మందులను అందించే జన్ ఔషధి కేంద్రాలను కూడా ఆయన ప్రస్తావించారు.
ఆరోగ్యానికి సంబంధించి ప్రభుత్వం అవలంబిస్తున్న సమగ్ర విధానాన్ని ప్రధాన మంత్రి నొక్కిచెప్పారు. ప్రభుత్వం యొక్క ప్రాధాన్యత అంశాలను వివరిస్తూ దృష్టి సారించవలసిన ప్రాధాన్యత అంశాలలో వ్యాధుల నుండి నివారణ మొదటిదని బీ అనారోగ్యం యొక్క సరైన నిర్ధారణ రెండవదనిబీ ఉచిత లేదా తక్కువ ఖర్చుతో కూడిన చికిత్స మరియు ఔషధాల లభ్యత మూడవదని బీ చిన్న పట్టణాలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడం నాల్గవదని మరియు ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం యొక్క విస్తరణ ఐదవదని తెలియజేశారు.
హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్ మాట్లాడుతూ గౌరవ ప్రధాన మంత్రి కాచిగూడ స్టేషన్తో పాటు 18 ప్రదేశాలలో జనౌషధి కేంద్రాలను ప్రారంభించడం ఒక చారిత్రాత్మక సందర్భమని అన్నారు. రైల్వే స్టేషన్లలో సౌకర్యాలు మరియు సదుపాయాలను స్థిరంగా పునరాభివృద్ధి చేయడం ద్వారా ప్రజల విభిన్న అవసరాలను తీర్చేందుకు భారతీయ రైల్వే కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. జనౌషధి కేంద్రాలు సరసమైన ధరలకు మందులను అందించడం ద్వారా సమాజంలోని అన్ని వర్గాలలో ఆరోగ్యం మరియు సంక్షేమాన్ని పెంపొందించడానికి సహాయపడతాయని మరియు రైల్వే స్టేషన్లలో ప్రయాణీకులు మరియు సందర్శకులు జనౌషధి ఉత్పత్తులను సులభంగా లభించడానికి వీలు కల్పిస్తాయని ఆయన చెప్పారు. ప్రతి రోజూ సుమారు 47,000 మంది ప్రయాణికులు రాకపోకలతో దక్షిణ మధ్య రైల్వేలోని ప్రధాన స్టేషన్లలో కాచిగూడ రైల్వే స్టేషన్ ఒకటి. ప్రజల సౌకర్యార్థం దాదాపు 100 రైళ్లు ఈ స్టేషన్ నుండి ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తాయి. కాచిగూడ స్టేషన్ ప్రాంగణంలో ప్రారంభించబడిన ఈ జనౌషధి కేంద్రం సరసమైన ధరలకు నాణ్యమైన మందులను కొనుగోలు చేయడంలో ప్రజలతో పాటు వేలాది మంది ప్రయాణికులకు ప్రత్యేకంగా ఉపయోగపడుతుంది.

## ప్రజల సంక్షేమమే
# కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ప్రజల సంక్షేమమే తన ధ్యేయమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం ఆయన నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజల వద్ద నుండి పిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత అంశాలకు సంబంధించిన పిర్యాదుదారులు ఎక్కువ ఫిర్యాదులు సమర్పించారు. ఉద్యోగ ,ఉపాధి , పెన్షన్ మంజూరి తదితర అంశాలపై ఎక్కువ మంది మంత్రికి ఫిర్యాదులను సమర్పించారు ఈ సందర్భంగా మంత్రి నల్గొండ సెంట్రల్ లైబ్రరీకి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా సుమారు 10 లక్షల రూపాయల విలువచేసే పుస్తకాలను లైబ్రరీ సెక్రెటరీ బాలమ్మ,లైబ్రేరియన్ నాగయ్య లకు అందజేశారు. అంతేకాక పెద్ద సూరారంకు చెందిన విశ్రాంత హాస్టల్ వెల్ఫేర్ అధికారి వెంకటరామిరెడ్డి కుమారుడు డాక్టర్ ఏడుదొడ్ల సూర్యప్రకాశ్ రెడ్డి, డాక్టర్ మౌనికలు అదే గ్రామానికి చెందిన బీటెక్ 2 వ సంవత్సరం చదివే విద్యార్థి ముసుకు సుమన్ కు 40 వేల రూపాయల విలువ చేసే ల్యాప్ టాప్ ను ఇవ్వగా మంత్రి చేతుల మీదుగా అందజేశారు. మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి ,వైస్ చైర్మన్ అబ్బోని రమేష్ గౌడ్, మాజీ జెడ్పిటిసి లక్ష్మయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ తదితరులు ఉన్నారు

# బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సీతక్క



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: భారత తొలి ప్రదాని జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని జరుపుకునే బాలల దినోత్సవం సందర్భంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క చిన్నారులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మన దేశంలో ఉన్న ప్రతి బిడ్డా ఆనందంగా ఉండాలనే నెహ్రూ ఆకాంక్ష రూపమే బాలల దినోత్సవం అని పేర్కొన్నారు.ఆధునిక భారతదేశం కోసం నెహ్రూ గారు చేసిన సేవలను మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. దేశాన్ని వెనకబాటుతనం నుంచి వికాసం వైపు నడిపించిన దార్శనికుడిగా నెహ్రూను చిరకాలం ప్రజలు గుర్తు పెట్టుకుంటారని అన్నారు. నెహ్రూ చలవతోనే ప్రపంచ పటంలో దేశానికి ప్రత్యేక స్థానం దక్కిందన్నారు. పిల్లలను జాతి సంపదగా భావించి వారి భవితవ్యానికి, అభివృద్ధికి నెహ్రూ కృషి చేశారని మంత్రి సీతక్క గుర్తు చేశారు. నెహ్రూ ఆశయాల వెలుగులో పిల్లలకు సరైన విద్య, ఆరోగ్యం, సంక్షేమం అందించడానికి, పిల్లల హక్కుల రక్షణ కు తన ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి సీతక్క తెలిపారు.

# అభివృద్ధి చేస్తామంటే అల్లరి మూకలతో దాడులా?



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: కొడంగల్ నియోజకవర్గాన్ని ఇప్పుడు అభివృద్ధి చేసుకోకపోతే ఎప్పటికీ అభివృద్ధి చేసుకోలేమని సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులపై మొన్న జరిగిన దాడిలో ఎంత మంది ఉన్నారో వారందరిపై విచారణ జరిపి కేసులు పెడతామని ఆయన తెలిపారు. లగుచర్ల ఘటన దురదృష్టకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు, కొండగల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జ్ తిరుపతి రెడ్డి అన్నారు. 50 సంవత్సరాలుగా వెనకబడిన కొండగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సీఎం పరితపిస్తుంటే బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు అడ్డుపడుతున్నారని తిరుపతి రెడ్డి ఆరోపించారు. నియోజకవర్గం అభివృద్ధి కాకుండా ఆ పార్టీ నేతలంతా శాయశక్తులా పని చేస్తున్నారని మండిపడ్డారు. కొంతమంది చిల్లర, మల్లర మూకలను రప్పించి అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని తిరుపతి రెడ్డి ధ్వజమెత్తారు. కొడంగల్ నియోజకవర్గాన్ని ఇప్పుడు అభివృద్ధి చేసుకోకపోతే జీవితంలో ఎప్పటికీ అభివృద్ధి చేసుకోలేమని తిరుపతి రెడ్డి చెప్పారు. జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అధికారులపై మొన్న జరిగిన దాడిలో ఎంత మంది ఉన్నారో వారందరిపై విచారణ జరిపి కేసులు నమోదు చేస్తామని ఆయన తెలిపారు. ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం భూములు కోల్పోతున్న రైతులు పరిహారం కావాలంటే సీఎం రేవంత్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్ లేదా తమకు చెప్పుకోవాలని కోరారు. అల్లరి మూకలతో అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే నష్టపోయేది కొడంగల్ ప్రజలేనని ఆయన ఉద్ఘాటించారు. ఇప్పుడు వచ్చిన అవకాశం మళ్లీమళ్లీ రాదని తెలిపారు. కేటీఆర్, హరీశ్ రావు, నరేందర్ రెడ్డిలు అమాయక యవతను మద్యానికి బానిసలుగా చేశారని, వారిని రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నారని తిరుపతి రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల మోసపూరిత మాటలు నమ్మి యువకులు మోసపోవద్దని ఆయన హెచ్చరించారు. గొడవలకు పోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా రైతులను ఒప్పించి, మెప్పించి, వాళ్ల అంగీకారంతో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తామని తిరుపతి రెడ్డి తేల్చి చెప్పారు.

# దాడి వెనుక ఎవరున్నారో గుర్తించి చర్యలు తీసుకుంటాం



తెలంగాణ బ్యూరో ప్రతినిధి: ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకు వచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. రైతుల పేరుతో కలెక్టర్ పై దౌర్జన్యానికి పాల్పడిన నిందితులను మీడియా ముందు ప్రవేశపెడతామన్న మంత్రి తెలిపారు. రైతుల పేరుతో కొంతమంది దౌర్జన్యానికి పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్పై లగచర్లలో జరిగిన దాడి ఘటన వెనుక ఎవరు ఉన్నారో గుర్తించి తప్పకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు. ఇలాంటి ఘటనల ద్వారా ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ... దాడి ఘటనకు సంబంధించి నిందితులను మీడియా ముందు ప్రవేశపెడతామన్నారు. రైతుల పేరుతో కొంతమంది గులాబీ ముసుగు వేసుకొని దౌర్జన్యానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఈ ఘటన వెనుక ఎవరు ఉన్నారో బయటకు రావాల్సి ఉందన్నారు. వికారాబాద్ ఘటన వెనుక ఉన్నది ఎవరో త్వరలో తేల్చుతామన్నారు. ప్రజలకు మంచి చేద్దామని తాము భావిస్తే బద్నాం చేయాలనుకోవడం దారుణమన్నారు.

# కేటీఆర్ విచారణకు గవర్నర్ అనుమతి కోసం చూస్తున్నాం

● టిఆర్ఎస్ హయాంలో అవినీతి పై స్పందించకుండా కాంగ్రెస్ పై విమర్శలు ● కెసిఆర్ కుటుంబ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే నాపై కేటీఆర్ ఆరోపణలు ● మహారాష్ట్రలో బీఆర్ఎస్ ఎందుకు పోటీ చేయట్లేదు ● బిజెపితో మిలాఖత్ అయిన బి ఆర్ ఎస్ ● రక్షణ కోసమే కేటీఆర్ ఢిల్లీ టూర్ ● సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు.
కొన్నిసార్లు ప్రత్యక్షంగా, మరికొన్ని సార్లు పరోక్షంగా సహకరించుకుంటున్నాయని అన్నారు. ఓ అవినీతి కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను విచారించేందుకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అనుమతి కోసం ఏసీబీ లేఖ రాసిందని.. 15 రోజులైనా ఇప్పటివరకు అనుమతి రాలేదని చెప్పారు. ఈ కేసులో ఆయనను రక్షించుకునే ప్రయత్నాల్లో భాగంగా కేటీఆర్ ఢిల్లీలో పర్యటించారని అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. కొన్నిసార్లు ప్రత్యక్షంగా, మరికొన్ని సార్లు పరోక్షంగా సహకరించుకుంటున్నాయని అన్నారు. ఓ అవినీతి కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను విచారించేందుకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అనుమతి కోసం ఏసీబీ లేఖ రాసిందని.. 15 రోజులైనా ఇప్పటివరకు అనుమతి రాలేదని చెప్పారు. అది గవర్నర్ కార్యాలయంలోనే పెండింగ్లో ఉందని తెలిపారు. ఈ కేసులో ఆయనను రక్షించుకునే ప్రయత్నాల్లో భాగంగా కేటీఆర్ ఢిల్లీలో పర్యటించారని అన్నారు. మంగళవారం రోజున ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో, ఆ తర్వాత మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. ఏసీబీకి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నుంచి అనుమతి లభించిన తర్వాత కేటీఆర్పై చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై విచారణకు స్పందించకుండా కేటీఆర్ తనపై ఎదురుదాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన కేసీఆర్ కుటుంబ అవినీతిపై చర్చ జరగకుండా ఉండేందుకు తనపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. అమృత్ స్కీమ్ టెండర్లకు సంబంధించి కేటీఆర్ తనపై చేసిన ఆరోపణలనురేవంత్ రెడ్డి తోసిపుచ్చారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డికి సృజన్ రెడ్డి అల్లుడు అని.. బీఆర్ఎస్ హయాంలో సృజన్రెడ్డికి వేల కోట్ల పనులు ఇచ్చారని రేవంత్ అన్నారు.
ఈ విషయంలో న్యాయపరంగా ముందుకు వెళ్లే స్వేచ్ఛ వారికి (కేటీఆర్కు) ఉందని చెప్పారు. టెండర్లలో ఏమైనా ఉంటే లీగల్గా పోరాటం చేయాలని.. వారిని అడ్డుకునేదెవరు? అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ అవినీతి పార్టీ అని దానిని తెలంగాణలో అంతం చేస్తామని బీఆర్ఎస్, కేటీఆర్ మాట్లాడారని ఇప్పుడు కేటీఆర్ అదే పార్టీకి చెందిన మంత్రులకు లేఖలు సమర్పిస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్, బీజేపీల మధ్య కుదిరిన రహస్య అవగాహన ఇప్పుడు బయటికి వస్తోందని చెప్పారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతిస్తోందని ఆరోపించారు. మహారాష్ట్రలో బీఆర్ఎస్ను బలోపేతం చేసి, అభ్యర్థులను బరిలో నిలుపుతామన్న కేసీఆర్ ఎందుకు పోటీలో అభ్యర్థులను నిలపలేదని ప్రశ్నించారు.
మహారాష్ట్రలో మోదీని ఓడించాలని.. తెలంగాణ ఏర్పాటుకు మద్దతు ఇచ్చిన శరద్ పవార్ను గెలిపించాలని కేసీఆర్ ఎందుకు అడగటం లేదని ప్రశ్నించారు. ఇక, వికారాబాద్ జిల్లాలో అధికారులపై దాడికి పాల్పడిన వారిపై, దాడి వెనుక ఉన్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మరోవైపు మంగళవారం రోజున ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. తెలంగాణలో రూ.8,888 కోట్ల విలువైన అమృత్ స్కీమ్ టెండర్లలో జరిగిన అవకతవకలపై కేంద్రం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆయన బావమరిది సృజన్ రెడ్డి సంస్థకు రూ.1,137 కోట్ల కాంట్రాక్టును కట్టబెట్టారని ఆరోపించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ను కలిసి విచారణ జరిపి అమృత్ టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం సమర్పించారు. ఇదిలాఉంటే, హైదరాబాద్లో ఫార్ములా-ఇ రేస్ నిర్వహణకు సంబంధించి గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన అవకతవకలపై కేటీఆర్పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అనుమతి కోరుతూ తెలంగాణ ప్రభుత్వం ఇటీవల గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు లేఖ రాసింది.

# నాకు మంత్రి పదవి కంటే
# మాలల అభివృద్ధి ముఖ్యం

తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తమ కుటుంబంలో ఒకరికి మంత్రి పదవి ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని పెద్దపల్లి ఎమ్మెల్యే వివేక్ అన్నారు. తెలంగాణలో కేబినెట్ విస్తరణపై చర్చ జరుగుతున్న సమయంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాకా కుటుంబంలో ఒకరికి మంత్రి పదవిపై హామీ లభించింది, కానీ నాకు మాలల అభివృద్ధి, హక్కులు ముఖ్యం. మంత్రి పదవి కాదని వివేక్ అన్నారు. త్వరలో హైదరాబాద్లోని పరేడ్ మైదానంలో మాలల భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, ఈ సభకు అందరూ రావాలని పిలుపునిచ్చారు. మాలల ఐక్యతను చాటుదామన్నారు. దళితుల్లో ఉపకులాలు ఎక్కువగా ఉన్నాయని, వారందరికీ న్యాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేటు ఉద్యోగాల్లో కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణలో 15 పర్సంట్ కమీషన్ పాలన

● రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారు ● 6 గ్యారంటీల్లో ఒక్కటీ అమలు చేయలే ● కోట్ల యాడ్స్ ఇచ్చి మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాల నుకుంటున్నారు ● తెలంగాణ పైసలన్నీ మహారాష్ట్రలో ఖర్చు చేస్తున్నారు ● ముస్లిం రిజర్వేషన్లను సుప్రీంకోర్టే కొట్టేసింది ● అయినా మైనారిటీ రిజర్వేషన్ల పేరుతో మోసం చేసే కుట్ర ● కుల గణన పేరుతో ప్రజల ఆస్తిపాస్తులపై కన్నేశారు ● ఛత్రపతి శివాజీ వారసులారా.... మొగల్స్ కోటను బద్దలు కొట్టిన చరిత్ర మీది ● కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టండి ● నాగ్ పూర్‌లో మీడియా సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్



తెలంగాణ బ్యూరో, ప్రతినిధి: తెలంగాణలో 'కమీషన్ల' పాలన కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ప్రతి పనిలోనూ, కాంట్రాక్టుల్లోనూ 15 శాతం కమీషన్ తీసుకుంటూ తెలంగాణను లూటీ చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజలకిచ్చిన ఏ ఒక్క హామీని కూడా ఇప్పటి వరకు పూర్తిగా అమలు చేయలేదన్నారు. అయినప్పటికీ అన్ని హామీలు అమలు చేస్తున్నట్లుగా మహారాష్ట్ర ఎన్నికల్లో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి యాడ్స్ ఇస్తూ మోసం చేయాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. 20 లక్షల మంది రైతులకు రుణమాఫీ ఇవ్వలేదని వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించినప్పటికీ....తెలంగాణలో రుణమాఫీ అమలు చేసినట్లుగా మహారాష్ట్ర ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోందన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో తెలంగాణ సొమ్మును ఖర్చు చేస్తూ తెలంగాణను మరింత దివాళా తీయిస్తున్నారని మండిపడ్డారు. ముస్లిం రిజర్వేషన్ల అమలు చెల్లదని సుప్రీంకోర్టు కొట్టేసినప్పటికీ మైనారిటీ రిజర్వేషన్ల అమలు పేరుతో మహారాష్ట్ర ప్రజలను మోసం చేయాలని చూస్తోందన్నారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు నాగపూర్ లో మీడియా సమావేశం నిర్వహించారు. కర్నాటక బీజేపీ ప్రతిపక్ష నేత నారాయణస్వామి, హిమాచల్ ప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాజీవ్ బిందాల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగడి మనోహర్ రెడ్డి లతో కలిసి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడికి(మహారాష్ట్ర)కు వచ్చి మాట్లాడినవన్నీ పచ్చి అబద్దాలే. తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని చెప్పడం అవాస్తవం. తెలంగాణ సొమ్మును వెచ్చించి మహారాష్ట్రలో యాడ్స్ ఇచ్చారు. కానీ ఆ యాడ్స్ లో ఆరు గ్యారంటీల ఊసే లేదు. తప్పుడు హామీలతో ఇక్కడ ప్రజలను మోసం చేయాలనుకుంటున్నారు. అందుకే వాస్తవాలు చెప్పేందుకే మీ ముందుకొచ్చాను. కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలలో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో అమలు చేయనేలేదు. మేనిఫెస్టోలో పొందుపర్చిన 420 హామీల్లో కూడా ఒక్కటీ అమలు చేయలేదు. ఎందుకంటే కాంగ్రెస్ ఫోర్ ట్వంటీ సర్కార్. తెలంగాణలో ప్రతి మహిళకు ఒక తులం (10 గ్రాములు) బంగారం, ఒక స్కూటీ, నెలకు రూ. 2,500 నెలసరి పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చారు. ఒక్కరికి కూడా ఇవ్వలేదు. నిరుద్యోగ యువతకు ప్రతి నెల రూ.4 వేల నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇయ్యలే. విద్యార్థులకు రూ.5 లక్షల భరోసా కార్డు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారు. వృద్ధాప్య పింఛన్ను నెలనెలా రూ.4 వేలు ఇస్తామని హామీ ఇచ్చి మాట తప్పారు. పేదలకు ఇండ్ల జాగాతోపాటు ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షలిజస్తామని మోసం చేశారు. తెలంగాణలో రైతులను నిండా ముంచారు. రైతులు, కౌలు రైతులకు ప్రతి ఎకరానికి రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలిస్తామని హామీ ఇచ్చారు. వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్నారు. బోనస్ సంగతి దేవుడెరుగు కనీస మద్దతు ధర (ఎమ్ ఎస్ పి) కూడా లభించకుండా చేస్తున్నారు. ఉద్యోగులకు నాలుగు డీఏలివ్వలేదు. పీఆర్సీ అమలు చేయలేదు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతం పెంచుతామని బీసీ వర్గాలను కూడా మోసం చేశారు. కాంగ్రెస్ పార్టీ తొలుత హిమాచల్ ప్రదేశ్లో 10 గ్యారంటీలిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చారు. కర్ణాటకలో పాంచ్ న్యాయ్ పేరుతో, తెలంగాణలో ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చాక ప్రజలను నిలువునా మోసం చేశారు. హర్యానాలోనూ ఇట్లాంటి హామీలతో అధికారంలోకి రావాలని భావిస్తే... ప్రజలు కాంగ్రెస్ను తిప్పి కొట్టారు. ఇప్పుడు మళ్లీ మహారాష్ట్రలోనూ మహిళలకు రూ.3 వేలు, నిరుద్యోగ యువతకు రూ.4 వేలు ఇస్తామని హామీలు గుప్పిస్తున్నారు. కుల గణన వాగ్దానం చేస్తూ మోసం చేయాలని ప్రయత్నిస్తున్నారు. విజ్ఞులైన మహారాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ అబద్ధాలను విశ్వసించరు. తెలంగాణలో కుల జనగణన పేరుతో ఆస్తిపాస్తుల వివరాలు సేకరించాలని చూస్తుంటే ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. కుల గణన సంగతి తరువాత ముందుగా 6 గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలోనే నిండా అవినీతిలో కూరుకుపోయింది. రాష్ట్రాన్ని లూటీ చేస్తున్నారు. మూసీ పునరుజ్జీవం పేరుతో రూ.1.5 లక్షల కోట్లను దోచుకునేందుకు సిద్ధమయ్యారు. మూసీ పునరుజ్జీవానికి బీజేపీ వ్యతిరేకం కాదు. ఆ పేరుతో జరుగుతున్న దోపిడీకి వ్యతిరేకం. తెలంగాణలో 15 శాతం కమీషన్ల పాలన నడుస్తోంది. ఏ పని కావాలన్నా, ప్రాజెక్టు కావాలన్నా 15 శాతం కమీషన్ తీసుకుంటున్నారు.
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఎంఐఎం తో కలిసి పనిచేస్తూ ఒక వర్గం ఓట్ల కోసం హిందువులపై వివక్ష చూపుతోంది. తెలంగాణలో హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయి. గత పది నెలల్లోనే దాదాపు 100కుపైగా దేవాలయాలపై దాడులు జరిగాయి. సల్మాన్, సలీం, ఖుర్షీద్, ఇక్బాల్ వంటి వారు ఇట్లాంటి దాడులకు పాల్పడుతున్నా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదు. కాంగ్రెస్ పార్టీ ఇదే ఫార్ములాను మహారాష్ట్రలో కూడా అమలు చేయాలని ప్రయత్నిస్తోంది. కులం, మతం ఆధారంగా చీల్చి అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తోంది. 2004లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ సుప్రీంకోర్టు ముస్లిం రిజర్వేషన్లను కొట్టివేసింది. అయినప్పటికీ ఇదే హామీని మహారాష్ట్ర ప్రజలకు ఇస్తూ మరోసారి మోసం చేయాలని చూస్తోంది. ఈరోజు పత్రికలో చదివాను. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పనుల కాంట్రాక్టుల్లో 4 శాతం పనులు ముస్లిం లకు ఇవ్వాలని ప్రతిపాదనలు రూపొందించింది. ఇది దుర్మార్గమైన చర్య. మహారాష్ట్ర ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మస్థలం మాత్రమే కాదు. దేశానికి నడిబొడ్డుగానూ నిలిచింది. భక్తి ఉద్యమం, స్వాతంత్ర్య పోరాటం, ఇంకా ప్రతి రంగంలో దేశానికి నాయకత్వం వహించింది. మొగల్స్ కోటను బద్దలు కట్టిన చరిత్ర మహారాష్ట్రది. ముస్లిం రిజర్వేషన్లను అమలు చేయాలనుకుంటున్న కాంగ్రెస్ కు మద్దతిస్తారా? ఆ ప్రశ్నే ఉత్పన్నం కాకూడదని కోరుతున్నా. మహారాష్ట్రను అభివృద్ధిలో అన్ని విధాలా ముందుకు తీసుకెళ్లడానికి, ప్రజలకు సేవ చేయడానికి బీజేపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరుతున్నా. జై భారత్, జై మహారాష్ట్ర. ధన్యవాదాలు.

DBS

## వేలం ప్రకటన

మా బ్యాంక్ యొక్క దిగువ పేర్కొన్న జ్యువెల్ లోన్ కస్టమర్‌లు మా రిమైండర్‌లు మరియు రిజిస్టర్డ్ అడ్రస్ కారణంగా రసీదుతో కూడిన రిజిస్టర్ చేసిన పోస్ట్‌ను ఇప్పటికే వారికి పంపిన తర్వాత కూడా వారి రుణ ఖాతాలను సెటిల్ చేయడంలో విఫలమయ్యారని సమాచారం. పూర్తి రుణ మొత్తాన్ని **22.11.2024**న లేదా అంతకు ముందు సెటిల్ చేయకపోతే, కస్టమర్ తాకట్టు పెట్టిన సెక్యూరిటీలు **22.11.2024**న **ఉదయం 11.00 గంటలకు** లేదా బ్యాంకుకు అనుకూలమైన మరేదైనా తేదీకి వేలం ద్వారా విక్రయించబడతాయి.తదుపరి నోటీసు లేకుండా మరియు బ్యాంక్ ప్రాంగణంలో లేదా ఈ-వేలం ప్లాట్‌ఫామ్‌లో బహిరంగ వేలం విక్రయం ద్వారా బ్యాంక్ యొక్క పూర్తి సంతృప్తి కోసం. https://egold.auctiontiger.net

| Ref. No. | Customer Name | Branch Name | Gross weight | Net weight |
|---|---|---|---|---|
| 47739362 | సుబ్బురాజ్ యం | మెహదీపట్నం, హైదరాబాద్ | 72.00 | 72.00 |
| 96236628 | జ్యోతి ఆర్ | మహబూబ్‌నగర్ | 27.80 | 27.00 |
| 96236293 | యండి సాజిద్ | మహబూబ్‌నగర్ | 203.60 | 200.60 |
| 96236345 | మలిం కుర్షీద్ అహ్మద్ | మహబూబ్‌నగర్ | 43.00 | 42.50 |
| 96236530 | మహమ్మద్ అబ్దుల్ ఓవైస్ | మహబూబ్‌నగర్ | 193.10 | 188.10 |
| 13935586 | అనూష మలెంపాటి | అల్వాల్, సికింద్రాబాద్ | 51.70 | 46.30 |
| 14934206 | చిరంజీవి బొమ్మక్ | బోడుప్పల్ | 42.20 | 38.80 |
| 61235695 | చంద్రపాల్ రెడ్డి కొలన్ | రామచంద్రాపురం, హైదరాబాద్ | 26.00 | 26.00 |
| 61235914 | శ్రీకాంత్ కుమార్‌రెడ్డి మొలుగు | రామచంద్రాపురం, హైదరాబాద్ | 126.50 | 108.50 |
| 96435555 | రామగిరి జగదీష్ | మలిపురం | 23.30 | 20.50 |
| 96435616 | శంభులింగం చిట్టలూరి | మలిపురం | 53.50 | 48.15 |
| 96435623 | శంభులింగం చిట్టలూరి | మలిపురం | 38.60 | 34.75 |

తేది : 12.11.2024
స్థలం : చెన్నై
అధీకృత అధికారి
డిబిఎస్ బ్యాంక్ ఇండియా లిమిటెడ్
* DBS బ్యాంక్ ఇండియా లిమిటెడ్ అనేది DBS బ్యాంక్ లిమిటెడ్ సింగపూర్ నుండి పూర్తి లైసెన్స్ క్రింద అనుబంధ సంస్థ

నిరక్షరాస్యత నిర్మూలనే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా- దేశంలో బాలలందరికీ విద్య గగన కుసుమమే అవుతోంది. సార్వత్రిక విద్యా వ్యాప్తికి ప్రభు త్వాలు పలు పథకాలు చేపట్టినా ఇంకా అధిక శాతం పిల్లలు విద్యాగంధం లేక బాల కార్మికులు గానే ఉండి పోతున్నారు. బాలల శ్రేయస్సుకు కృషి జరుగుతున్నా ఆచరణలో ఫలితాలు కానరావడం లేదు. పాఠశాల సౌకర్యాలు లేక కొందరు, అవి ఉన్నా వివిధ కారణాల రీత్యా బడికి వెళ్లలేక మరికొందరు బాలలు తమ ఉజ్వల భవిష్య త్తును అంధకారమయం చేసు కుంటున్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలతో ముడివడి సంక్షేమ పథకాలకు నోచుకోక, చదువు చెప్పించే స్థోమత లేక ఎందరో పేద తల్లిదండ్రులు గత్యంతరం లేని స్థితిలో చిన్నారులపై భారాన్ని మోపుతున్నారు. హొటళ్లు, కిరాణా

## చిన్నారుల భవిష్యత్తు అంధకారమేనా!

దుకాణాలు, ఫ్యాక్టరీలు, మిల్లులు, క్వారీలు, గనులకు తమ పిల్లలను పనికి పంపుతున్నారు. వ్యవసాయ పనులకు కొందరు బాలలు వెళుతున్నారు. చివరికి కొందరు పిల్లలను భిక్షాటన వృత్తిలోకి బలవంతంగా నెడుతున్నారు. వివిధ రంగాలలో బాలకార్మికులు అవస్థలు పడుతూ అనుక్షణం శ్రమిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో పెద్దలు చేయాల్సిన పనులను సైతం వీరే చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలకు నీళ్లు వదిలి బాలల చేత వెట్టిచాకిరీ చేయించు కుంటున్నా, వారికి విముక్తి కలిగించాలన్న ధ్యాస సంబంధిత అధికారుల్లో లేకపోవడం బాధాకరం. యజ మానులు చెప్పిందే చట్టంగా, వారు చేసేదే సంకే మంగా పరిస్థితులున్నా కార్మికశాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు తూతూ మంత్రంగా దాడులు చేస్తున్నా దోషులకు ఎలాంటి శిక్షలు పడడం లేదు. 14 సంవత్సరాల లోపు పిల్లలందరికీ - ఉచిత నిర్బంధ విద్యను అమలు చేయాలని భారత రాజ్యాంగం లోని 24వ నిబంధన స్పష్టం చేస్తున్నా అది కాగితాలకే పరిమితమవడం శోచనీయం. పేదరికం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో పసి పిల్లల బంగారు కలలు చెదిరి పోతున్నాయి. పాలబుగ్గల లేత వయసులో వారు కార్మికులుగా మారడం బాధాకరం. కార్మిక చట్టాలకు విరుద్ధంగా పిల్లల చేత పని చేయించు కునే యాజమాన్యాలు తగిన వేతనాలు ఇవ్వడం లేదు. పిల్లలు పనిచేసే చోట తగిన రీతిలో భద్రతా సౌకర్యాలను కల్పించక పోవడం ఆక్షేపణీయం. ప్రాథమిక హక్కులను పేర్కొన్న రాజాంగంలోని 3వ ప్రకరణంలోని 15(8)వ అంశం బాలల కోసం ప్రత్యేక శాసనాలు చేసే అధికారం ప్రభుత్వానికి కలుగజేస్తున్నది. 28వ అధికరణం ప్రకారం బాలలను వ్యాపార వస్తువుగా మార్చడం, నిర్బంధ సేవలను చేయించు కోవడం అపరా ధంగానే పరిగణించాలి. 14 సంవత్సరాల లోపు పిల్లలను కర్మాగారాలలో, గనులలో, ఇతర ప్రమాదకరమైన పనులలో నియమించడాన్ని 24వ ఆర్టికల్ నిషేధించింది. 39(ఇ) ప్రకారం బాలలను వారి వయసుకు తగని, శక్తికి మించిన పనులలో నియమించ రాదు. పేదరికాన్ని సాకుగా చేసుకుని బాలలను పనుల్లో నియ మించడం నిషేధించాలని రాజ్యాంగం ఆదేశించింది. కఠిన చట్టాలు ఎన్ని ఉన్నా చాలామంది పిల్లలు బాల కార్మికులు గానే మిగిలి పోతున్నారు. రాజ్యాంగంలో పేర్కొన్న నిర్బంధ ప్రాథమిక విద్య ఈనాటికీ ఫలించని కలగానే మిగిలి పోతున్నది. ప్రపంచ బాలకార్మి కుల్లో మూడవ వంతు మంది మన దేశం లోనే ఉన్నారని ఒక అంచనా. దీంతో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. 5 నుండి 15 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు పలు కార్యక్రమాలను చేపట్టారు. పాఠశాలలో నమోదు కాని, మధ్యలో మాని వేసిన, అర్హతగల పిల్లల సమగ్ర వివరాలను సేకరించి వారిని తిరిగి తరగతులకు పంపేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి, ఆచరణాత్మక చర్యలను చేపట్టారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చదువుల పండగ పేరుతో 2002 ఆగస్టు 1 నుండి 10వరకూ, 2003 సంవత్సరం నవంబర్ 24 నుండి 29వరకూ బడి బయట ఉన్న పిల్లలనందరినీ పాఠశాలలలో చేర్పించే బృహత్ కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ తర్వాత ఏటా ఆ కార్యక్ర మాన్ని అమలు చేస్తునే ఉన్నారు. అయినా ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదన్నది వాస్తవం. అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు చెబుతున్నా బాల కార్మికులు వివిధ పనుల్లో కొనసాగుతూనే ఉన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, నిర్బంధ ప్రాథ మిక విద్య అమలుకు మరింతగా చర్యలు చేపట్టవలసి ఉంది. ముందుగా వారి తల్లిదండ్రులకు చదువుపట్ల అవగాహన కలిగించాలి. బాల కార్మికులకు వసతి సైతం కల్పిం చేలా ప్రత్యేక పాఠ శాలలను ఏర్పాటు చేయాలి. నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక సమస్యలను తొలగించేలా వారికి సంక్షేమ పథకాలను అమలు చేయాలి. పిల్లల సంపాద నపై ఆధారపడకుండా తల్లిదండ్రులకు సాధికారత కల్పించాలి.

# గత ఐదేళ్లు వామపక్షాలు ఏమయ్యారు?

● గత ఐదేళ్లు రాష్ట్రం విధ్వంసం అవుతుంటే ఎక్కడున్నారు ● గత పాలకుల కారణంగా వ్యవస్థలు అతలాకుతలం
● విద్వేషాలతో సొంత ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని సర్వనాశనం ● విద్యుత్తు చార్జీలు 9 సార్లు పెంచినా కనిపించని ఎర్రదళాలు ● ఈ అయిదు నెలల్లో ఏదో జరిగిపోయినట్లు వింత ధోరణులు



నీరుకొండ ప్రసాద్
9849625610

గత ఐదేళ్లు జగన్ రెడ్డి రాష్ట్రాన్నిఎంత విధ్వంసం చేసినా నోరు తెరవని వామపక్షాలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులు నుంచే విషం కక్కడం మొదలు పెట్టారు.జగన్ పాలనలో అన్ని రంగాలు కుప్పకూలిపోయ్యాయి, అన్ని వ్యవస్థలను ధ్వంసం అయ్యాయి. అన్నివర్గాల ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. భూ మాఫియా, గనుల మాఫియా, ఇసుక మాఫియా ,మద్యం మాఫియా రాష్ట్రాన్ని,మట్టి మాఫియా,కొత్తగా డ్రగ్స్ మాఫియా దోపిడీ చేసి రాష్ట్రాన్ని కరిమింగిన వెలగపండుగా మిగిల్చారు. పరిపాలనంతా మసిపూసి మారేడు కాయ చేసారు. ప్రజారోగ్యం, విద్య గాలిలో దీపం అయ్యాయి.. పారిశ్రామిక రంగం పతనమ్మైంది. పరిశ్రమలు పారిపోయాయి. పల్లె, పల్లెలో వలస వేదనే, నిరుద్యోగులు వంచనకు గురి అయ్యారు , ఫీజు రీయంబర్స్ మెంట్, విద్యార్థుల సంక్షేమం, ద్వైవాదీనం. విద్యుత్తు చార్జీలు 9 సార్లు పెంచి ప్రజలపై రూ 55 వేలకోట్ల భారం వేశారు. ధరలు పెరిగి బ్రతుకు భారమ్మై మధ్య తరగతి వారు పేదలు గాను, పేదలు నిరుపేదలుగాను మారారు.నాగ జెముడు వలె నవ్యాంధ్రను నాశనం చేశారు వైసీపీ నాయకులు. జగన్ అధికారంలోకి వచ్చింది మొదలు తన విద్యుక్త ధర్మాన్ని విడనాడి దోపిడీకి ప్రణాళికలు వేశారు తప్ప అభివృద్ధి కి ప్రణాళికలు వేయలేదు. దీంతో అన్ని రంగాలు తిరోగమనం బాటపట్టాయి. వ్యవసాయం, నీటి పారుదల రంగం,రోడ్లు, విద్యుత్, మౌలిక సదుపాయాలు అన్ని రంగాలు నేలమట్టం అయినాయి. విభజన అనంతరం 2014- 19 మధ్య అభివృద్ధి పథాన దూసుకు పోతున్న రాష్ట్రాన్ని స్వార్ధ ప్రయోజనాలకోసం రాష్ట్రాన్ని సర్వం చేసిన జగన్ పరిపాలన పై వామపక్షాలు చేసిన పోరాటాలు ఏమిటి? కూటమి ప్రభుత్వం వచ్చిన అయిదు నెలలకే పోరాటాలు అంటూ బయలు దేరారు వామ పక్షాలు. ఐదేళ్లు మౌనంగా వున్న వారు అయిదు నెలల్లో ఏదో జరిగిపోయినట్లు వారి పత్రికలలో వ్యాసాలు రాయడం.పరిపాలన పై విమర్శలకు దిగుతున్నారు. రాష్ట్ర బడ్జెట్ ఆత్మస్తుతి,పరనిందతో నిండిపోయిందని,బడ్జెట్ పూర్తీ రాజకీయ కరపత్రంగా ఉందని సిపియం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు అనడం చూస్తే గత జగన్ ప్రభుత్వాన్న విమర్శించి నందుకు వారు భాధ పడినట్లు కనిపిస్తుంది.విద్యుత్తు ట్రూఆఫ్ చార్జీలు పెంచడం ప్రజలపై భారం మోపడమే అన్నారు.గత ఐదేళ్లు తొమ్మిది సార్లు విద్యుత్తు చార్జీలు పెంచితే వారు చేసిన పోరాటాలు ఏమిటో వారికే తెలియాలి. మీకు నచ్చిన వారు,మీరు మెచ్చిన వారు పరిపాలన ఎంత అధ్వాన్నంగా చేసినా మాట్లాడరు.మీకు నచ్చని చంద్రబాబు ఏమి చేసినా నచ్చదు.గత ఐదేళు పోలవరాన్ని,ఇతర సాగునీటి ప్రాజెక్టులను పాడుపెట్టినా మాట్లాడని వామ పక్షాలు ఈ బడ్జెట్ లో కూటమి ప్రభుత్వం సాగునీటి రంగానికి రూ 16,705 కోట్లు కేటాయించినా విమర్శిస్తున్నారు. విశాఖ ఉక్కును ప్రవేటీకరణకు జగన్ కేంద్రంతో లోపాయి కారి ఒప్పందం చేసుకొన్నా,పోర్టులు ఆదానికి కట్టబెట్టినా వామ పక్షాలు మాట్లాడలేదు. విద్యుత్, ఆర్టీసి చార్జీలు.పట్టణాల్లో ఆస్తి పన్నుపెంపు , చెత్తపన్ను, నీటి పన్ను, మున్సిపల్ సేవల వినియోగ చార్జీలు పెంచారు. దశాబ్దాల క్రితం ప్రభుత్వ పథకాల కింద కట్టుకున్న ఇళ్లకు ఓటిఎస్ పేరుతో డబ్బులు వసూలు చేసారు . వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ మీటర్ల బిగింపు, పాఠశాలల విలీనం వంటి వినాశకర విధానాలను అమలు చేసారు. నిత్యావసర సరుకుల ధరలు భారీగా పెంచి ప్రజల నడ్డి విరిచారు.ఎన్నికల ముందు ఉద్యోగస్తులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదు. వేతన సవరణ, సిపిఎస్ రద్దు హామీ గాలికి వొదిలేశారు. చట్టబద్ధంగా ఉద్యోగులకు అందాల్సిన ఏ ఒక్క సహాయం సకాలంలో చెల్లించలేదు. నిరుద్యోగ యువత ఎంతో ఆశించిన డిఎస్సి, ఇతర ఉద్యోగాల కోసం ప్రకటిస్తానన్న జాబ్ క్యాలెండర్ అడ్రస్సు లేదు. రాజధానిని నాశనం చేశారు. ఇసుక పాలసీ పేరుతో పేద, లక్షలాది భవన నిర్మాణ కార్మికులను ఇక్కట్లకు గురిచేసారు. మద్యం పాలసీ వల్ల మద్యం నియంత్రణ జరగకపోగా మద్యం ధరలు పెంచారు.మద్యాన్ని విచ్చలివిడి అమ్మకానికి బార్లను బార్లా తెరిచారు , నకిలీ మద్యంతో ప్రాణాలు పోవడంతో పాటు, మహిళలపై హింస,అత్యాచారాలు పెరిగిపోయ్యాయి. అధికార పార్టీ నేతల భూ ఆక్రమణలు, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు, దందాలు, ఖనిజ సంపద దోపిడీ ఇష్టాను సారం కొనసాగుతుంది. వైసిపి ప్రజా ప్రతినిధుల్లో కీచక పర్వం తారా స్థాయికి చేరి జుగుప్సా కరంగా వ్యవహరిస్తున్నారు. ప్రజా ఉద్యమాలపై పోలీసు నిర్బంధం, ముందస్తు అరెస్టులతో వేధించారు.జగన్ రెడ్డి దుర్మార్గపు పాలన పై,ప్రజా వ్యతిరేఖ పాలనపై వామపక్షాలు చేసిన పోరాటాలు ఏమిటో చెప్పాలి. వామపక్షాలు సైద్దాంతిక భావ దారిద్ర్యంతో బాధపడుతున్నారు.వామపక్షాలు ఇతరులను విమర్శించడంలో ముందుంటారు. తాము మాత్రమే ప్రజాపక్షమని,ఇతరులు ప్రజా వ్యతిరేకులని వాదిస్తుంటారు. నిజంగా వారు అంత పవిత్రులు అయితే ప్రజల పక్షాన నిష్టగా పోరాటం చేస్తున్నవారు అయితే దేశ వ్యాప్తంగా వారి అడ్రస్ ఎందుకు గల్లంతు కావాల్సి వచ్చిందో ప్రజలకు చెప్పాలి.వారు ఉనికి కాపాడుకోవడం కోసం ప్రయత్నిస్తున్నారు. మాకు మించిన ఘనులు లేరు అన్నవిదంగా నిజం తెలుసుకోకుండా నైజం మార్చుకోకుండా వ్యవహరిస్తున్నారు. వారిని వారు బాగు చేసుకోవాల్సింది పోయి ఇతరులపై విషం కక్కున్నారు. మాకు నిత్యం ప్రజా పోరాటాలే ప్రధానం అని చెప్పుకునే కమ్యూనిస్టులు జగన్ రెడ్డి అరాచక,అసమర్ధ పాలన పై చేసిన పోరాటాలు ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పగలరా వాస్తవాలతో సంబంధం లేకుండా నాలుగు మభ్యపెట్టే మాటలు చెబుతూ చంద్రబాబుని విమర్శించినంత మాత్రనా ప్రజలు మిమ్మల్ని నమ్మే పరిస్థితి ఉందా? విలువలు,సిద్దాంతల కంటే స్వార్ధ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు.తమ ఉనికిని కాపాడుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తూ చంద్రబాబుపై విషం కక్కుతున్నారు. కాలం గడిచే కొద్దీ వారు కాలగర్భంలో కలిసిపోతున్నా కాలం చెల్లిన సిద్దాంతాలు విడనాడటంలేదు. ఆదర్శాలే తప్ప ఆచరణ ఎరుగరు వామపక్షాలు. వారి మాటలకు,చేతలకు పొంతన ఉండదు. గతంలో కమ్యునిస్టులు దృడమైన వైఖరితో ఉండి దేశహితం,ప్రజాహితం కోసం పనిచేసే వారు. ఇప్పుడు తాము మాత్రమే ప్రజాపక్షం అయినట్లు.చంద్రబాబు పాలనలో ప్రజలకు నష్టం జరుగుతున్నట్లు ఇష్టానుసారం విమర్శలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం పై వామపక్షాలు పసలేని ఆరోపణలు చేస్తు ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు ప్రజలు విజ్ఞులు.బూటకపు ఆరోపణలతో పలితం వుండదు.చంద్రబాబు పై వున్నద్వేషంతోనే కూటమి ప్రభుత్వాన్నివిమర్శిస్తున్నారు.జగన్ రెడ్డి రాష్ట్రాన్నిఅదోగతిపాలు చేసినా ఐదేళ్లు వామపక్షాలకు కనిపించలేదు. వారు ఏం చేసినా,ఎంత దోపిడి చేసినా,ప్రజలను ఎంత వేదించినా మాట్లాడలేదు. వామపక్షాలు వికృత రాజకీయాలకు పాల్పడటం వల్లనే ప్రజల్లో ఆదరణతో పాటు గౌరవం కుడా కోల్పోతున్నారు .వారి విమర్శలకు,సిద్ధాంతాలకు ఆకర్షితులయే తరం తరిగి పోయింది.ఇప్పటికైనా వామపక్షాలు జగన్ పాలనలో ఏమి జరిగిందో,ఇప్పుడు ఏమి జరుగుతుందో గమనించి కూటమి ప్రభుత్వం విమర్శలు చెయ్యాలి.

# అక్రమ రవాణాను అరికడదాం.. జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం

● దేశాలు సహకరించుకుంటేనే అక్రమ రవాణాకు అడ్డుకట్ట ● ఆందోళనకరంగా వన్యప్రాణుల అక్రమ రవాణా
● మెతకవైఖరితో స్మగ్లర్లలో మార్పు తీసుకురాలేం ● వాయుమార్గాల్లోనే వన్యప్రాణుల అక్రమ రవాణా అధికం



-ఫిరోజ్ ఖాన్
9640466464

హైదరాబాద్ కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో వన్యప్రాణుల వ్యాపారం చేస్తున్న ముఠా గుట్టును ఇటీవల రాష్ట్ర పోలీసులు రట్టు చేశారు. నల్లమల నుంచి అలుగును తీసుకువచ్చి తరలిస్తుండగా అచ్చంపేట మండలం హాజీపూర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఇలా వన్యప్రాణులను అక్రమ రవాణా చేస్తున్న ఘటనలు రాష్ట్రంలో, దేశంలో ప్రతి రోజు ఏదో ఒక చోట వెలుగుచూస్తూనే ఉన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. వన్యప్రాణులను యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తుండడంతో అనేక పక్షిజాతులు, వన్యప్రాణులు అంతరించిపోతున్న జాబితాలో చేరిపోతున్నాయి. ఫలితంగా జీవవైవిధ్యం ప్రమాదంలో పడుతున్నది. ఇది మానవాళికీ ముప్పులా పరిణమించే ప్రమాదమున్నది.


**అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉండడంతో..** వన్యప్రాణులకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉండడంతో అక్రమార్కులు ముఠాలుగా ఏర్పడి.. వివిధ మార్గాల్లో వాటిని సరిహద్దులు దాటిస్తున్నారు. ఒక్కో అలుగుకు రూ. 80 లక్షల నుంచి రూ. కోటి వరకు విదేశాల్లో ధర పలుకుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అలుగును చైనా, ఇతర దేశాల్లో ఔషధ ప్రయోజనాల కోసం, ఆభరణాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, వాలెట్ల తయారీకి ఉపయోగిస్తారని తెలుస్తున్నది. ప్రధానంగా వివిధ వన్యప్రాణులను ఆఫ్రికా నుంచి ఆగ్నేయాసియాకు, ఆ పై భారత్, చైనాలకు రవాణా చేయడానికి ముఠాలు ఎయిర్ కార్గో మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఆఫ్రికా నుంచి ఆగ్నేయాసియా వయా బంగ్లాదేశ్ మీదుగా వాయు మార్గం, థాయ్ లాండ్, మయన్మార్ భూ సరిహద్దుల ద్వారా మలేషియా, ఇండోనేషియా నుంచి చైనాలకు పాములు, తాబేళ్లు, ఇగువానా వంటి సరీసృపాలను అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా హులాక్ గిబ్బన్, అరుదైన తాబేళ్లు, బల్లులు, బీవర్లు, మూర్ మక్కాక్స్, డ్వార్ఫ్ ముంగిసలు, పిగ్మీ మార్మోసెట్ లు, డస్కీ లీఫ్ మంకీస్, బాల్ కొండచిలువలతో సహా 50 పైగా జాతులను వాయు, భూ మార్గాల ద్వారా మలేషియా నుంచి థాయ్ లాండ్, అక్కడి నుంచి భారత్ కు తీసుకొస్తున్నట్లు గుర్తించారు. ప్రపంచ కస్టమ్స్ ఆర్గనైజేషన్ ప్రకారం 2022లో కస్టమ్స్ తనిఖీల్లో 3,428 వన్యప్రాణులను స్వాధీనం చేసుకోగా, 2021లో ఈ సంఖ్య 3,316గా ఉంది. అంతేకాకుండా వేలాదిగా ఏనుగుదంతాలను సైతం పట్టుకున్నారు. వన్యప్రాణుల అక్రమ రవాణా చేసే ఘటనలు ప్రతియేటా పెరుగుతున్నాయని ప్రపంచ కస్టమ్స్ ఆర్గనైజేషన్ అక్రమ వాణిజ్య నివేదిక-2022 పేర్కొన్నది. 2020 గణాంకాలతో పోలిస్తే 2022లో ఇలా పట్టుబడిన కేసులు 10% అధికం కాగా, 2021తో పోలిస్తే 56% అధికమని వెల్లడించింది.

**ఆన్‌లైన్‌లో విక్రయాలు.. కొరియర్ ద్వారా రవాణా** సముద్రగర్భంలో ఉంటే సీ ఫ్యాన్స్, వన్యప్రాణుల శరీర భాగాలను తయారు చేస్తూ కొందరు ఆన్ లైన్ లో వ్యాపారం నిర్వహిస్తుండగా గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు ఆంధ్రప్రదేశ్ లో అధికారులు వారిని అరెస్ట్ చేశారు. మరోవైపు ఏనుగు దంతాలను పొడిగా, ఖడ్గ మృగాల కొమ్ములనూ పేస్ట్ మార్చి, పాములను ఆలూ చిప్స్ డబ్బాల్లో కొరియర్ల ద్వారా కూడా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. 2023-24లో వివిధ జాతుల బల్లులు, సరీ సృపాలను సాక్స్ లో ఉంచి, ప్లాస్టిక్ బొమ్మల్లో కప్పేసి పోస్టాఫీసుల ద్వారా రవాణా చేసే ప్రయత్నం చేయగా, ఆస్ట్రేలియాలో అధికారులు గుర్తించి అడ్డుకున్నారు. పోస్టు, కొరియర్ ద్వారా వన్యప్రాణుల అక్రమ రవాణా 2021- 2022 మధ్య 17% పెరిగినట్లు గుర్తించారు.

**ఐదు దేశాల సంయుక్త ప్రణాళిక** వన్యప్రాణుల అక్రమ రవాణాను అరికట్టడానికి భారత్, బంగ్లాదేశ్, థాయ్ లాండ్, మలేషియా, ఇండోనేషియా సంయుక్త ప్రణాళికను సిద్ధం చేసుకున్నాయి. తమ అధికార పరిధిలోని స్మగ్లింగ్ ముఠాలకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడంతోపాటు వారి ఆర్థిక మూలాలను విచ్ఛిన్నం చేసే చర్యలు చేపట్టాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా సీబీఐతోపాటు వైల్డ్ లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరో, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులతో కూడిన ప్రతినిధుల బృందం విమానాశ్రయాల్లో నిరంతరం నిఘా పెట్టాలని డిసిషన్ తీసుకున్నారు. ఈ బృందంతోపాటు ఇంటర్ పోల్ ద్వారా వన్యప్రాణుల అక్రమ రవాణాను అరికట్టవచ్చని భావిస్తున్నారు.

**అంతరించిపోతున్న జాబితాలో..** గత మూడు దశాబ్దాల్లో ఆఫ్రికాలో ఏనుగుల జనాభా దాదాపు 90% తగ్గడంతో, ఆఫ్రికా ఏనుగులను అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంస్థ (ఐయూసీఎన్) వాటిని అంతరించిపోతున్న జాతుల్లో చేర్చింది. వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫౌండేషన్ విడుదల చేసిన లివింగ్ ప్లానెట్ ఇండెక్స్%-%2024లో అర్ధ శతాబ్దంలో భారీ సంఖ్యలో వన్యప్రాణుల జాతులు కనుమరుగైనట్లు పేర్కొంది. అడవుల నరికివేత, జంతువుల అక్రమ రవాణా, మానవ కార్యకలాపాలతో వన్యప్రాణులు అంతరించిపోతున్నాయని వెల్లడించింది. 1970 నుంచి 2020 మధ్య కాలంలో సగటు జాతుల్లో 73శాతం తగ్గుదలను గుర్తించింది. జూలాజికల్ సొసైటీ ఆఫ్ లండన్ లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ ప్రకారం.. 1970%-%2020 మధ్య 35 వేలకుపైగా వన్యప్రాణుల జాతులు, 5,495 జాతుల ఉభయ చరాలు, పక్షులు, చేపలు, క్షీరదాలు, సరీసృపాలు అంతరించిపోయాయి. భారత్ లో మూడు రకాల రాబందుల జాతులు క్రమంగా అంతరించిపోతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా వన్యప్రాణి సంరక్షణలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న మెతక వైఖరి వల్ల అనేక జంతువులు అంతరించిపోతున్న జాబితాలో చేరిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలు ఒకరికొకరు సహకరించుకుంటూ.. స్మగ్లర్లు, వేటగాళ్ల పట్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తేనే వన్యప్రాణులను రక్షించుకొని జీవవైవిధ్యాన్ని కాపాడుకోగలుగుతాం.

# మహిళలపై హింస, ప్రధాన సమస్య



దేశవ్యాప్తంగా నేడు ప్రధాన సమస్యలలో, మహిళలపై హింస, ప్రధాన సమస్యగా తయారైనది. దేశవ్యాప్తంగా పాలకులకు మహిళలపై హింస నిరోధించుట, ఒక ప్రధానమైన సమస్యగా తయారైనది. ఇదే పాలకులకు అసలు సిసలైన సవాలుగా మారినది. కొన్ని సంఘటనలలో పాలకులు కఠినమైన నిర్ణయాలు తీసుకుంటున్నప్పటికీ, మహిళలపై హింస మాత్రం తగ్గడం లేదు. ఇందులో మరీ ముఖ్యంగా చిన్నారులపై లైంగిక దాడులు జరుగుతుండడం, రాతియుగపు నాటి ,చీకటిలో ఉన్నామా, అనే ఆవేదన కలుగుతుంది. మహిళలపై హింస తగ్గాలంటే, కేవలం ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు రూపొందించి వాటి అనుగుణంగా కఠినమైన చర్యలు తీసుకున్నంత మాత్రాన తగ్గవు, సమాజంలో పెను మార్పులు వస్తే తప్ప ,ఇలాంటి రుగ్మతల నుంచి సమాజం పరిరక్షింపబడదు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల పట్ల వివక్ష లేకుండా ,ఆడ మగ అనే భేదాభిప్రాయం లేకుండా ,సమ భావంతో పెంచాలి, స్త్రీ పురుష సమానత్వం పాటించుట గృహం నుంచే అలవాడాలి. గృహం తరువాత, విద్యా కేంద్రాలలో సమానత్వం ,సోదర భావం, స్త్రీ పురుషులను పరస్పరం గౌరవించుకునే విధానాన్ని పాఠశాల బోధన విధానంలో ప్రముఖంగా ఉండాలి. పాఠశాలలో జెండర్ భావనలో తేడాలు లేకుండా ,పాఠశాల నిర్వాహకులు శ్రద్ధ వహించాలి. కళాశాల స్థాయిలోనే సెక్స్ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టాలి, సెక్స్ ఎడ్యుకేషన్ నిగూఢంగా ఉండకుండా, బహిరంగ బోధన విధానంలో ఉండాలి. సెక్స్ ఎడ్యుకేషన్ పట్ల పరిపూర్ణ పరిజ్ఞానాన్ని అందించగలగాలి. రాజకీయరంగంలో ఉన్నవారు ,మహిళల పట్ల గౌరవభావంతో మెలగాలి, అప్పుడు పౌర సమాజం మహిళలను గౌరవించుకునే విధానము పెరుగుతుంది. క్రీడలు, ఉద్యోగ, ఉపాధి రంగాలలో అందరికీ సమాన అవకాశాలు కల్పించి ,ప్రోత్సహించాలి. పురుష స్త్రీ భేదాన్ని ఏ కోణంలో కూడా ,ఏ రంగంలో కూడా లేకపోయినట్లయితే, స్త్రీలను చూసే విధానములో పౌర సమాజంలో మార్పు వస్తుంది. స్త్రీల రక్షణ కొరకు చిన్నప్పటి నుంచి కరాటి ,విలువిద్యలు తదితర స్వయం రక్షణ కొరకు అనేక రక్షణాత్మక చర్యలను వారికి నేర్పించాలి. ప్రభుత్వాలు కూడా కఠినమైనటువంటి బహిరంగ శిక్షలు అమలుపరిచి, మరొకరు అలాంటి ప్రయత్నం చేయాలి అనే ఆలోచన లేకుండా, చర్యలు తీసుకోవాలి. మహిళలపై దాడులు జరిగితే ప్రత్యేక కోర్టులను ఏర్పాటుచేసి, కొద్ది వారాల లోనే కఠినమైన శిక్షలు పడేటట్లు పాలకులు ఆ విధమైన ఏర్పాట్లు చేయాలి. మహిళలపై జరిగే దాడులలో రాజకీయ పార్టీలు, దోషులను ఏమాత్రం సమర్ధించకుండా, ప్రభుత్వం తీసుకునే చర్యలను సమర్థించాలి. దోషులు ఏ పార్టీ వారైనా, రాజకీయ పార్టీలు ఉపేక్షించకూడదు. దేశవ్యాప్తంగా వేలాదిమంది మహిళలు అదృశ్యమవడం, దేశ ప్రజాస్వామ్య మీద బలమైన మాయని మచ్చ అవుతుంది. దేశంలో కావచ్చు లేదా అనేక రాష్ట్రాలలో శాంతి భద్రతల విషయంలో ,మహిళలపై జరిగే దాడులు తీవ్ర చర్చనీయాంశమై, ఆయా రాష్ట్రాల ప్రగతికి అవరోధంగా మారుతున్నాయి. మహిళలు వారు పని చేసే చోట, అభద్రతాభావంతో గడుపుతున్నారు. అలాగే పురుషాధిక్య సమాజంలో మహిళా ఉద్యోగులు అనేక అవమానాలు ,వారి పని చేసే కార్యాలయాలలో ఎదుర్కొంటున్నారు. జాతిపిత మహాత్మా గాంధీ చెప్పినట్లు ,ఆడవారు అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరిగిన రోజే నిజమైన స్వతంత్రం వచ్చినట్లు అని చెప్పారు. కానీ ఆయన చెప్పినట్లు నేడు ఆ పరిస్థితులు లేవు. ఈ పరిస్థితులు మారాలంటే కేవలం పాలకులే కాకుండా, సమాజంలో ఉన్న తల్లిదండ్రులు, గురువులు, విద్యాసంస్థలు, సేవా సంఘాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, తదితర అన్ని రంగాల వారు ,స్త్రీలను గౌరవించుట, లింగ సమానత్వమును పాటించుట, సెక్స్ ఎడ్యుకేషన్ పట్ల అవగాహన కల్పించుట, ఆడవారిని చూసే కోణంలో మార్పు తెచ్చుట, తదితర చర్యల వల్లనే మహిళలపై అఘాయిత్యాలు లేకుండా ఉండుటకు దోహదపడతాయి. పౌర సమాజం మారకుండా పాలకులు మాత్రమే చర్యలు తీసుకుంటే ,మహిళలపై జరిగే అఘాయిత్యాలు ఆగవు. కనుక పౌర సమాజం ఆ విధంగా ప్రేరణ చెందుతుంది అని ఆశిద్దాం.

తరిగోపుల నారాయణస్వామి
9490738499

## తూకాలలో మోసాలను అరికట్టలేమా ?

తెలంగాణ రాష్ట్రంలోని అనేక దుకాణాలలో తూకాలలో మోసాలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాలలో ముఖ్యంగా ప్రధాన పట్టణాల్లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో కిరాణా,జనరల్,అల్లం వెల్లుల్లి, ఉల్లిగడ్డ, చింతపండు,పూలు ఏది కొనాలన్నా తుకాలలో మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.గతంలో తూకాల తనిఖీల కోసం తూకాల తనిఖీల శాఖ ఉండి తరుచుగా తనిఖీలు చేయడం తూకాలలో మోసం చేసే వారిపట్ల కేవలను నమోదు చేయడం, దుకాణాలను మూసివేయడం చేసేవారు.గత కొంత కాలంగా తనిఖీలు లేకపోవడం వల్ల దుకాణ దారుల ది ఆడిందే ఆట పాడిందే పాట గా మారింది. కార్తీక మాసం కావడంతో మహిళలు పూజ సామగ్రి,బంతి చేమంతి గులాబి మల్లెపువ్వులు కొనుగోలు చేస్తే సగానికి సగం దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకాశాన్ని అందే ధరలు ఒకవైపు ఏది కొనాలన్నా భయభ్రాంతులను గురి చేస్తుంటే వ్యాపారుల ఆగడాలు శృతి మించి పోతున్నాయి.రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత ప్రజాపాలన అంటుంది కాబట్టి ప్రజలకు ఇబ్బందులను కల్గిస్తున్న తూకాలలో మోసాలను అరికట్టాలని కోరుతున్నారు.ఎవరైన తూకాల లో మోసాలు జరుగుతున్నాయని అడిగితే దుర్భాషలాడటం, భౌతికంగా దాడులు చేయడం, వ్యంగం గా మాట్లాడుతూ మనోభావాలను దెబ్బ తీయడం చేస్తున్నారు.తూనికల తనిఖీల కోసం వచ్చే అధికారుల అవినీతి, లంచగొండితనం వల్ల దుకాణ దారులకు ముందే సమాచారం ఇవ్వడం, తనిఖీలకు వచ్చిన నామమాత్రంగా తనిఖీలు చేసి వారి అమ్యామ్యలు ( లంచం ) తీసుకొని వెళ్తున్నారు.కొంతమంది కొలతల తూనికలు చేసే అధికారులకు నెల నెల మాములు అందుతున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తూనికలు తనిఖీలు నిర్వహించే సంబంధిత ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని తూకాలలో మోసాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అవినీతి నిరోధక శాఖ ( ఏసీబీ) ప్రతి రోజు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడో ఒక దగ్గర ఏదో ఒక డిపార్ట్మెంట్ లో లంచగొండి అధికారులపై దాడులు చేసి కేసులను నమోదు చేసి జైళ్లకు పంపిన అవినీతి అంతం కావడం లేదు.అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నమోదు చేసిన కేసులు నిలువకకోవడం అవినీతికి పాల్పడిన అధికారులు తిరిగి విధుల్లోకి రావడంతో అవినీతికి పాల్పడే అధికారులకు అధికార ప్రతిపక్ష నాయకుల అండదండలు ఉండడంతో బహిరంగంగా లంచాలు తీసుకుంటున్నారు.

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్,
9290826988

## కేరళ జిప్‌లైన్‌లో రాహుల్‌గాంధీ ట్రావెల్

వాయనాడ్ : ఎన్నికల ప్రచారంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బిజీ అయ్యారు. ఓ వైపు సభలు, మరోవైపు నేతలతో సమావేశాలతో బిజీగా ఉన్నారు. కాస్త రిలాక్స్ దొరకడంతో మానసిక ఉల్లాసం కోసం జిప్‌లైన్‌లో ట్రావెల్ చేశారాయన. ఇంతకీ ఎక్కడో తెలుసా? అక్కడికే వచ్చేద్దాం. దేశవ్యాప్తంగా 31 అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలతోపాటు వయనాడ్‌లో ఉపఎన్నికకు బుధవారం పోలింగ్ జరుగుతోంది. వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకగాంధీ పోటీ చేస్తున్నారు. ఓ వైపు మహారాష్ట్ర, మరోవైపు జార?ండ్ ప్రచారంలో బిజీగా ఉన్నారు రాహుగాంధీ. సోదరి ప్రియాంకగాంధీ పోటీ చేస్తున్న వయనాడ్‌కు వచ్చారు. మంగళవారం రెస్ట్ దొరకడంతో కాస్త రిలాక్స్ అయ్యారు. దక్షిణ భారత్‌లో అత్యంత పొడవైన జిప్‌లైన్‌లో ప్రయాణించారు రాహుల్‌గాంధీ. ప్రకృతిని ఆస్వాదిస్తూ ఎంజాయ్ చేశారాయన. దీనికి సంబంధించిన ఫోటోలను ఎక్స్ ద్వారా షేర్ చేసింది కాంగ్రెస్ పార్టీ. సింపుల్‌గా చెప్పాలంటే వయనాడ్‌కు వచ్చే టూరిస్టుల దీన్ని నిర్మించారు. వయనాడ్ ప్రజలకు స్థానికంగా కష్టాలు ఉన్నప్పటికీ, ఆర్థికంగా బలపడేందుకు కృషి చేస్తూనే ఉంటున్నారు. వాయనాడ్‌ను భారతదేశంలో అత్యుత్తమమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు రాహుల్, ప్రియాంకగాంధీలు ఓ మిషన్ చేపట్టిన విషయం తెల్పింది. ఇందులో భాగంగానే అక్కడి కీలకమైన ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేస్తున్నారు రాహుల్‌గాంధీ. మరోవైపు ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఓటర్లకు ప్రియాంకగాంధీ పిలుపు నిచ్చారు. ప్రజలు బయటకు వచ్చి ఓటు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకుని ఓటు వేస్తారని ఆశిస్తున్నాను. ఇది రాజ్యాంగం ప్రజలకు అందించిన అతిపెద్ద బలం, దానిని సద్వినియోగం చేసుకోవాలి, అందరం కలిసి మంచి భవిష్యత్తును నిర్మించుకుందాం



# భారతీయ భాషల్లో వైద్య విద్య

● రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు ● 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు'తో బడుగులకు సేవలు
● గత ప్రభుత్వాలు చేసినవి కేవలం తప్పుడు వాగ్దానాలు ● దర్భంగా సభలో ప్రధాని నరేంద్ర మోడీ




లఖ్‌నవూ: త్వరలోనే హిందీ సహా పలు భారతీయ భాషల్లో వైద్య విద్య అందుబాటులోకి వస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా లక్ష మెడికల్ సీట్లను జోడించామని.. రాబోయే ఐదేళ్లలో మరో 75 వేల మెడికల్ సీట్లు అందుబాటులోకి తీసుకొస్తామని వైద్య విద్యార్థులకు ప్రధాని హామీ ఇచ్చారు.

దేశంలో 1.5 లక్షలకు పైగా ఉన్న 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' బడుగు బలహీనవర్గాలకు మెరుగైన సేవలందిస్తున్నాయని తెలిపారు. దేశంలో దాదాపు నాలుగు కోట్ల మంది ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నారన్నారు. బిహార్ లోని దర్భంగా లో నిర్వహించిన సభలో ప్రధాని ప్రసంగించారు. దేశవ్యాప్తంగా ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా దర్భంగాలో ఎయిమ్స్కు ప్రధాని శంకుస్థాపన చేసి, రూ.12,100 కోట్ల విలువైన ప్రాజెక్టులను ఆవిష్కరించారు. బిహార్‌లో నీతీశ్ కుమార్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రధాని ఈ సందర్భంగా కొనియాడారు. ఆటవిక రాజ్యంగా ఉన్న రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారన్నారు.

గత ప్రభుత్వాలు కేవలం తప్పుడు వాగ్దానాలు మాత్రమే చేశాయని.. కానీ రాష్ట్రంలో నీతీశ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పరిస్థితి మెరుగుపడిందని పేర్కొన్నారు.

ముందు ముందు రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు



## ప్రధాని మోడీ నోబెల్ శాంతి బహుమతికి అర్హులు

● అన్ని దేశాలతో మోడీకి సత్సంబంధాలు ● మార్కెట్ వెటరన్ మార్క్ మోబియస్ వెల్లడీ

భారత ప్రధాని నరేంద్ర మోడీ నోబెల్ శాంతి బహుమతికి అర్హులు అని జర్మనీ పెట్టుబడిదారుడు మార్క్ మోబియస్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయంగా మోడీ పాత్ర ప్రాముఖ్యత సంతరించుకుంటుందని.. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలతో మోడీకి సత్సంబంధాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. నోబెల్ శాంతి బహుమతికి అర్హమైన గొప్ప నాయకుడు అని కొనియాడారు. భవిష్యత్‌లో ప్రపంచ దేశాలకు శాంతి కర్తగా మారవచ్చని పేర్కొన్నారు. ప్రపంచ వేదికపై శాంతికి మధ్యవర్తిగా వ్యవహరించేందుకు భారతదేశం చాలా మంచి స్థితిలో ఉందని మోబియస్ చెప్పారు. మోడీకి నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ప్రముఖ పెట్టుబడిదారు మార్క్ మోబియస్ మద్దతు తెలిపారు. ఒక ఇంటర్వ్యూలో మోబియస్ మాట్లాడుతూ.. మోడీ చాలా మంచి వ్యక్తి అంటూ ప్రశంసించారు. ప్రపంచంలో కీలక మధ్యవర్తిగా ఉండేందుకు ప్రధాని మోడీకి చాలా అర్హత ఉందని ఆయన అన్నారు. తన అభిప్రాయం ప్రకారం.. ప్రధాని మోడీ అత్యంత సమర్థుడని, నోబెల్ శాంతి బహుమతికి.. ప్రపంచ గౌరవానికి అర్హుడని మోబియస్ చెప్పుకొచ్చారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య శాంతి చర్చలు జరిపేందుకు ఇటీవల ప్రధాని మోడీ ముందుకొచ్చారు. శాంతి చర్చలకు ఇండియానే కేంద్రం కావొచ్చని వార్తలు వినిపించాయి. యుద్ధం ముగింపునకు.. శాంతి చర్చలకు భారత్ మొగ్గుచూపించింది. జూన్ 2024లో స్విట్జర్లాండ్‌లోని బర్గెన్‌స్టాక్‌లో జరిగిన ఉక్రెయిన్ శాంతి సదస్సుకు భారత్ కూడా హాజరైంది.

## అమెరికా యుద్ధనౌకలపై హూతీల దాడి

వాషింగ్టన్: ఎర్ర సముద్రం లో హూతీ తిరుగుబాటుదారులు మరోసారి రెచ్చిపోయారు. అమెరికాకు చెందిన యుద్ధ నౌకల పై వారు దాడి చేసినట్లు పెంటగాన్ వెల్లడించింది. తమ యుద్ధ నౌకలు బాబ్ అల్ మందాబ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న సమయంలో యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు డ్రోన్లు, క్షిపణులతో దాడి చేసినట్లు అమెరికా పేర్కొంది. దాదాపు ఎనిమిది వన్-వే అటాక్ అన్‌క్రూడ్ ఏరియల్ సిస్టమ్స్, ఐదు యాంటీ-షిప్ బాలిస్టిక్ క్షిపణులు, మూడు యాంటీ-షిప్ క్రూయిజ్ క్షిపణులతో విరుచుకుపడ్డారని.. యుద్ధ నౌకలోని సిబ్బంది వెంటనే వాటిని తిప్పికొట్టారని తెలిపింది. ఈ దాడిలో నౌకకు ఎలాంటి నష్టం వాటిల్లలేదని.. సిబ్బంది ఎవరూ గాయపడలేదని పెంటగాన్ అధికార ప్రతినిధి మేజర్ జనరల్ పాట్ రైడర్ పేర్కొన్నారు. 2023 నవంబర్‌లో ఎర్ర సముద్రం, ఏడెన్ గల్ఫ్‌లో నౌకలపై హూతీల దాడులు ప్రారంభమయ్యాయి. ఎర్ర సముద్రం మీదుగా జరిగే అంతర్జాతీయ నౌకా వాణిజ్యాన్ని వరుస దాడులతో అతలాకుతలం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హూతీల దాడుల నుంచి వాణిజ్య నౌకలకు రక్షణగా అమెరికా, ఇతర దేశాలు ఎర్ర సముద్రంపై సైనిక నౌకలను మోహరించాయి. వారిపై వైమానిక దాడులను సైతం నిర్వహించాయి. అయినా హూతీ రెబల్స్ దాడులను ఆపట్లేదు. ఇప్పటి వరకు వాణిజ్య నౌకలనే లక్ష్యంగా చేసుకున్న రెబల్స్ యుద్ధ నౌకలపై దాడి చేయడం చాలా అరుదు. కాగా ఇటీవల హూతీల ఆయుధ నిల్వ కేంద్రాలపై అమెరికా బలగాలు పలు వైమానిక దాడులు చేశాయని అధికారులు వెల్లడించారు. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా ఇరాన్ ఏర్పాటు చేసిన ప్రతిఘటన కూటమిలో హమాస్, హెజ్బొల్లాలతో పాటు హూతీలూ భాగస్వాములు. వారు పాలస్తీనాను సమర్థిస్తున్నారు. సౌదీ అరేబియా, పాశ్చాత్య దేశాల మద్దతుతో నడుస్తున్న యెమెన్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి ప్రయత్నిస్తున్న హూతీలకు ఇరాన్ మద్దతిస్తోంది. దీంతో



గాజాలో ఇజ్రాయెల్ విధ్వంసాన్ని నిరసిస్తూ హూతీలు ఎర్ర సముద్రంలో దాడులకు దిగుతున్నారు. దాదాపు 35 దేశాలకు చెందిన రవాణా నౌకలపై వారు డ్రోన్లు, క్షిపణులతో 100కు పైగా దాడులు చేసినట్లు గతంలో అమెరికా రక్షణ శాఖ వెల్లడించింది.

# గ్రామాల్లోనే ఓటర్ల జోరు

● ఝార?ండ్ తొలిదశ ఎన్నికల్లో జరుగుతున్న పోలింగ్ తీరు



రాంచీః ఝార?ండ్ రాష్ట్రంలో రెండు విడతలుగా జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో తొలి విడత పోలింగ్ నవంబర్ 13న బుధవారం ప్రారంభమైంది. నవంబర్ 13 నుంచి నవంబర్ నవంబర్ 20 దాకా రెండు విడతల్లో జరుగుతున్న ఝార?ండ్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిదశలో భాగంగా 15 జిల్లాలోని 43 నియోజకవర్గాల్లో ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ఆదివాసీ, దళిత జనాభా ఎక్కువగా ఉన్న ఝార?ండ్‌లో ఉదయం నుంచే ప్రజలు ఓటు వేయడానికి పోలింగ్ బూత్ లలో క్యూ కట్టారు. ఉదయం 7 గంటల నుంచి 9.30 గంటలకు 13.04 శాతం పోలింగ్ నమోదు అయినట్లు సమాచారం. నియోజకవర్గాల వారీగా చూస్తే.. అత్యధికంగా సిమ్‌డేగా జిల్లాలో 15 శాతం ఓటింగ్ నమోదు కాగా.. అత్యల్పంగా ఉత్తర సింహభూమ్ జిల్లాలో 11.25 శాతం ఓటింగ్ జరిగిందని స్థానిక మీడియా రిపోర్ట్. ముఖ్యంగా ఆదివాసీ రిజర్వ్‌డ్ క్యాటగిరీ నియోజకవర్గాల్లో ఎక్కువ పోలింగ్ నమోదు అయింది. ఆ నియోజకవర్గాల్లో ప్రజలు తెల్లవారుఝామున 5 గంటల నుంచి క్యూలలో నిలబడ్డారు. పైగా ఓటర్లలో మహిళలు అధికంగా ఉండడం విశేషం. మరోవైపు రాంచీ, జమ్‌షెడ్‌పూర్ లాంటి పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ బూత్‌లకు ఓటర్లు ఆలస్యంగా వస్తున్నట్లు తెలిసింది. తొలిదశ ఎన్నికల్లో ఝార?ండ్ లోని బడా నేతలు పోటీపడుతున్నారు. ముఖ్యంగా మాజీ ముఖ్యమంత్రి చంపాయి సోరేన్, ఆయన కుమారుడు బాబూ లాల్ సోరేన్, మాజీ సిఎం అర్జున్ ముండా భార్య మీడా ముండా, సీనియర్ నాయకుడు మధు కోడా సతీమణి గీతా కోడా, రఘువీర్ దాస్ కోడలు పూర్ణిమా సాహు, మంత్రి మిథిలేశ్ ఠాకుర్, మంత్రి రామేశ్వర్ ఉరావ్, రాంచీ సిట్టింగ్ ఎమ్మెల్యే సిపి సింగ్, అధికరా పార్టీ జెఎమ్ఎమ్ కు చెందిన రాజ్యసభ సభ్యురాలు మహువా మాజీ ఈ రోజు ఎన్నికల్లో పోటీ పడుతున్నారు. ఝార?ండ్ రాష్ట్రంలోని మొత్తం 81 అసెంబ్లీ సీట్లకు గాను 43 సీట్లలో నవంబర్ 13న ఓటింగ్ జరుగుతుండగా.. మిగతా 38 సీట్లకు నవంబర్ 20న ఓటింగ్ జరుగనుంది. గత ఎన్నికల్లో ఇండియా కూటమి పార్టీలదే హవా ఈ రోజు జరుగుతున్న 43 అసెంబ్లీ సీట్లపై 2019 లో జరిగిన ఎన్నికల్లో యుపిఎ కూటమి (ప్రస్తుత ఇండియా కూటమి) 29 సీట్లలో విజయం సాధించింది. మిగతా 14 సీట్లు.. బిజెపీ, ఆల్ ఝార?ండ్ స్టూడెంట్స్ యూనియన్ పార్టీలు గెలుచుకున్నాయి. నవంబర్ 20న రెండో విడత లో 38 సీట్లకు ఓటింగ్ జరుగనుంది. ఈ 38 సీట్లలో కూడా యుపిఎ కూటమి పార్టీలు 22 సీట్లలో విజయం సాధించడం గమనార్హం. ఝార?ండ్ లో ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ కొంత కాలం జైలు జీవితం గడిపారు. ప్రస్తుతం ఆయన బెయిల్ పై బయట ఉన్నారు. ఆయన జైలులో ఉన్న సమయంలో పార్టీ తరుపున తాత్కాలిక సిఎంగా సీనియర్ నాయకుడు చంపయి సోరేన్ ఉన్నారు. బెయిల్ పై బయటికి వచ్చిన తరువాత హేమంత్ సోరేన్ తిరిగి ముఖ్యమంత్రి పదవి చేపట్టడానికి చంపాయి సోరేన్ ని గద్దె దించారు. దీంతో చంపాయి సోరేన్, పార్టీ మధ్య విభేదాలు తలెత్తి ఆయన బిజేపీలో చేరారు.



## అధికారులేమైనా న్యాయమూర్తులా?..

● బుల్‌డోజర్ జస్టిస్‌పై సుప్రీంకోర్టు మండిపాటు

న్యూఢిల్లీః ప్రభుత్వ అధికారులకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించే హక్కు లేదని సుప్రీం కోర్టు బుధవారం ఒక కీలక తీర్పులో తెలిపింది. విచారణ పూర్తి కాకుండానే నిందితుడిని దోషిగా తేల్చేయడం.. ఒక వ్యక్తి నేరం చేస్తే.. అతడి కుటుంబాన్ని కూడా శిక్షించేందుకు చట్టం అంగీకరించదని సుప్రీం కోర్టు ద్విసభ్య ధర్మాసనం మండిపడింది. సుప్రీం కోర్టులో మధ్య ప్రదేశ్, ఉత్తర్ ప్రదేశ్ ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు బుల్డోజర్ జస్టిస్ పేరుతో ఇళ్లను కూల్చివేయడానికి వ్యతిరేకంగా దేశ అత్యున్నత కోర్టులో అధిక సంఖ్యలో పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లను విచారణ చేసిన జస్టిస్ బిఆర్ గవై, జస్టిస్ విశ్వనాథన్ ద్విసభ్య ధర్మాసనం కీలక తీర్పు వెలువరిస్తూ.. కొన్ని గైడ్ లైన్స్ జారీ చేసింది. జస్టిస్ గవై, జస్టిస్ విశ్వనాథన్ ఈ పిటీషన్ల విచారణ సమయంలో తీర్పు వెలువరిస్తూ.. చేసిన వ్యాఖ్యలు ఇవే.. ఏదైనా నేరంలో నిందితుడిగా ఉన్నంత మాత్రాన ఆ వ్యక్తి నివాసాన్ని కూల్చివేసే హక్కు అధికార యంత్రాంగానికి లేదు. రాజ్యాంగంలోని సెపరేషన్ ఆఫ్ పవర్స్ కు ఇది విరుద్ధం. ఎవరైనా ప్రభుత్వ అధికారి సరైన అనుమతులు లేకుండా విచారణ ఎదుర్కొంటున్న ఒక వ్యక్తి ఇంటిని కూల్చేస్తే.. అది నియమాలను ఉల్లంఘించినట్లే అవుతుంది. ఒక నిందితుడిని దోషిగా తేల్చే హక్కు ఒక ప్రభుత్వ అధికారికి లేదు. ఆ నిందితుడిని శిక్షించేందుకు అతడు నివాసముంటున్న ఇంటిని కూల్చేసే అధికారం ఎవరికీ లేదు. ఇల్లు కలిగి ఉండడం ప్రతి వ్యక్తి మౌలిక అధికారాలలో ఒకటి. అందువల్ల సదరు వ్యక్తి ఏదైనా నేరంలో నిందితుడిగా ఉన్నా.. దోషిగా తేలినా.. అతడిని శిక్షించేందుకు చట్ట విచారణ పూర్తి కాకుండా కోర్టు అనుమతి లేకుండా అతడి ఇంటి కూల్చేయడానికి ప్రభుత్వ అధికారులకు ఎటువంటి హక్కు లేదు. ఒకవేళ ఇలా చేస్తే. ఇది క్రిమినల్ జస్టిస్ కి విరుద్ధం. నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తి నేరం చేశాడని కోర్టు విచారణ ప్రక్రియ ప్రకారం జరగాల్సిందే. విచారణ నిష్పాక్షిక పూర్తికాకుండానే నిందితుడిని దోషిగా పరిగణించలేం. ఒకే తరహా చేసిన నిరారోపణలు ఎదుర్కొంటున్న నిందితులలో కొందరి ఇళ్లు మాత్రమే కూల్చివేయడం.. మరికొందరిపై చర్యలు తీసుకోకపోవడం వంటి అంశాలను కూడా సుప్రీం కోర్టు ధర్మాసనం దృష్టికి వచ్చింది. దీనిపై న్యాయమూర్తులు స్పందిస్తూ.. అధికారులు కేవలం కొందరిని శిక్షించడానికే ఇదంతా చేస్తున్నట్లు నమ్ముతున్నాం. అంతే తప్ప న్యాయం కోసం కాదు. ఒక ఇల్లు కూల్చి వేస్తే.. అందులో ఒక నిందితుడు మాత్రమే కాదు.. అతని కుటుంబ సభ్యులు కూడా నివసిస్తుంటారు. వారంతా ఏ పాపం ఎరుగని వారు. రాత్రికి రాత్రి ఇళ్లు కూల్చేస్తే.. మహిళలు, పిల్లలు నడిరోడ్డుపై ఉండాల్సిన పరిస్థితి. ఒకవేళ ఏదైనా నేరంలో నిందితుడు దోషిగా తేలినా అతడి ఇంటిని కూల్చేసే హక్కు ఎవ్వరికీ లేదు. ఒక వేళ ఇల్లు కూల్చడానికి అన్ని అనుమతులు ఉన్నా.. అందులో నివసించే వారికి 15 రోజులు లేదా స్థానిక చట్టాల ప్రకారం కనీస గడువు తప్పనిసరిగా ఇవ్వాలి. బుల్డోజర్ జస్టిస్ పేరుతో నిందితుల ఇల్లు కూల్చేయడం వెనుక ఉన్న రాజకీయ కారణాలను కోర్టు ఖండిస్తోంది. అధికారులు.. నియమాలను పాటిస్తూ.. చట్ట ప్రకారమే చర్యలు చేపట్టాలి. నిబంధనలకు అతిక్రమించి ఇళ్ల కూలిస్తే.. బాధితులకు నష్టపరిహారం తప్పనిసరిగా చెల్లించాల్సి ఉంటుంది

# దూకుడు పెంచిన కాంగ్రెస్

● చివరి 5 రోజులలో 75 ర్యాలీలు-రోడ్ షోలు నిర్వహించాలని యోచన

ముంబై : మహారాష్ట్ర ఎన్నికలు రాజకీయ పార్టీలకు భవిష్యత్తు ప్రశ్నగా మారాయి. గత 5 రోజుల్లో కాంగ్రెస్ తన ప్రముఖులను రంగంలోకి దింపేందుకు సిద్ధమవుతోంది. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, ప్రియాంక గాంధీ సహా ఈ నేతలు 75 ర్యాలీలు-రోడ్ షోలు నిర్వహించాలని యోచిస్తున్నారు. ఇందులో దాదాపు 20 కార్యక్రమాలు ఈ ముగ్గురు పెద్ద నేతలే చేశారు. రాహుల్ గాంధీ మరత్వాడా, పశ్చిమ మహారాష్ట్ర, ఉత్తర మహారాష్ట్రలో ఆరు సమావేశాలను నిర్వహిస్తారు. అయితే ప్రియాంక నవంబర్ 13 న వయనాడ్‌లో ఓటు వేసిన తర్వాత రాష్ట్రంలో నాలుగు సమావేశాలను షెడ్యూల్ చేశారు. అంతేకాకుండా దాదాపు 10 ర్యాలీల్లో పార్టీ అధ్యక్షుడు ఖర్గే ప్రసంగించనున్నారు. విదర్భ, మరత్వాడా, ఉత్తర మహారాష్ట్రలపై కాంగ్రెస్ ఎక్కువ దృష్టి సారించింది. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు అగ్రనేతలు కాకుండా సచిన్ పైలట్, ఇమ్రాన్ ప్రతాప్‌గర్హిలకు మహారాష్ట్రలో అత్యధిక డిమాండ్ ఉంది. ముస్లిం ప్రాబల్యం ఉన్న ప్రాంతాలతో సహా రాష్ట్రంలో ప్రతాప్‌గఢిలో 20 కంటే ఎక్కువ సమావేశాలు షెడ్యూల్ చేయబడ్డాయి. యువ నాయకుడు సచిన్ పైలట్ మొత్తం ఎనిమిది సమావేశాల్లో పాల్గొంటారు. అయితే కొన్ని నిర్దిష్టమైన ప్రాంతాల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కూడా ప్రచారంలో పాల్గొంటారు. రాష్ట్రంలోని ముఖ్యమైన నాయకుల గురించి మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు నానా పటోలే 20 ర్యాలీలు, శాసనసభా పక్ష నేత బాలా సాహెబ్ థోరట్ 15 ర్యాలీలు షెడ్యూల్ చేయబడ్డాయి. నవంబర్ 17న ముంబైలో కాంగ్రెస్, శివసేన ఉద్ధవ్, ఎన్సీపీ శరద్ పవార్ అగ్రనేతల ఉమ్మడి సమావేశం కార్యక్రమం కూడా ఖరారైంది. ఇది కాకుండా, చివరి క్షణంలో ముంబైలో రాహుల్ లేదా ప్రియాంక భారీ రోడ్ షో కూడా ప్లాన్ చేసింది. దీనికి సంబంధించిన రోడ్ మ్యాప్ ఖరారు చేయబడింది. ర్యాలీలు, రోడ్‌షోలతో పాటు మహావికాస్ అఘాడి 5 హామీ కార్డులను 5 కోట్ల మందికి చేరవేయాలని కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఇంటింటికీ ప్రచారం నిర్వహించడం ద్వారా మహిళలకు నెలకు రూ.3 లక్షల 3 వేల రూపాయల రైతు రుణమాఫీ హామీని ప్రజల్లోకి విస్తృతం చేయడమే లక్ష్యం.



## మీ కాళ్లపై మీరు నిల్చోవడం నేర్చుకోండి

● శరద్‌పవార్ ఫొటోలు, వీడియోలు ఉపయోగించొద్దు
● అజిత్ పవార్ వర్గాన్ని సుప్రీం ఆదేశించింది.



డిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఎన్‌సీపీ చీఫ్ అజిత్ పవార్‌కు సుప్రీంకోర్టు లో నిరాశ ఎదురైంది. ఎన్‌సీపీ వ్యవస్థాపకుడైన శరద్‌పవార్ ఫొటోలు, వీడియోలు ఎన్నికల ప్రచారంలో వినియోగించొద్దని ఆదేశించింది. అలాగే సొంతకాళ్లపై నిల్చోవడం నేర్చుకోవాలని చురకలు వేసింది. గతేడాది ఎన్‌సీపీ నుంచి చీలిపోయి మెజార్టీ ఎమ్మెల్యేలతో కలిసి భాజపా- శిందే సర్కారుకు మద్దతు పలికిన అజిత్ పవార్ డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయన వర్గానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలూ మంత్రులయ్యారు. దాంతో పార్టీ రెండుగా చీలిపోగా.. అజిత్ పవార్ వర్గాన్నే అసలైన ఎన్‌సీపీగా ఎన్నికల సంఘం గుర్తించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీలో ఎక్కువమంది ఎమ్మెల్యేలు కలిగిన అజిత్ వర్గమే పార్టీ చిహ్నం, ఎన్నికల గుర్తును దక్కించుకుంది. అయితే ప్రస్తుతం జరుగుతోన్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీనియర్ పవార్ దృశ్యాలను వాడుతున్నారని ఆరోపిస్తూ ఆయన మద్దతుదారులు సుప్రీంను ఆశ్రయించారు. ఈ క్రమంలో సుప్రీం ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది.

## వయనాడ్ ప్రజలు ఓ ఛాన్స్ ఇవ్వండి

● పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ప్రియాంకా గాంధీ



వయనాడ్: కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక పోలింగ్ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో పలు పోలింగ్ కేంద్రాలను కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఎన్నికలో ప్రజలు తనకు ఓ అవకాశం ఇస్తారని ఎదురు చూస్తున్నట్లు పేర్కొన్నారు. వారు తనపై చూపించిన ప్రేమను తిరిగి ఇవ్వాలనుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రజలంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కేరళలోని వక్ఫ్ చట్టం, కొండ చరియలు విరిగిపడిన వయనాడ్ ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సహాయం అందకపోవడం వంటి విషయాల గురించి విలేకరులు ప్రశ్నించగా.. ఇవాళ ఎలాంటి వివాదాస్పద అంశాల జోలికి వెళ్లదల్చుకోలేదంటూ ఆమె సమాధానమిచ్చారు. వయనాడ్‌లో 2019 లోక్‌సభ ఎన్నికల్లో సీపీఐ నేత పీపీ సునీర్‌పై 4.3లక్షల మెజార్టీతో రాహుల్ గాంధీ విజయం సాధించారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్.. సీపీఐ నాయకురాలు అన్నీ రాజాపై 3.6 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఈ నియోజకవర్గంతోపాటు యూపీలోని రాయ్‌బరేలీలోనూ రాహుల్ గెలుపొందడంతో వయనాడ్ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఈ స్థానం నుంచి బరిలోకి దిగిన ప్రియాంకను ఐదు లక్షల మెజార్టీతో గెలిపిస్తామని రాష్ట్ర కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేసింది. లోక్‌సభ ఎన్నికల సమయంలోనూ ప్రియాంక వయనాడ్‌లో పార్టీ తరఫున విస్తృత ప్రచారం నిర్వహించి.. కీలకపాత్ర పోషించారు. కేరళలో పాలక్కాడ్, చెలక్కర అసెంబ్లీ స్థానాలతోపాటు వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నిక నేడు జరుగుతుండగా.. నవంబర్ 23న ఫలితాలు వెల్లడి కానున్నాయి


## ట్రంప్ కార్యవర్గంలో మస్క్ వివేక్ రామస్వామిలకు కీలక బాధ్యతలు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ట్రంప్ తన ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు ముమ్మరం చేశారు. అందులో భాగంగా తన గెలుపులో కీలక పాత్ర పోషించిన బిలియనీర్ ఎలాన్ మస్క్ , వివేక్ రామస్వామి లకు ఎఫిషియెన్సీ శాఖ బాధ్యతలు అప్పగించారు.'ఈ అద్భుతమైన ఇద్దరు ప్రభుత్వ అధికార యంత్రాంగం ప్రక్షాళన, మితిమీరిన నింబధనల కోత, అనవసర ఖర్చు తగ్గింపు, ఫెడరల్ ఏజెన్సీల పునర్నిర్మాణం వంటి బాధ్యతలు నిర్వహిస్తారు. 'సేవ్ అమెరికా-2 ఉద్యమానికి ఇవి ఎంతో ముఖ్యమైనవి. వీరిద్దరూ నా పాలనకు మార్గం సుగమం చేస్తారు' అని ట్రంప్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మరోవైపు, నేషనల్ ఇంటెలిజెన్స్ మాజీ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్‌ను సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ డైరెక్టర్‌గా నియమిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. అమెరికన్‌లందరి రాజ్యాంగ హక్కుల కోసం నిర్భయమైన పోరాట యోధుడిగా రాట్‌క్లిఫ్ నిలుస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. అర్కాన్సాస్ మాజీ గవర్నర్ మైక్ హుక్‌అబీని ఇజ్రాయెల్ రాయబారిగా ఎంపిక చేశారు. రక్షణశాఖ కార్యదర్శి బాధ్యతలను ఫ్యాక్స్ న్యూస్‌లో హోస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న పీట్ హెగ్సెత్‌కు అప్పగించారు.

## మారిషస్ కొత్త ప్రధానిగా నవీన్ రామ్‌గూలం

శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని నరేంద్రమోడీ..



మారిషస్ : మారిషస్ ప్రధానిగా నవీన్ రామ్‌గూలం విజయం సాధించారు. పార్లమెంటరీ ఎన్నికల్లో విజయం సాధించినందుకు ప్రధాని నరేంద్రమోడీ సోమవారం అభినందించారు. రెండు దేశాల మధ్య ప్రత్యేకమైన విశిష్టమైన భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అతనితో కలిసి పనిచేసేందుకు తాను ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. ఆదివారం నాటి పార్లమెంటరీ ఎన్నికల తర్వాత ప్రస్తుతం ప్రధాని ప్రవింద్ జుగ్నాథ్ తన ఓటమిని అంగీకరించారు. ఎల్ అలియన్స్ లెపెప్ భారీ ఓటమిని చవిచూసిందని ఆయన చెప్పారు. మీడియా నివేదికల ప్రకారం, అలయన్స్ ఆఫ్ చేంజ్ కూటమి నాయకుడు నవీన్ రామ్‌గూలం(77) హిందూ మహాసముద్ర ద్వీప సమూహానికి తదుపరి ప్రధాని కాబోతున్నారు. కొత్త ప్రధానికి మోడీ శుభాకాంక్షలు తెలుపుతూ.. భారతదేశాన్ని పర్యటించాలని కోరినట్లు ఎక్స్‌లో వెల్లడించారు.

## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు ఊరట

పలు కేసుల్లో అరెస్టయి జైలులో ఉన్న పాక్ మాజీ ప్రధాని
సెక్షన్ 144 ఉల్లంఘన కేసులలో నిర్దోషిగా ప్రకటన

ఇస్లామాబాద్: పలు కేసుల్లో అరెస్టయి ప్రస్తుతం జైలులో ఉన్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ కు ఊరట లభించింది. రెండేళ్ల క్రితం సెక్షన్ 144 ఉల్లంఘన కింద నమోదైన కేసులో ఇమ్రాన్‌తో పాటు అతని సన్నిహితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ఆయనపై ఆరోపణలను కొట్టివేసిన ఇస్లామాబాద్‌లోని జిల్లా సెషన్స్ కోర్టు.. ఇమ్రాన్ ఖాన్‌తో పాటు షేక్ రషీద్, అసద్ కైసర్, సైఫుల్లా నైజి, సాదాఖత్ అబ్బాసీ, ఫైసల్ జావేద్, అలీ నవాజ్‌లను నిర్దోషులుగా తేల్చింది. ఆవామీ ముస్లిం లీగ్ చీఫ్ అయిన షేక్ రషీద్ ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వంలో ఇంటీరియర్ మంత్రిగా పనిచేసిన విషయం తెలిసిందే. గతంలో పాకిస్థాన్ తెహ్రీక్ ఇ- ఇన్సాఫ్ పార్టీ నేతృత్వంలో చేపట్టిన నిరసన ప్రదర్శనల సందర్భంగా పబ్లిక్‌ఆర్డర్‌ను ఉల్లంఘించారన్న ఆరోపణలపై ఇస్లామా బాద్‌లోని అబ్బారా పోలీస్ స్టేషన్‌లో ఇమ్రాన్ ఖాన్ సహా పలువురు నేతలపై 2022 ఆగస్టు 20న కేసు నమోదైంది. అయితే, వారిపై పోలీసులు మోపిన అభియోగాలను జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ యాసిర్ మహమూద్ కొట్టివేశారు. 2022 ఏప్రిల్‌లో ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం రద్దయినప్పటి నుంచి ఆయనపై డజన్ల కొద్దీ కేసులు నమోదవ్వడంతో ఆయన ప్రస్తుతం జైలులోనే ఉన్నారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసు - పలువురికి నోటీసులు

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః ఫోన్ ట్యాపింగ్ కేసు ఆసక్తికర మలుపులు తీసుకుంటోంది. ఉమ్మడి నల్గొండ, మహబూబ్నగర్ జిల్లాల చుట్టూ ఈ వ్యవహారం నడుస్తోంది. తాజాగా ఈ కేసులో ఈ రెండు జిల్లాలకు చెందిన నలుగురు బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయని తెలుస్తోంది. అందులో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య కూడా ఉన్నారు. ఈ కేసులో భాగంగా గురువారం విచారణకు హాజరు కానున్నారు లింగయ్య. ఫోరెన్సిక్ రిపోర్ట్ నివేదిక ఆధారంగా పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఈ కేసులో నిందితులతో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు పలుమార్లు మాట్లాడారు. త్వరలో మరికొంత మంది రాజకీయ నేతలకు పోలీసులు నోటీసులు ఇవ్వనున్నారని సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో భాగంగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును భారత్కు రప్పించేందుకు పోలీసులు ప్రయత్నం కొనసాగిస్తున్నారని తెలిసింది. ఈ మేరకు ఇంటర్ పోల్కు రెడ్ కార్నర్ నోటీస్ చేరవేశారని వినిపిస్తోంది. ప్రభాకర్ రావు పాస్పోర్ట్ రద్దుకు సంబంధించి విదేశాంగ శాఖకు కూడా సమాచారం అందజేశారట. ఆయన్ను ఏ క్షణమైనా స్వదేశానికి రప్పించే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రభాకర్ రావును విచారిస్తే ఈ కేసులో కీలక పురోగతి ఉండే ఛాన్స్ ఉంది. అందుకే ఆ దిశగా పోలీసులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని కుదిపేసిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం పోలీసు అధికారులకే పరిమితం అవుతుందని అనుకున్నారు. కానీ ఈ వ్యవహారంతో సంబంధాలు ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలకూ నోటీసులు జారీ అవడం ప్రకంపనలు రేపుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని మునుగోడు ఉపఎన్నిక టైమ్లో విపరీతంగా ఫోన్ ట్యాపింగ్ చేశారని, గత సర్కారు దీనిపై బాగానే ఆధారపడిందని వినికిడి. అందుకే ఆ జిల్లా నేతల చుట్టూ ఉచ్చు బిగుస్తోందని తెలుస్తోంది. జిల్లాకు చెందిన చిరుమర్తి లింగయ్యతో పాటు మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి (భువనగిరి), బొల్లం మల్లయ్య యాదవ్ (కోదాడ)కు కూడా పోలీసులు నోటీసులు జారీ చేశారని సమాచారం. వీరిలో తొలుత చిరుమర్తికి నోటీసులు ఇచ్చారని తెలుస్తోంది.

### నలుగురు మాజీ ఎమ్మెల్యేలకు నోటీసులు

## తెలంగాణ నూతన ఆర్ఓఆర్ చట్టం

# దేశానికే రోల్ మోడల్



- వికారాబాద్ ఘటన బాధ్యులపై చర్యలు తప్పవు
- ఎంతటి వారు ఉన్నా వదిలే ప్రసక్తే లేదు
- మంత్రి పొంగులేటి..

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః వికారాబాద్ కలెక్టర్, అధికారులపై దాడి ఘటన వెనుక ఎంతటి వారున్నా వదిలే ప్రసక్తే లేదని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి త్వరలోనే మీడియా ముందుకు తీసుకువస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై కొంతమంది కుట్రలు చేస్తున్నారని, అలాంటి వారి ఆగడాలు ఏమాత్రం సాగవని మంత్రి హెచ్చరించారు. హైదరాబాద్ గాంధీ భవన్లో నిర్వహించిన మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో పొంగులేటి పాల్గొన్నారు. ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలు పెద్దఎత్తున కార్యక్రమానికి హాజరై మంత్రి పొంగులేటికి పలు సమస్యలపై దరఖాస్తులు, ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటా నిలబెట్టుకుంది. ప్రతిపక్షాలు ధర్నాలు, నిరసనలు చేయాల్సిన అవసరం లేదు. అధికారంలో ఉన్నప్పుడు అన్నదాతలను జైళ్లలో పెట్టినవారు ఇప్పుడు పచ్చ కండువా వేసుకుని వారి వద్దకే వెళ్లి మద్దతు ఇస్తున్నామని చెబుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో రైతన్నలను జైళ్లలో పెట్టి ఇప్పుడు ధర్నాలు, నిరాహార దీక్షలు, పోరాటాలు అంటూ వారిని మోసం చేస్తున్నారు. ధరణి చట్టంతో అనేక ఇబ్బందులు పడ్డామని రైతులు, భూ యజమానులు చెప్పిన విషయం గుర్తు లేదా?. ఇందిరమ్మ ఇళ్లు అంటే ఇందిరమ్మ రాజ్యం. అర్హులైన ప్రతి పేదవాడికీ ఇల్లు ఇచ్చే కార్యక్రమం ప్రారంభించాం. ఇవాళ అత్యధికంగా వాటికి సంబంధించిన అర్జీలే వచ్చాయి. బీఆర్ఎస్ పార్టీ డబుల్ బెడ్ రూమ్ల ఆశ పెట్టి గత పదేళ్లపాటు ఎన్నికల్లో గెలిచింది. కానీ వాటిని ఇంతవరకూ కట్టించలేదు. తెలంగాణ పేద ప్రజలకు 24 లక్షల ఇళ్లు కట్టిస్తామని మేము చెప్పాం. గ్రామ సభలు నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుంది. లబ్ధిదారులు నాలుగు వందల చదరపు అడుగుల ఇల్లు కట్టుకోవాల్సి ఉంటుంది. మొదటి విడతలో స్థలం ఉన్నవారికి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం డబ్బు ఇస్తుంది. విడతల వారీగా రూ.5 లక్షలు ఇంటి నిర్మాణానికి ఇస్తాం. ఇంటిని మహిళా యజమాని పేరిట ఇవ్వాలనేది కాంగ్రెస్ లక్ష్యం. అసెంబ్లీ సాక్షిగా దేశానికే రోల్ మోడల్గా ఉండే కొత్త ఆర్ఓఆర్ చట్టం తీసుకువస్తాం. ధరణిని విదేశీ సంస్థలకు బీఆర్ఎస్ తాకట్టు పెట్టింది. దానిని నెల కిందటే విడిపించాం. త్వరలో ఉద్యోగాల నియామకాలకు ఇచ్చిన మాట ప్రకారం భర్తీ చేస్తాం. రైతు రుణమాఫీ కింద రూ.2 లక్షల చొప్పున ఇంకా కొంత మంది రైతులకు అందించాల్సి ఉంది. ఇందిరమ్మ రాజ్యంలో తొండి ఆట ఆడం. మిగిలిన అర్హులైన ప్రతి రైతుకూ రుణమాఫీ చేస్తాం. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో ఉన్న మాట వాస్తవం. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుగు సాగుతున్నాం. రాష్ట్రంలో పండిన చివరి ధాన్యం గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. లగచర్ల ఇష్యూలో కాస్త ఓపిక పడితే ఒక్కొక్కటిగా అన్ని విషయాలూ బయటకు వస్తాయి. దాడి వెనుక ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టప్రకారం శిక్షిస్తాం. ప్రతిపక్షం మాదిరిగా తొందర పడాల్సిన అవసరం లేదు అని చెప్పారు.

# కార్తీక దీపోత్సవానికి రండి

### మంత్రి కొండా సురేఖను ఆహ్వానించిన ఎమ్మెల్యే యశస్విని



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి బుధవారం అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు కొండా సురేఖని రామ్ నగర్ లోని వారి నివాసంలో కలిశారు. నవంబర్ 15న కార్తీక పౌర్ణమి పండుగను పురస్కరించుకుని పాలకుర్తి సోమేశ్వరాలయంలో కార్తీక దీపోత్సవ వేడుకలకు రావాలని మంత్రి సురేఖను కోరారు. అనంతరం పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాల పై ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మంత్రి సురేఖతో చర్చించారు. పాలకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని మంత్రి సురేఖ హామీ ఇచ్చారు.

# వాహనాల కొరత లేకుండా చూడాలి



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః తెలంగాణ వ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ లో రవాణా శాఖ కు సంబంధించిన లారీలు ఇతర వాహనాలు ఇబ్బంది లేకుండా స్థానిక జిల్లా రవాణా అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో సమన్వయం చేసుకోవాలని రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత లేకుండా రవాణా శాఖ తీసుకుంటున్న చర్యల పై అధికారులతో చర్చించారు. జిల్లా కలెక్టర్లు స్థానిక రవాణా శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించడానికి వాహనాల కొరత లేకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని రవాణా శాఖ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు.

# అక్రమ కట్టడాలను కూల్చివేస్తాం



- బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం తీసుకువస్తాం
- హైడ్రా కమిషనర్

తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: హైదరాబాద్ నగరంలోని బతుకమ్మకుంటపై హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు నెలల్లో బతుకమ్మ కుంటకు పూర్వ వైభవం తీసుకొస్తామని వెల్లడించారు. బుధవారం అంబర్ పేట్ బతుకమ్మకుంట చేరుకున్న హైడ్రా కమిషనర్.. ఆక్రమణలకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బతుకమ్మకుంట ప్రాంతంలో ఉన్న ఇండ్ల కూల్చివేతలు ఉండవని స్పష్టం చేశారు. కేవలం బతుకమ్మకుంటను పునరుద్ధరిస్తామని తెలిపారు. స్థానిక ప్రజల్లో కూల్చివేతలు ఉంటాయనే అపోహ ఉందని.. ఆ అపోహలు తొలగించేందుకే బతుకమ్మకుంటకు వచ్చినట్లు చెప్పారు.
ప్రస్తుతం ఉన్న ఐదెకరాల విస్తీర్ణంలోనే పునరుద్ధరణ చేస్తామన్నారు. బతుకమ్మకుంటలోకి వరద నీరు వచ్చే మార్గాలపై రెవెన్యూ, నీటిపారుదల శాఖ అధికారులతో చర్చిస్తామన్నారు. హైడ్రాకు నోటీసులు ఇచ్చే అధికారం ఉందన్నారు. హైడ్రా నోటీసులు అక్రమణదారులకు వెళ్తూనే ఉంటాయని వెల్లడించారు. నాగారంలో రోడ్డు కబ్జా చేసి కట్టిన నిర్మాణాలను ఈరోజు కూల్చేశామని తెలిపారు. ఐదు కాలనీలకు వెళ్ళే రోడ్డును ఆక్రమించారన్నారు. తమకు స్థానికులు ఫిర్యాదు చేయడంతో సర్వే చేశామన్నారు. 15 ఏళ్లుగా కబ్జాలో ఉన్న నిర్మాణాలను తొలగించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్తో పాటు రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ అధికారులు బతుకమ్మకుంటను పరిశీలించారు. అయితే బతుకమ్మకుంట వద్ద హైడ్రా కమిషనర్ పర్యటన నేపథ్యంలో ఉదయం నుంచి హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బతుకమ్మకుంట ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వచ్చాయి. ఈ క్రమంలో ఈరోజు బతుకమ్మకుంటను పరిశీలించాలని రంగనాథ్ నిర్ణయించారు. రంగనాథ్ పర్యటన నేపథ్యంలో భారీగా పోలీసులు మోహరించారు. అయితే తమ ఇళ్లను కూల్చవద్దంటూ స్థానికులు నిరసనకు దిగారు. ఇళ్లను తొలగించకుండా చెరువు సుందరీ కరణ పనులు చేయాలంటూ స్థానికులు డిమాండ్ చేశారు. చివరకు బతుకమ్మకుంటను పరిశీలించిన హైడ్రా కమిషనర్.. అక్కడి ప్రజలతో మాట్లాడారు. ఇండ్లను కూల్చబోమని.. కేవలం బతుకమ్మకుంటను పునరుద్ధరిస్తామని చెప్పడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు నగరంలో హైడ్రా కూల్చివేతలు మళ్లీ మొదలయ్యాయి. బుధవారం నాగారంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. రాంపల్లి సమీపంలో రాజ్ సుఖ్నగర్ కాలనీలో మెయిన్ రోడ్డును ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలు హైడ్రా కూల్చివేసింది. రెండు బ్రేకుల ఎందాలుగా ఏర్పడి కూల్చివేతలు చేపట్టింది హైడ్రా.

## దాడులకు పాల్పడితే

# పీడీ యాక్టు నమోదు చేయడానికి వెనకాడం



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: దాడులకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేయడానికి వెనకాడమని రోడ్లు భవనాల శాఖ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ టాపింగ్ కేసులో ఎవరినీ వదిలిపెట్టమన్నారు. చట్ట ప్రకారం అందరూ శిక్ష అనుభవిస్తారని తెలిపారు. మల్లన్న సాగర్ నిర్మాణం కోసం దళితులు, బీసీ లపై కేసులు పెట్టించింది గత ప్రభుత్వం అన్నారు. ప్రజాభిప్రాయ సేకరణకు వచ్చిన కలెక్టర్ పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా అన్నారు. కలెక్టర్ పై జరిగిన దాడి విషయంలో కేసీఆర్ స్పందించాలి, బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. పోలీసుల విచారణ కొనసాగుతోందన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి.. దీని వెనక కేటీఆర్, మాజీ ఎంఎల్ఏ లు ఇంకా ఎంత పెద్ద వారున్నా వదిలిపెట్టమన్నారు. జైల్ కు వెళ్తే సానుభూతి కోసం చిల్లర రాజకీయాలకు బీఆర్ఎస్, కేటీఆర్ పాల్పడుతున్నారని తెలిపారు. జైల్ కు వెళ్ళకుండా రక్షణ కోసమే కేటీఆర్ డిల్లీ కి వెళ్లినట్లు తెలుస్తోందన్నారు. దాడులకు పాల్పడితే పీడీ యాక్టు నమోదు చేయడానికి వెనకాడం అన్నారు. ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బంది పెట్టే రైస్ మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం రోజుల్లో మొత్తం ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. పత్తి కొనుగోలు విషయంలో కేంద్ర మంత్రులు మాట్లాడటం లేదన్నారు. బీజేపీ, కేంద్ర మంత్రుల తీరు చూస్తుంటే.. బీఆర్ఎస్ కు సపోర్ట్ చేస్తున్నట్లు ఉందన్నారు.

# రేవంత్ రెడ్డిది తుగ్లక్ విధానం



- సొంత అల్లుడి కోసమే ఫార్మా కంపెనీ ఏర్పాటు
- తుగ్లక్ విధానాల వల్లే లగచర్ల ఘటన
- పట్నం నరేందర్ రెడ్డిది అరెస్టు కాదు..కిడ్నాప్
- సురేష్ అనే వ్యక్తి బరాబర్ బీఆర్ఎస్ నాయకుడే
- సీఎం రేవంత్ పై కేటీఆర్ ఫైర్

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి కేటీఆర్ మరోసారి విరుచుకుపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి.. సీఎం రేవంత్ కుటుంబ సభ్యులపై వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి తుగ్లక్ విధానాల వలనే లగచర్ల ఘటన జరిగిందన్నారు. కొడంగల్ నుంచే సీఎం రేవంత్ రెడ్డి భరతం పడుతామని హెచ్చరించారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిది అరెస్ట్ కాదు.. కిడ్నాప్ అంటూ వ్యాఖ్యలు చేశారు. సీఎం సొంత అల్లుడు సత్యనారాయణరెడ్డికి చెందిన ఫార్మా కంపెనీ కోసమే ఫార్మా విలేజ్ను ఏర్పాటు చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సీఎం అల్లుడు సత్యనారాయణరెడ్డి, అన్న శరత్ల ఫార్మా కంపెనీలను విస్తరించటం కోసం ప్రభుత్వం సహకరిస్తోందన్నారు. తన ఏడు ఎకరాల భూమి పోతుందనే కలెక్టర్ను సురేష్ అడిగాడని.. సురేష్ అనే వ్యక్తి.. బరాబర్ బీఆర్ఎస్ నాయకుడే అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ .. వాడో పిచ్చోడు.. ఫార్ములా వన్ ఈ రేసు గురించి ఆయనకేం తెలుసు. నిఘా వ్యవస్థ వైఫల్యం వలనే లగచర్ల ఘటన.. కలెక్టర్ గన్ మెన్లు ఎక్కడ. ప్రభుత్వ కుట్రకు పోలీస్ ఉన్నతాధికారుల బలికావద్దు. కలెక్టర్ ప్రతీక్ జైన్కు సురేష్ పద్ధతిగా.. మర్యాదగా చెప్తే తప్పా. సొంత పార్టీ కార్యకర్తలతో మా నేతలు మాట్లాడితే తప్పా. సురేష్ మమల్ని కలవటం తప్పు అయితే.. రాహుల్ గాంధీ రోజూ తిట్టే అదానీని రేవంత్ కలవటం కూడా తప్పే. హైకోర్టులో పిటిషన్లు వేసి ప్రభుత్వం జడ్జిలను కూడా తప్పుదోవ పట్టిస్తుంది. ఇది ఇందిరమ్మ రాజ్యం కాదు.. ఇందిరా గాంధీ ఎమర్జన్సీ పాలన. రేవంత్ పిచ్చి నిర్ణయాల వలనే కొడంగల్ రగులుతోంది. కొడంగల్ ఎమ్మెల్యే రేవంత్.. మహారాష్ట్రకు మూటలు మోస్తున్నాడు. రైతులు అక్రమ అరెస్టు జరుగుతుంటే సీఎం ఎక్కడ. షోలాపూర్ చౌరాస్తాలో నిలబడినా.. రేవంత్ను ఎవరూ గుర్తుపట్టరు అంటూ వ్యాఖ్యలు చేశారు. కనీసం సతీమణికి కూడా సమాచారం ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అరెస్ట్ చేశారని మండిపడ్డారు. తీవ్రవాదుల మాదిరి రైతులను పొలాల వెంబడి తరుముతున్నారన్నారు. ఫార్మా విలేజ్ వలన వచ్చే లాభమేంటో ముఖ్యమంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర పెద్దలను తాను కలవటం తప్పు అయితే.. సీఎం గవర్నర్ను కలవటం కూడా తప్పే అని అన్నారు. కొడంగల్ రైతులు ఆరేడు నెలలుగా రగులుతున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ను కలిసి విజ్ఞప్తి చేసినా.. పట్టించుకోలేదని మండిపడ్డారు. ఫార్మా సిటీని రద్దు చేస్తామని పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి అనలేదా అని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ఫార్మా సిటీ రద్దు అని చెప్పి.. మళ్ళీ యూటర్న్ ఎందుకు తీసుకున్నారని నిలదీశారు. హైదరాబాద్ భవిష్యత్తు కోసమే ఫార్మా సిటీ నిర్ణయం తీసుకున్నామని మాజీ మంత్రి చెప్పారు. అయితే సీఎం సొంత అల్లుడు సత్యనారాయణ రెడ్డి మాక్స్ బీఎన్ ఫార్మా కంపెనీ విస్తరణ కోసమే ఫార్మా విలేజ్ను ఏర్పాటు చేస్తున్నారన్నారు. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్కు వెళ్ళని రేవంత్.. మెడికవర్ ఆసుపత్రి ప్రారంభోత్సవానికి మాత్రం వెళ్తారన్నారు. తనపై దాడి జరగలేదని స్వయంగా కలెక్టర్ చెప్తుంటే.. ఐజీ దాడి జరిగిందంటున్నారని మాజీ మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు.

# ప్రశ్నించే గొంతును నిర్బంధాలతో అణిచివేయలేరు



తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః ప్రశ్నించే గొంతును నిర్బంధాలతో అణిచివేయలేరని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని అక్రమ అరెస్టు చేయడం దుర్మార్గమన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలన గాలికి వదిలి అరెస్టులు, అక్రమ కేసులు, ముందస్తు నిర్బంధాలు విధిస్తూ రాజకీయ కక్ష తీర్చుకోవడం సిగ్గుచేటన్నారు. పచ్చని పొలాల్లో ఫార్మసిటీ పేరిట చిచ్చు పెట్టడమే మీ ప్రజాపాలనా? అని ప్రశ్నించారు. నడి రాత్రి రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో పెట్టడమే మీ ఇందిరమ్మ రాజ్యమా? అని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు, కేసులు, నిర్బంధాలతో అణిచివేయలేరని హెచ్చరించారు. మీ బెదిరింపులకు బీఆర్ఎస్ పార్టీ భయపడదన్నారు. ప్రజాక్షేత్రంలోనే మిమ్మల్ని ఎండగడతం. ప్రజల తరపున నిలదీస్తూనే ఉంటామన్నారు. అరెస్టు చేసిన పట్నం నరేందర్ రెడ్డిని, రైతులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామని హరీష్ రావు అన్నారు. మరోవైపు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. పట్నం నరేందర్ రెడ్డి నివాసం వద్దకు వెళ్లారు. పట్నం నరేందర్ రెడ్డి సతీమణితో మాట్లాడారు. అక్కడ సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్ పై దాడి జరగడం బాధాకరమని తెలిపారు. ఈ ఘటన బీఆర్ఎస్ నేతలపై కావాలని కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం లో జరిగిన ఘటన.. అధికారుల మీద కోపంతో కాదు ముఖ్యమంత్రి మీద కోపం ఈ ప్రభుత్వం మీద కోపంతో దాడి జరిగిందన్నారు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం రైతుల బాధ వినండి అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ల్యాండ్ కి సంబంధించి 8 నెలలు రైతులను ఒప్పించి వాళ్ళకి ఏం కావాలో తెలుసుకున్నామన్నారు. ఇది న్యాయం కాదు, రెచ్చగొట్టే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. అక్రమంగా అరెస్టు చేయడం మంచిది కాదన్నారు. ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల ఈ ఘటనలు జరుగుతున్నాయని మండిపడ్డారు.

# హరీష్ రావు తెలుసుకొని మాట్లాడాలి..



### మాజీ మంత్రి హరీష్ రావుపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఫైర్..

తెలంగాణ బ్యూరో(ప్రతినిధిః హరీష్ రావు తెలుసుకొని మాట్లాడాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన జగిత్యాల అభివృద్ధి ఉమ్మడి రాష్ట్రానికి రోల్ మోడల్ గా నిలిచిందని క్లారిటీ ఇచ్చారు. ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ లో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, విప్ అడ్లూరి లక్ష్మణ్ ల ప్రెస్ మీట్ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకుల పై మండిపడ్డారు. ధాన్యం సేకరణలో గత ఖరీఫ్ కంటే ముందంజలో ఉన్నామన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుకు వడ్డీ కట్టడానికి మళ్ళీ అప్పులు చేయాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం మూసి ప్రక్షాళన అవశ్యకత ను గుర్తించి మూసి ప్రక్షాళన మొదలు పెట్టారని తెలిపారు. మూసి ప్రక్షాళన లో నిర్వాసితుల కు న్యాయం చేసిన తర్వాతే మూసి ప్రక్షాళన మొదలు పెడుతామన్నారు. ప్రజాసంక్షేమం కోసం కట్టుబడి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు చేసిన రుణమాఫీ కేవలం వడ్డీ మాఫీగానే మిగిలిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏక కాలంలో రూ.18000 కోట్లతో రైతుల కు రెండు లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నామన్నారు. రుణమాఫీ కాని రైతులకు ఈనెల చివరిలో పూర్తిగా రుణమాఫీ చేస్తామని క్లారిటీ ఇచ్చారు. హరీష్ రావు పై విప్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. సాంకేతిక కారణాలతో రైతు రుణమాఫీలో కొంత జాప్యం జరిగిందన్నారు. రుణమాఫీ కాని రైతుల సమస్య గురించి సీఎం దృష్టి కి తీసుకెళ్ళామన్నారు. హరీష్ రావు ఎక్కడికి రమ్మంటావు.. 65 వేల కుటుంబలకు రుణమాఫీ చేసామన్నారు. జిల్లా అభివృద్ధి, రైతు రుణమాఫీలో తెల్చుకుందామా ఎక్కడికి రమ్మంటావో చెప్పు హరీష్ రావు అని సవాల్ విసిరారు. రైతులు ఆత్మహత్య చేసుకుంటే ఒక్క రైతు నైన పరామర్శించారా? అని ప్రశ్నించారు. డబ్బుల సంచుల సంస్కృతి మాది కాదు.. మీ మామ కేసీఆర్ ది హరీష్ రావు అన్నారు. హరీష్ రావుకు 70 ఎంఎం చూపిస్తా అన్నారు. ధర్మపురిలో పూజలు, యాగాలు చేసిన కేసీఆర్.. 500 కోట్లు కేటాయిస్తాను అని అన్నావు ధర్మపురి అభివృద్ధికి ఏం అయ్యిందని ప్రశ్నించారు

# కులగణనను వ్యతిరేకించే వారంతా ప్రజా ద్రోహులే..

### పీపుల్స్ కమిటీ సమావేశంలో ప్రొఫెసర్లు, ఇంజనీర్లు

తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: కులగణనను వ్యతిరేకించే వారంతా ప్రజా ద్రోహులని, రాష్ట్రంలో అభివృద్ధి ఫలాలు అన్ని వర్గాలకు సమానంగా దక్కాలంటే కులగణన విజయవంతం కావాలని పలువురు ప్రొఫెసర్లు, ఇంజనీర్లు అన్నారు. 77ఏళ్ల తర్వాత జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను తెలంగాణ ప్రజలంతా స్వాగతించాలని పిలుపునిచ్చారు. పీపుల్స్ కమిటీ ఆన్ కాస్ట్ సెన్సెస్ ఆధ్వర్యంలో తెలంగాణలో కులగణనపై జరుగుతున్న అసత్యప్రచారానికి వ్యతిరేకంగా ఆ కమిటీ సోమాజిగూడ ప్రెస్క్లబ్లో సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రొ.కె.మురళీమనోహర్ మాట్లాడుతూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కులగణనను కొంతమంది, కొన్ని సంఘాలు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. ఒకప్పుడు కులగణనకు మద్దతు పలికిన పార్టీలు ఇప్పుడు వ్యతిరేకిస్తున్నాయని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రొ.ఎస్. సింహాద్రి మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నేతలు కొంతమంది మెలికలు పెట్టి కులగణనను వ్యతిరేకించే ప్రయత్నాలు చేస్తున్నారని వాటిని మానుకోవాలన్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్తో పాటు అన్ని ప్రాంతాల ప్రజలు సర్వేలో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.
ఈ కార్యక్రమంలో ప్రొ.వినుకొండ తిరుమలి, ప్రొ.సుదర్శన్రావు, ప్రొ. పీఎల్. విశ్వేశ్వరరావు, ఇంజనీర్లు దేవల్ల సమ్మయ్య, సతీష్ కొట్టే, తుల్జరాంసింగ్లు మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులసర్వేతో అణగారిన కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. కులగణన ప్రశాంతంగా జరిగేవిధంగా అన్ని రాజకీయపార్టీలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఇంజనీరు వినోద్ కురవ, ప్రొ.నరేంద్రబాబు, ప్రొ.రాధాకృష్ణ, ప్రొ.నాగుల వేణు, భద్రయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

# పట్నం నరేందర్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్



తెలంగాణ బ్యూరో(ప్రతినిధి: వికారాబాద్ కలెక్టర్పై దాడి కేసులో అరెస్ట్ అయిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డితో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫోన్లో మాట్లాడారు. అక్రమ అరెస్టుపైన ఆందోళన చెందవద్దని ధైర్యంగా ఉండాలని ఆయన కోరారు. ప్రభుత్వ అప్రజాస్వామిక నియంత విధానాలపైన పార్టీ న్యాయపరంగా పోరాటం చేస్తూనే ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు. అలాగే నరేందర్ రెడ్డి సతీమణి శృతితో కూడా మాజీ మంత్రి సంభాషించారు. బీఆర్ఎస్ పార్టీ మొత్తం మీ కుటుంబానికి అండగా ఉంటుంది అని భరోసా ఇచ్చారు. పార్టీ లీగల్ సెల్ నరేందర్ రెడ్డి అరెస్టైన కోర్టులో పోరాటం చేస్తుందని హామీ కేటీఆర్ ఇచ్చారు. మరోవైపు వికారాబాద్ డీటీసీ సెంటర్లో ఉన్న నరేందర్ రెడ్డిని కలిసేందుకు మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, ఆనంద్ను పోలీసులు అనుమతించారు. అయితే మీడియాకు మాత్రం అనుమతి నిరాకరించారు. నరేందర్ రెడ్డిని కలిసిన అనంతరం పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లగచర్లలో జరిగిన సంఘటనపై కలెక్టర్నే స్వయంగా దాడి జరగలేదన్నారని తెలిపారు. రైతుల భూములను గుంజు కోవాలనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి అరెస్ట్ అక్రమమన్నారు. ప్రజా ప్రతినిధులకు ఎందరో ఫోన్లు చేస్తుంటారని... నరేందర్ రెడ్డితో ఫోన్ మాట్లాడిండనే కారణం చూపడం అన్యాయమన్నారు. రైతులను కష్టపెట్టి... భయపెట్టి వారి భూములు గుంజుకోవాలని ప్రభుత్వం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తూ రైతులతో పాటు నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తున్నారన్నారు. నాయకులు ఫోన్ మాట్లాడితేనే కేసులు వేస్తే.. నాయకులనే వారు ఎవరూ మిగలరన్నారు. అక్రమ కేసులను తీవ్రంగా ఖండిస్తున్నామని... నరేందర్ రెడ్డి అక్రమ అరెస్ట్ను కోర్టులో తేల్చుకుంటామని మహేష్ రెడ్డి స్పష్టం చేశారు

**నా అరెస్టు కుట్రే : మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి**

లగచర్లలో కలెక్టర్ మీద జరిగిన దాడిని బీఆర్ఎస్కు ఆపాదించే కుట్రలో భాగంగానే తనను అరెస్ట్ చేశారని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్ మీద జరిగిన దాడి ఘటనలో నరేందర్ రెడ్డి ప్రమేయం ఉందని పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. తన అరెస్ట్పై ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందన్నారు. సొంత నియోజకవర్గం కొడంగల్లో రైతుల తిరుగుబాటుతో సీఎం కంగుతిన్నారన్నారు. ఆ డ్యామేజీని కంట్రోల్ చేసుకోవడానికే లగచర్లలో జరిగిన ఘటనను బీఆర్ఎస్కు ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు సమస్యల్లో ఉన్నప్పుడు ప్రజాగొంతుకై ప్రశ్నించడం ప్రతిపక్షంగా తమ బాధ్యత అన్నారు. సమస్యలకు పరిష్కారం ఆలోచించకుండా ప్రతిపక్షాలను వేధించడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని ఆరోపించారు. ప్రభుత్వం బాధ్యత మరిచినప్పుడు ప్రతిపక్షంగా తాము నిలదీస్తామన్నారు. ప్రశ్నించడం తప్పెలా అవుతుందో చెప్పాలన్నారు.



# చాచా జన్మదినం





# బాలల దినం

**చిల్డ్రన్స్ డే లేదా బాలల దినోత్సవం... ఈ పండుగ కేవలం పిల్లల కోసం ఏర్పాటు చేసినది. మన దేశంలో ఉన్న ప్రతి బిడ్డా ఆనందంగా ఉండాలన్న నెహ్రూ ఆకాంక్ష రూపమే ఈ చిల్డ్రన్స్ డే. మన దేశ మొదటి ప్రధాన మంత్రి అయినా జవహర్ లాల్ నెహ్రూకి పిల్లలంటే ఎంతో ప్రేమ. వారు కనిపిస్తే చాలు ఆయన మనసు కరిగిపోయేది. అందుకే ఆయన పుట్టిన రోజున అంటే నవంబర్ 14న భారతదేశంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించుకుంటాం. చాచా నెహ్రూ కోరిక ప్రకారం పిల్లలకు వారి హక్కులు, విద్యా, సంక్షేమం అన్ని సవ్యంగా అందాలి. అలా అందించే బాధ్యత ఈ ప్రభుత్వం, పెద్దలు, సమాజానిదే. రాజ్యాంగం కూడా పిల్లల కోసం కొన్ని హక్కులను కల్పించింది. ఆ హక్కుల వారికి అందేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.**

భారత తొలి ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు, మేధావి, న్యాయవాది, రచయి-ంత పండిట్ జవహర్లాల్ నెహ్రూ జన్మదినం వేదికగా ప్రతి ఏట దేశవ్యాప్తంగా 1957 నుంచి "బాలల దినో త్సవం లేదా బాల దివస్" నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది. జాతిపిత గాంధీని అన్నగా భావించడంతో జవహర్లాల్ నెహ్రూను పిల్లలు ముద్దుగా "చాచా నెహ్రూ" అని పిలుచుకునే వారని మనకు తెలుసు. బాలల పట్ల అవ్యాజమైన ప్రేమను, వారి పరిపూర్ణ వ్యక్తిత్వవికాసానికి అవసరమైన నిర్బంధ ఉచిత విద్యను కల్పించి, బాలల హక్కులను పరిరక్షిస్తూ రేపటి భావిభారత పౌరుల అభ్యున్నతికి పునాదులు వేయగలిగారు. 1855లో బాలల ఫిలిమ్ సొసైటీని స్థాపించి పిల్ల ల ఇతివృత్తంగా సినిమాలు రావాలని కోరుకున్న ఘనుడు మన నెహ్రూ. బాలల సమ్మిళిత అభివృద్ధిని కాంక్షిస్తూ అన్ని వర్గాల పిల్లల సమగ్రాభివృద్ధిని కోరుకొని ఆ దిశగా అడుగులు వేశారు. బాలల సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ ప్రతి ఏట 20 నవంబర్ రోజున "ప్రపంచ బాలల దినం", 01 జూన్ రోజున "అంతర్జాతీయ బాలల దినం" నిర్వహించడం పరిపాటి అవుతున్నది. నెహ్రూ మరణానంతరం భారత పార్లమెంట్ తీసుకున్న తీర్మానం ప్రకారం 14 నవంబర్న బాలల దినం జరుపుకోవడం ప్రారంభమైనది. చాచా నెహ్రూ 14 నవంబర్ 1889న జన్మించారని మనకు తెలుసు.

**నేటి బాలల నిర్లక్ష్యం రేపటి భారతానికే పెనుశాపం:** నేటి ప్రతి చిన్నారి రేపటి ఓ అద్భుత నిధి. భావిభారత బాలల పెంపకం, విద్య, పోషకాహారం, బాలల హక్కులు, ఆరోగ్యం లాంటి పలు సమస్యల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి నేటి బాలల దినోత్సవ వేదికలు వినియో గించబడాలి. రేపటి భారత చరిత్రను ప్రభావితం చేయగల నేటి చిన్నారుల నిర్లక్ష్యం దేశానికే పెను శాపంగా మారుతుందని కోలుసుకోవాలి. బాలల దినోత్సవ వేదికగా పిల్లలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించడం అనాదిగా జరిగుతోంది. విద్యాలయాల్లో పోటీలు, కల్చరల్ ఆక్టివిటీస్, ర్యాలీలు, వ్యాసరచన, ప్రసంగాలు లాంటి పలు కార్యక్రమాలను నిర్వహించడం, చిన్నారుల భవిష్యత్తుకు పెద్దలు కంకనబద్దులు కావడం జరగాలి.

**బాలల దినోత్సవం వస్తే ప్రతి పాఠశాలలో రకరకాల టాలెంట్ షోలు, సాంస్కృతిక ప్రదర్శనలు, సరదా ఆటలు పెడుతూ ఉంటారు. నిజానికి పిల్లలకు తమకు ఈ దేశం నుంచి కల్పించే రక్షణ వ్యవస్థ గురించి చెప్పాలి. వారి రాజ్యాంగపు హక్కుల గురించి వివరించాలి. వారు ఎక్కడైనా హింసకు గురైతే వారిని వారు ఎలా కాపాడుకోవాలో, రక్షణను ఎలా కోరాలో వివరించాలి. అలా అయితేనే బాధలు సురక్షితంగా ఎదగగలరు.**




**బాలల ప్రాథమిక హక్కులు :** భారత రాజ్యాంగం బాలల కోసం అనేక ప్రాథమిక హక్కులను ఇచ్చింది. వారి కోసం బాలల హక్కుల చట్టాన్ని చేసింది. వాటిలో కొన్ని ముఖ్యమైన చట్టాలు ఉన్నాయి. వీటి గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకోవాలి. తమ పిల్లలకు కూడా వీటి గురించి చెప్పాలి. ఆ హక్కులు ఏంటో తెలుసుకోండి.

**సమానత్వపు హక్కు :** రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం ప్రతి బిడ్డా సమానమే. ప్రతి బిడ్డను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉంది. వారికి అవసరమైనప్పుడు చికిత్సను అందించాలి. అందరి పిల్లలను సమానంగా చూడాలి. పేద, ధనికా అనే బేధం ఇక్కడ లేదు. అదే ఈ సమానత్వ హక్కు చెబుతోంది.

**జీవించే హక్కు :** ఈ భారతదేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు జీవించే హక్కు ఉంది. వారికి పూర్తి స్వేచ్ఛను, భద్రతను ఇవ్వాల్సిన బాధ్యత సమాజానిదే. వారిని రక్షించుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, సమాజం, ప్రభుత్వానిదే అని ఆర్టికల్ 21 చెబుతోంది. వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించే హక్కు ఎవరికీ లేదు.

**వివక్ష :** పిల్లలను వారి జాతి, మతం, కులం, లింగం ఆధారంగా వివక్షకు గురి చేయకూడదు. వారు పుట్టిన ప్రదేశం, వారి రంగు, రూపం ఆధారంగా వివక్షను చూపించకూడదు. అందరి పిల్లలను సమానంగా చూడాలని ఆర్టికల్ 15 వివరిస్తోంది.

**ఉచిత నిర్బంధ విద్యాహక్కు :** ఆర్టికల్ 21ఏ చెబుతున్న ప్రకారం ఈ దేశంలో పుట్టిన ప్రతి పిల్లాడికి ఉచిత విద్యను అందించాలి. అలాగే నిర్బంధ విద్యను కూడా ఇవ్వాలి. ముఖ్యంగా ఆరు ఏళ్ల నుండి 14 సంవత్సరాల మధ్య పిల్లలకు విద్యను కచ్చితంగా అందించాల్సిందే. నిర్బంధ విద్య అంటే వారికి ఇష్టం లేకపోయినా కూడా వారిని స్కూల్లో జాయిన్ చేసి చదివించాల్సిన బాధ్యత ఉంది. అది వారి భవిష్యత్తు కోసమే.



**దోపిడి నుంచి రక్షణ :** ఎన్నో చోట్ల పిల్లల అక్రమ రవాణా జరుగుతోంది. వారిని బలవంతంగా వెట్టి చాకిరీలోకి పంపిస్తున్నారు. ఇలా చేయకుండా వారి అక్రమ రవాణాలను అడ్డుకోవడానికి ఆర్టికల్ 23 ఏర్పాటు చేశారు. దీని ప్రకారం పిల్లలను అక్రమంగా తీసుకెళ్లి పనుల్లో పెట్టుకోవడం నేరం.

**ప్రమాదకర పనులు :** పద్నాలుగేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ఉద్యోగాలలో నియమించుకోకూడదు. ముఖ్యంగా ప్రమాదకర పరిస్థితుల్లో చేసే పనుల్లో వీరిని ఉంచకూడదని ఆర్టికల్ 24 చెబుతోంది.

**భాగస్వామ్య హక్కు :** పిల్లలు తమకు నచ్చిన విషయాలను లేదా నచ్చిన చదువును గురించి అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు వారికి ఉంది. వారి అభిప్రాయాల్ని కొట్టిపడేయాల్సిన అవసరం లేదు. వారి అభిప్రాయాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని రాజ్యాంగం వివరిస్తుంది.

**గుర్తింపు హక్కు :** ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు ఒక పేరు, జాతీయత కచ్చితంగా ఉంటుంది. అలాగే వారి కుటుంబ సంబంధాల విషయంలో కూడా వారు పలానా వారి అబ్బాయి అనే హక్కును కల్పిస్తుంది. ఎవరూ కూడా బిడ్డ జాతీయతను లేదా కుటుంబ సంబంధాలను నిర్వీర్యం చేయలేరు.

**పర్యావరణ హక్కు :**పిల్లలు తమ చుట్టూ ఉన్న పరిసరాలలో ఆనందంగా జీవించే సురక్షిత పర్యావరణ హక్కును వారికి ఇవ్వాలి. వారి ఆనందాన్ని దూరం చేసి పరిసరాలలో దుర్వినియోగం, హింస, దోపిడీ వంటి వాటికీ గురికాకుండా రాజ్యాంగం రక్షణ కల్పిస్తోంది.

**అభివృద్ధి హక్కు :** ఈ దేశంలో పుట్టిన ప్రతి బిడ్డకు ఆరోగ్యపరంగా సంరక్షణ లభించాలి. పోషకాహారం అందించాలి. వారి సంపూర్ణ అభివృద్ధికి అవకాశాలు కల్పించాలని రాజ్యాంగం ఆర్టికల్ 39 ఎఫ్ లో వివరిస్తుంది.

బాల్యం ఓ అద్వితీయ భాగ్యం. బాల్య దశలో పిల్లల్ని స్వేచ్ఛగా కలలు కనినిద్దాం, వాటి సాకారానికి దోహదపడదాం. తోటలో మొక్కలు మన భారతావనిలో బాలలు. వారిని సుగంధానికి పువ్వులుగా వికసించడానికి కావలసిన పెట్టుబడిని పెట్టడం మన పౌరసమాజ కనీస బాధ్యత. రేపటి భారతానికి వారే అమూల్య వనరులు, సుస్థిరాభివృద్ధికి ఊతం ఇవ్వగల పౌరులు. నేటి బాలల సమగ్రాభివృద్ధిని కాంక్షిస్తూ తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరసమాజం అందరూ కలిసి పిల్లల తలరాతను మార్చి భరతమాత సంతోషానికి కారణం అవుదాం, పిల్లల్ని పువ్వుల్లో పెట్టి పెంచుకుందాం, వారి స్వచ్ఛమైన చిరునవ్వుకు కారణం అవుదాం. చిన్నారుల భవితకు భరోసానిద్దాం.

**డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**
**9949700037**

## బాలభారతాన్ని వేధిస్తున్న సమస్యలు

నేటి భరతమాత బిడ్డలు, రేపటి ఉజ్వల భవిత కలిగిన అన్ని వర్గాల భారత బాలలకు ఉచిత విద్య, వైద్యం, హక్కుల పరిరక్షణ, కనీస అవసరాల కల్పన, పారిశుద్ధ్యం జరిగినప్పుడే రేపటి భారతం అభివృద్ధి దిశగా ఎదుగుతుంది. స్వతంత్ర భారత శతాబ్ది ఉత్సవాలు జరుపుకోవడానికి ఉవ్విళ్లూరుతున్న భారతంలో బాలల సమస్యలు ఇంకా మనల్ని వెంటాడుతూనే ఉన్నాయి. అందరికీ విద్య అందడం లేదు. పేదరికంలో మగ్గుతూ పోషకాహారానికి దూరం అవుతున్నారు. బాల కార్మిక వ్యవస్థ మనల్ని వెక్కిరిస్తున్నది. బాలల అక్రమ రవాణా సంక్షోభం దినదినం పెరుగుతున్నది. బాల్య వివాహాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. అందరికీ ఆరోగ్యం అందని ద్రాక్షే అవుతున్నది. నాణ్యమైన ఉచిత విద్య కలగానే మిగిలి పోయింది. వీధి బాలలు నేటి డిజిటల్ భారతాన్ని వెక్కిరిస్తున్నారు. బలవంతపు భిక్షాటన మన కళ్ల ముందు జడలు విప్పుతోంది. బాలికలను అక్రమ రవాణా చేసి బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి దించుతున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఎండమావులే అవుతున్నాయి. ప్రమాదకరమైన పరిశ్రమల్లో చిన్నారుల భవిష్యత్తు మడి మసిబొగ్గు అవుతున్నది.





# ఇంట్రాస్క్వాడ్‌తో భారత్ వార్మప్ మ్యాచ్.. బీసీసీఐ ఓ కండీషన్!

ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్ ఆడేందుకు భారత్ ఇప్పటికే ఆ గడ్డపై అడుగు పెట్టింది. వాకా స్టేడియం వేదికగా ప్లేయర్లు ప్రాక్టీస్ ప్రారంభించారు. ఈ సెషన్ను చూసేందుకు అభిమానులను అనుమతించ లేదు. సిబ్బంది ఫోన్లను కూడా తీసుకున్నట్లు వార్తలు వచ్చాయి. అయినా సరే, భారత ఆటగాళ్ల ప్రాక్టీస్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వచ్చాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. భారత్ ఆడే వార్మప్ మ్యాచ్కూ అభిమానులను అనుమతించడం లేదని సమాచారం.ఆసీస్తో ఈ నెల 22న పెర్త్ మ్యాచ్తో సిరీస్ ఆరంభమవుతుంది. దీనికి ముందు భారత్-ఎతో ఆడాల్సిన సన్నాహక మ్యాచ్ను టీమ్ఇండియా తొలుత రద్దు చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఇంట్రాస్క్వాడ్తో వార్మప్ మ్యాచ్ ఆడేందుకు భారత్ సిద్ధమని తెలుస్తోంది. వాకా వేదికగానే శుక్రవారం నుంచి ఆదివారం వరకు ఈ మ్యాచ్ జరగనుందని సమాచారం.నవంబర్ 22 వరకు ప్రాక్టీస్ కొనసాగించాలని తొలుత టీమ్ఇండియా భావించింది. పెర్త్ పిచ్ పేస్కు అనుకూలంగా ఉంటుంది. వార్మప్ మ్యాచ్ ఉంటేనే ఆటగాళ్లు అందుకు తగినట్లుగా సిద్ధమయ్యేందుకు ఎక్కువ అవకాశం ఉంటుందనే ఉద్దేశంతో ఇంట్రాస్క్వాడ్తో భారత్ ఆడనుందని క్రికెట్ వర్గాలు తెలిపాయి. అభిమానులు, ప్రేక్షకులు లేకుండానే వార్మప్ మ్యాచ్ నిర్వహించేలా చూడాలని బీసీసీఐ కండీషన్ పెట్టింది. అప్పుడే వార్మప్ మ్యాచ్ ఆడేందుకు అనుమతి ఇస్తామని స్పష్టం చేసింది.

## బోర్డర్ - గావస్కర్ ట్రోఫీ..

# విరాట్-రోహిత్ ఫామ్‌పై మైండ్ గేమ్ స్టార్ట్

ఆస్ట్రేలియా - భారత్ జట్ల మధ్య దాదాపు ముప్పై ఏళ్ల తర్వాత ఐదు టెస్టుల సిరీస్ జరగబోతోంది. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీని మూడోసారి ఆసీస్ గడ్డపై దక్కించుకోవాలనే లక్ష్యంతో టీమ్ఇండియా అక్కడికి వెళ్లింది. అయితే, కెప్టెన్ రోహిత్ శర్మతోపాటు విరాట్ కోహ్లీ ఫామ్పై అభిమానుల్లో ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో ఆసీస్ మాజీ క్రికెటర్లు ఇప్పటికే భారత ద్వయంపై మైండ్గేమ్ స్టార్ట్ చేశారు. మొన్న కోహ్లీ ఫామ్పై స్పందించిన రికీ పాంటింగ్కు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ కౌంటర్ ఇచ్చాడు. తాజాగా ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ కెర్రీ ఓ కీఫె కూడా ఇదే బాటలోకి వెళ్లాడు. విరాట్పై ప్రశంసలు కురిపిస్తూనే.. బ్యాటింగ్లో బలహీనంగా కనిపిస్తున్నాడని వ్యాఖ్యానించాడు. రోహిత్ను లక్ష్యం చేసుకొని ఆసీస్ బౌలర్లు బౌలింగ్ చేస్తారని కీఫె వెల్లడించాడు.
రోహిత్ తొలి టెస్టుకు మిస్ అవుతాడని తెలుస్తోంది. అతడు భారత జట్టు సారథి. ఎప్పుడు బరిలోకి దిగినా ఆస్ట్రేలియా బౌలర్లు మిస్సైల్లా దూసుకుపోయే అతడికి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నిస్తారు. ఈ సిరీస్ రోహిత్కు కష్టంగా మారే అవకాశం ఉంది. ఇక కోహ్లీ ప్రపంచంలోనే అత్యుత్తమ ఆటగాడు. గత కొన్నేళ్లుగా ఆసీస్ను కలవరపెట్టిన బ్యాటర్. అయితే, ఇప్పుడీ కింగ్ కాస్త బలహీనంగా అనిపిస్తున్నాడు. ఈ సిరీస్ను కోహ్లీ ఎలా ముగిస్తాడో చూడాలని ఆత్రుతగా ఉంది. ఒకవేళ అతడు ఆధిపత్యం ప్రదర్శించాడో.. భారత్ విజేతగా నిలవడం ఖాయం అని కీఫె తెలిపాడు.

షమీ లేకపోవడం భారత్కు లోటే: పాల్ ఆడమ్స్

ఆసీస్తో టెస్టు సిరీస్కు ప్రకటించిన జట్టులో షమీ లేడు. అతడు గాయం కారణంగా ఫిట్నెస్ సాధించలేదు. ఒకవేళ షమీ కోలుకుని వస్తే ఫర్వాలేదు. రాకపోతే మాత్రం భారత్కు పెద్ద లోటు అవుతుంది. ఆస్ట్రేలియాపై బుమ్రాకు తోడుగా షమీ ఉంటే భారత బౌలింగ్ విభాగం మరింత బలంగా మారుతుంది. ఎందుకంటే ఆసీస్ పిచ్లు బౌన్సీ కావడంతో పేస్కు అనుకూలంగా ఉంటాయి. త్వరగా కోలుకుని వస్తాడని ఆశిస్తున్నా అని దక్షిణాఫ్రికా మాజీ ఆటగాడు పాల్ ఆడమ్స్ వ్యాఖ్యానించాడు. చాలా రోజుల తర్వాత షమీ మళ్లీ దేశవాళీ క్రికెట్లోకి అడుగు పెట్టాడు. రంజీటఫీలో బెంగాల్ తరఫున ఇవాళ మ్యాచ్లో ఆడుతున్నాడు. ఫిట్నెస్ నిరూపించుకొంటే ఆసీస్ కనీసం రెండో టెస్టుకైనా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**షమి వస్తున్నాడు.. :** భారత స్టార్ పేసర్ మహ్మద్ షమి ఎట్టకేలకు తిరిగి మైదానంలో అడుగుపెట్టనున్నాడు. బుధవారం బెంగాల్, మధ్యప్రదేశ్ మధ్య ఇండోర్లో ఆరంభమయ్యే రంజీ ట్రోఫీ మ్యాచ్తో షమి పునరాగమనం చేయనున్నాడని బెంగాల్ క్రికెట్ సంఘం ప్రకటించింది. షమి బెంగాల్ ఆటగాడు. గాయం, శస్త్రచికిత్స కారణంగా అతడు ఏడాది పాటు క్రికెట్కు దూరమయ్యాడు. నిరుడు నవంబరులో ప్రపంచకప్ ఫైనల్ తర్వాత షమి మళ్లీ మ్యాచ్ ఆడలేదు. షమి బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్లోని చాలా రోజులు పునరావాసంలో ఉన్నాడు. అక్కడ నెట్స్లో సాధన చేశాడు. రంజీ మ్యాచ్తో ఫిట్నెస్ నిరూపించుకోవాలనే పట్టుదలతో ఉన్నాడు. షమి ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికవుతాడని ఊహాగానాలు వచ్చాయి. అతడు పూర్తిగా కోలుకోలేదని కెప్టెన్ రోహిత్ శర్మ అప్పుడే స్పష్టం చేశాడు.



## ఛాంపియన్స్ ట్రోఫీ 2025.. పీసీబీ నిర్ణయానికే

# పాక్ ప్రభుత్వం మద్దతు..!



ఛాంపియన్స్ ట్రోఫీ 2025ని పాకిస్థాన్ నిర్వహిస్తుందా? వేరే దేశానికి అతిథ్య హక్కులు వెళ్లిపోతాయా? అనేది ఇప్పుడందరి మదిలో ఉన్న సందేహం. ఎందుకంటే పాక్కు భారత్ వెళ్లడం అసాధ్యం. హైబ్రిడ్ మోడల్లో టోర్నీని నిర్వహించాలని ఇప్పటికే పీసీబీకి ఐసీసీ సూచించింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు మాత్రం అందుకు ససేమిరా అని పట్టుదల ప్రదర్శిస్తోంది. ఇదే విషయాన్ని తమ ప్రభుత్వానికి కూడా నివేదించింది. తాజాగా వస్తున్న వార్తల ప్రకారం పాక్ ప్రభుత్వం కూడా పీసీబీకి అనుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ ఆతిథ్యమిస్తే.. ఒక్క మ్యాచ్ కూడా బయట దేశాల్లో నిర్వహించొద్దని స్పష్టం చేసినట్లు సమాచారం. స్వదేశంలోనే టోర్నీ మొత్తం జరగాలని పాక్ ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.
మా ప్రభుత్వం నుంచి మాకు స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఒక్క మ్యాచ్ కూడా బయటకు వెళ్లేందుకు అనుమతించే ప్రసక్తే లేదు. మేం ఇప్పటికే మా వైఖరి చెప్పాం. భారత్ నిర్ణయం ఏంటో మాకు ఐసీసీ తెలియజేసింది. ఛాంపియన్స్ ట్రోఫీని నిర్వహించే హక్కులు మాకే ఉన్నాయి. పాక్ ఆవల ఒక్క మ్యాచ్ను కూడా నిర్వహించం అని పీసీబీ వర్గాలు తెలిపాయి.
ఒకవేళ ఇదే పట్టుదలతో పీసీబీ ఉంటే మాత్రం ఐసీసీ హోస్ట్ అవకాశాన్ని మరో దేశానికి అప్పగిస్తుందని వార్తలు వస్తున్నాయి. భారత్ లేకుండా మెగా టోర్నీ నిర్వహిస్తే ఆర్థికంగా ఇబ్బందులు తప్పవని పాక్తోపాటు ఐసీసీకీ తెలుసు. భారత్ - పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ను చూసేందుకు ప్రపంచంలోని క్రికెట్ అభిమానులు భారీగా ఆసక్తిగా చూపిస్తారు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం పంపించిన ముసాయిదా షెడ్యూల్లోనూ దాయాది జట్లు ఒకే గ్రూప్లో ఉన్నాయి. బీసీసీఐ తమ దేశానికి రాకపోవడానికి సరైన కారణం చెబుతూ రాతపూర్వక వివరణ ఇవ్వాలని ఈ లేఖలో పీసీబీ పేర్కొంది.

# రూ.45 కోట్లతో దక్కించుకోవడం కష్టమే..



మరో పది రోజుల్లో ప్రపంచ లీగ్ క్రికెట్లోనే అత్యంత ఖరీదైన మెగా వేలం ( 2025) జరగనుంది. మూడేళ్ల పాటు ఆటగాళ్లను దక్కించుకొనేందుకు ఐపీఎల్ ఫ్రాంఛైజీలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే రిటెన్షన్ వ్యవహారం ముగిసింది. రైట్ టు మ్యాచ్ ఆప్షన్ కొన్ని జట్లకు ఉంది. అయితే, వేలం ముగిసిన తర్వాత అందుకు అవకాశం ఉంటుంది. పంజాబ్ కింగ్స్ వద్ద అత్యధికంగా రూ.110 కోట్ల సొమ్ము ఉండగా.. రాజస్థాన్ వద్ద తక్కువగా రూ.41 కోట్లు మాత్రమే ఉన్నాయి. ఈ మొత్తంతోనే ఆయా ఫ్రాంఛైజీలు ( 2025) తమ స్క్వాడ్లను సిద్ధం చేసుకోవాల్సి ఉంటుంది. పర్సును రూ.120 కోట్లకు పెంచినా.. రిటెన్షన్ కోసం సగటున రూ.70 కోట్ల వరకు ఆయా జట్లు ఖర్చు చేశాయి. ఈ క్రమంలో నాణ్యమైన భారత క్రికెటర్లను మిగిలిన సొమ్ముతో దక్కించుకోవడం చాలా కష్టమని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా వ్యాఖ్యానించాడు.
సన్రైజర్స్ హైదరాబాద్ () వద్ద కేవలం రూ.45 కోట్లు మాత్రమే ఉన్నాయి. రిటైన్ చేసుకునే క్రమంలో విదేశీ ఆటగాళ్లు పాట్ కమిన్స్ (రూ. 18 కోట్లు), ట్రావిస్ హెడ్ (రూ.14 కోట్లు), హెన్రిచ్ క్లాసెన్ (రూ. 23 కోట్లు) కోసం భారీగా వెచ్చించింది. ఈ ముగ్గురు ప్రతి మ్యాచ్ తుది జట్టులో ఉంటారు. నీతిశ్, అభిషేక్ కోసం రూ. 20 కోట్లు ఖర్చు చేసింది. ఫైనల్ లో భారత్ నుంచి మరో ఆరుగురు క్రికెటర్లు (ఇంపాక్ట్ ప్లేయర్తో కలిపి) ఉండాలన్నా.. వారిని సొంతం చేసుకోవాలంటే మిగిలిన మొత్తం సరిపోదు. తుది జట్టులో నలుగురు కంటే ఎక్కువ మంది విదేశీ ప్లేయర్లు ఉండలేరు. బ్యాకప్గానూ కొందరిని తీసుకోవాలి అని ఆకాశ్ చోప్రా వెల్లడించాడు.

వారి ముగ్గురిపై పంజాబ్ దృష్టి..

మెగా వేలంలో రిషభ్ పంత్, ఇషాన్ కిషన్, కేఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్ తదితర స్టార్లు ఉన్నారు. దేవదత్ పడిక్కల్, వెంకటేశ్ అయ్యర్ కూడా మంచి ఆటగాళ్లే. భారీ మొత్తం దక్కించుకునే ఈ ఆటగాళ్లను సన్రైజర్స్ తీసుకునే అవకాశం లేదు. ఇక ముంబయి పరిస్థితి ఇందుకు భిన్నం కాదు. కాకపోతే ముంబయి రిటైన్షన్లో భారత క్రికెటర్లనే తీసుకుంది. విదేశీ క్రికెటర్లను దక్కించుకోవాల్సిన అవసరం ఉంది. ఫ్రాంఛైజీల వద్ద ఎక్కువ సొమ్ము లేకపోవడంతో ఈసారి ఓవర్సీస్ ప్లేయర్లు పెద్ద మొత్తాలను దక్కించుకోవడం కష్టం. వారితోపోలిస్తే భారత క్రికెటర్లకే కాస్త మెరుగైన ధర వస్తుందని భావిస్తున్నా. అందుకే, రాబోయే మెగా వేలం అత్యంత సంక్లిష్టం. పంజాబ్ వద్ద నిధులు భారీగా ఉన్నా.. తీసుకోవాల్సిన ప్లేయర్ల సంఖ్యా అదే స్థాయిలో ఉంది. అయితే, ఆ మొత్తాన్ని టాప్ ప్లేయర్ల కోసం వెచ్చించే అవకాశం ఉంది అని భారత మాజీ క్రికెటర్ వ్యాఖ్యానించాడు.



# ఆ ముగ్గురు ప్లేయర్స్.. నా కొడుకు పదేళ్ల కెరీర్‌ను నాశనం చేశారు

- శాంసన్ తండ్రి సంచలన వ్యాఖ్యలు
- సంజూకు మంచి క్లాసికల్ టచ్ ఉంది

టీమిండియా వికెట్ కీపర్ సంజూ శాంసన్ తండ్రి శాంసన్ విశ్వనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. టీమిండియా మాజీ కెప్టెన్స్ ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు తన కొడుకు పదేళ్ల కెరీర్ను నాశనం చేశారని ఆరోపించారు. సంజూ నైపుణ్యాన్ని గుర్తించి జట్టులో అవకాశం ఇచ్చిన కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్లకు విశ్వనాథ్ ధన్యవాదాలు తెలిపారు. సంజూ ఎప్పుడూ రికార్డుల కోసం ఆడడని, కొందరు స్వార్థం కోసం ఆడుతారని చెప్పుకొచ్చారు.
2015లో అంతర్జాతీయ క్రికెట్లోకి వచ్చిన సంజూ శాంసన్.. 9 సంవత్సరాలుగా భారత జట్టులో సుస్థిర స్థానం సంపాదించలేకపోయాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల రిటైర్మెంట్ అనంతరం అతడికి జట్టులో చోటు దక్కింది. బంగ్లాదేశ్తో హైదరాబాద్ వేదికగా జరిగిన మూడో టీ20 మ్యాచ్లో సెంచరీ చేసిన సంజూ.. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో విధ్వంసకర శతకంతో ఆకట్టుకున్నాడు.
దాంతో అంతర్జాతీయ టీ20 క్రికెట్లో వరుస మ్యాచ్లో సెంచరీ సాధించిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు.
దక్షిణాఫ్రికాపై రెండో మ్యాచ్లో డకౌట్ అయినా.. మిగతా రెండు మ్యాచ్లో రాణిస్తాడని అందరూ అంటున్నారు. 2026 టీ20 ప్రపంచకప్లో సంజూ కీలక పాత్ర పోషిస్తాడని అంచనా.సంజూ శాంసన్ వరుస మ్యాచ్లో సెంచరీ చేయడంపై అతడి తండ్రి శాంసన్ విశ్వనాథ్ సంతోషం వ్యక్తం చేశారు.
తాజాగా ఓ ఇంటర్వ్యూలో విశ్వనాథ్ మాట్లాడుతూ భారత జట్టు మాజీ కెప్టెన్లు ఎంఎస్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు సరైన అవకాశాలు ఇవ్వకుండా నా కొడుకు పదేళ్ల క్రికెట్ కెరీర్ను నాశనం చేశారు.
అయినా నా కొడుకు ఏనాడూ బాధపడలేదు. భారత జట్టులో చోటు కోసం ప్రయత్నం చేశాడు. మాజీ ఆటగాడు క్రిష్ శ్రీకాంత్ మాటలు మమ్మల్ని బాధించాయి. బంగ్లాదేశ్ లాంటి సాధారణ జట్టుపై సంజూ సెంచరీ సాధించాడని విమర్శించాడు. ఏ జట్టు మీద చేసినా..సెంచరీ సెంచరీనే. సచిన్, ద్రవిడ్ మాదిరి సంజూకు మంచి క్లాసికల్ టచ్ ఉంది. ప్రోత్సహించకున్నా సరే.. కనీస మర్యాద ఇవ్వకుంటే ఎలా అని బాధపడ్డారు.సంజూ శాంసన్కు వరుసగా అవకాశాలు రావడంతో చాలా సంతోషంగా ఉన్నా. కోచ్ గౌతమ్ గంభీర్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్కు కృతజ్ఞతలు. ఈ ఇద్దరూ లేకుంటే సంజూను మళ్లీ పక్కనపెట్టేవారు. నా కొడుకు సాధించిన మొదటి శతకాన్ని ఈ ఇద్దరికీ అంకితమివ్వాలనుకుంటున్నా.
సంజూ వరుస సెంచరీలు చేయడం ఇలాగే కొనసాగాలి. కొంతమంది స్వార్థం కోసం ఆడుతారు. సంజూ అలా కాదు. భారత జట్టు కోసం నా కొడుకు ఎన్నో సాధిస్తాడనే నమ్మకం ఉంది అని శాంసన్ విశ్వనాథ్ ధీమా వ్యక్తం చేశారు.

# వన్డే క్రికెట్ చరిత్రలో రోహిత్..

## రికార్డు ఇప్పటికీ పదిలం



రోహిత్ శర్మ అనగానే భారీ హిట్టింగ్ గుర్తుకొస్తుంది. ఆ దూకుడుతో ఎన్నో రికార్డులను తన పేరిట నమోదు భారత కెప్టెన్ రోహిత్ శర్మ పేరిట ఎన్నో రికార్డులు ఉన్నాయి. వన్డే చరిత్రలో ఎక్కువ డబుల్ సెంచరీలు సాధించిన బ్యాటర్గా కొనసాగుతున్న హిట్మ్యాన్ రికార్డు ఒకటి ఇప్పటికీ చెక్కుచెదరలేదు. అదే అత్యధిక వ్యక్తిగత స్కోరు. పదేళ్ల కిందట శ్రీలంకపై రోహిత్ 264 పరుగులు చేశాడు. అప్పటికే వన్డేల్లో తొలి డబుల్ సెంచరీ చేసిన క్రికెటర్గా భారత క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ నిలవగా.. అతడి రికార్డును 2014 నవంబర్ 13న రోహిత్ తన రెండో డబుల్ సెంచరీతో అధిగమించాడు. అంతకుముందు ఏడాది (2013లోనే) రోహిత్ మొదటి ద్విశతకం చేశాడు. సంవత్సరం వ్యవధిలోనే రెండు డబుల్ సెంచరీలు చేయడం విశేషం.

బాదుడే బాదుడు

శ్రీలంక 2014లో భారత పర్యటనకు వచ్చింది. ఐదు వన్డేల సిరీస్ను టీమ్ఇండియా 5-0 తేడాతో కైవసం చేసుకుంది. మరీ ముఖ్యంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన నాలుగో వన్డేలో రోహిత్ శర్మ విశ్వరూపం చూపించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ ఐదు వికెట్ల నష్టానికి 404 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (264: 173 బంతుల్లో 33 ఫోర్లు, 9 సిక్సు) ఓపెనర్గా వచ్చాడు. ఇన్నింగ్స్ చివరి బంతికి ఔటై పెవిలియన్కు చేరాడు. ఓపెనర్గా అజింక్య రహానె (28), అంబటి రాయుడు (8) త్వరగా ఔటైనప్పటికీ.. విరాట్ కోహ్లీ (66)తో కలిసి రోహిత్ మూడో వికెట్కు 202 పరుగులు జోడించాడు. మళ్లీ కోహ్లీ, సురేశ్ రైనా (11) స్వల్ప వ్యవధిలో పెవిలియన్కు చేరారు. అప్పటికే సెంచరీ సాధించిన రోహిత్.. రాబిన్ ఉతప్ప (16★)తో ఐదో వికెట్కు 128 పరుగులు జోడించాడు. ఇందులో ఉతప్ప ఓవైపు క్రీజ్లో ఉండిపోగా.. రోహిత్ బాదుడే లక్ష్యంగా ఆడాడు. వీరి కాంబినేషన్లో రోహిత్ డబుల్ సెంచరీకి చేరుకున్నాడు. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీలంక 251 పరుగులకు ఆలౌటైంది. ధవళ్ కులకర్ణి (3/34), ఉమేశ్ యాదవ్ (2/38), స్టువర్ట్ బిన్నీ (2/55), అక్షర్ పటేల్ (2/51) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును రోహిత్ సొంతం చేసుకున్నాడు. ఈ మ్యాచ్లో అతడికి బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ రూ. 2,64,000 చెక్ అందించింది.

రోహిత్ డబుల్ సెంచరీలు ఇవే..

ఇప్పటి వరకు రోహిత్ శర్మ వన్డేల్లో మూడు ద్విశతకాలు బాదాడు. అందులో రెండు శ్రీలంకపైనే కావడం విశేషం. తొలుత ఆస్ట్రేలియాపై (2013లో) 209 పరుగులు చేసిన రోహిత్.. మరుసటి ఏడాదే (2014లో) 264 పరుగులను శ్రీలంకపై సాధించాడు. శ్రీలంకపైనే 2017లో 208 పరుగులతో అజేయంగా నిలిచి మూడో ద్విశతకాన్ని తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పటికీ వన్డేల్లో రోహిత్ పేరిటే అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు ఉండగా.. కివీస్ మాజీ ఆటగాడు మార్టిన్ గప్తిల్ (2015లో) 234 పరుగులు చేసినా.. రోహిత్ రికార్డును మాత్రం టచ్ చేయలేకపోయాడు.

# కేకేఆర్ కీలక నిర్ణయం..



ఐపీఎల్ 2025 మెగా వేలంకు ముందు కోల్కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) ఫ్రాంఛైజీ ఆరుగురి ఆటగాళ్లను రిటైన్ చేసుకుంది. టీమిండియా నయా సంచలనం రింకూ సింగ్ను టాప్ ప్లేయర్గా రూ.13 కోట్లకు అట్టిపెట్టుకుంది. మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, ఆల్రౌండర్ సునీల్ నరైన్, డేంజరస్ హిట్టర్ ఆండ్రీ రసెల్లను రూ.12 కోట్లకు రిటైన్ చేసుకుంది. భారత ప్లేయర్స్ హర్షిత్ రాణా, రమణ్దీప్ సింగ్లను రూ.4 కోట్లుకు అట్టిపెట్టుకుంది. కేకేఆర్ రూ.63 కోట్లతో వేలంలోకి వెళ్లనుంది.
2024 ఐపీఎల్ టైటిల్ అందించిన శ్రేయస్ అయ్యర్ను కేకేఆర్ వేలంలోకి వదిలేసిన విషయం తెలిసిందే. కేకేఆర్ రిటెన్షన్కు శ్రేయస్ ఒప్పుకోలేదని సమాచారం. ఢిల్లీ క్యాపిటల్స్ మేనేజ్మెంట్ సూచనలతోనే కోల్కతాను వీడినట్లు తెలుస్తోంది. రిషబ్ పంత్ స్థానంలో మరోసారి ఢిల్లీకి శ్రేయస్ సారథిగా వ్యవహరించనున్నాడని ప్రచారం జరుగుతోంది. శ్రేయస్ జట్టును వీడడంతో కోల్కతాకు కెప్టెన్ అవసరం ఏర్పడింది. రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ వేలంలో ఉన్నా.. వీరిద్దరూ కోల్కతాకు వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. పంజాబ్ కింగ్స్కు పంత్.. ఆర్సీబీకి కేఎల్ రాహుల్ వెళ్లే ఛాన్స్ ఉంది.
ప్రస్తుతం కెప్టెన్సీ ఆప్షన్ ఉన్న భారత ఆటగాళ్లు కోల్కతాకు లేకుండా పోయారు. దాంతో జట్టులో ఉన్న రింకూ సింగ్కు సారథ్య బాధ్యతలు అప్పగించాలని కేకేఆర్ మేనేజ్మెంట్ ప్రణాళికలు చేస్తోందని తెలిసింది. రింకూకు ఇప్పటివరకు కెప్టెన్సీ అనుభవం లేదు. కనీసం దేశవాళీ క్రికెట్లో కూడా సారథిగా వ్యవహరించలేదు. అలాంటి రింకూ డిపెండింగ్ ఛాంపియన్ జట్టును ముందుకు తీసుకెళ్లడం కత్తిమీద సామే అనే చెప్పాలి. మరికొన్ని రోజుల్లో దీనిపై స్పష్టత రానుంది.

# నీకు అవసరమా?..

### పాంటింగ్‌పై ఫైరైన ఆసీస్ మాజీ క్రికెటర్!

టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఫామ్పై చేసిన వ్యాఖ్యలతో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ విమర్శలకు గురవుతున్నాడు. ఇటీవల టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ప్రెస్ కాన్ఫరెన్స్లో విరుచుకుపడగా.. తాజాగా ఆసీస్ మాజీ క్రికెటర్ షేన్ లీ కూడా పాంటింగ్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టాడు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ లాంటి పెద్ద సిరీస్కు ముందు అపహాస్యంగా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నాడు. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకరైన కోహ్లీని రెచ్చగొట్టేలా మాట్లాడటం మంచిది కాదన్నాడు. ఆస్ట్రేలియా-భారత్ టెస్ట్ సిరీస్ రసవత్తరంగా ఉంటుందని తాను భావిస్తున్నా అని షేన్ లీ పేర్కొన్నాడు.
ఫాక్స్ క్రికెట్ పోడ్కాస్ట్ ది ఫాలో ఆన్లో షేన్ లీ మాట్లాడుతూ బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మరికొద్ది రోజుల్లో ఆరంభం కానుంది. ఈ సమయంలో రికీ పాంటింగ్ చేసిన వ్యాఖ్యలు సరైనవి కావు. ప్రపంచంలోనే అత్యుత్తమ బ్యాటర్లలో ఒకడైన విరాట్ కోహ్లీని రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదు. ఒక్కసారి విరాట్ కుదురుకున్నాడంటే.. ఆస్ట్రేలియాకు మరోసారి చుక్కలు చూపిస్తాడు. టెస్ట్ సిరీస్ రసవత్తరంగా ఉంటుందని భావిస్తున్నా. భారత్-ఏ, ఆస్ట్రేలియా-ఏ జట్ల మధ్య జరిగిన అనధికారిక టెస్టుల్లోనే బాల్ టాంపరింగ్ వివాదం వచ్చింది. ఇప్పుడు కోహ్లీని ఉద్దేశించి పాంటింగ్ చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్గా మారాయి. ఆసీస్కు అద్భుత బౌలింగ్ ఎటాక్ ఉంది. కమిన్స్, స్టార్క్, హేజిల్వుడ్, లైయన్ బాగా బౌలింగ్ చేస్తున్నారు అని అన్నాడు.
న్యూజిలాండ్తో మూడు టెస్టుల సిరీస్ను భారత్ 0-3తో కోల్పోయింది. కివీస్ చేతిలో ఘోర పరాభవం చవిచూసిన రోహిత్ సేన.. ఇప్పుడు కీలక సమరానికి సిద్ధమవుతోంది. నవంబర్ 22 నుంచి బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ ప్రారంభం కానుంది. పెర్త్ వేదికగా నవంబర్ 22 నుంచి మొదటి టెస్ట్ ఆరంభం అవుతుంది. ఈ సిరీస్ కోసం ఇప్పటికే ఆసీస్ చేరుకున్న భారత్.. ప్రాక్టీస్ కూడా ఆరంభించింది.

సూర్య cinema@suryaa.com
హైదరాబాద్
గురువారం
14 నవంబర్ 2024
సూర్య సినిమా


# గుబురు గడ్డంతో బాలయ్య





కొన్నేళ్లుగా అపజయమెరుగకుండా వరుస భారీ విజయాలతో దూసుకుపోతున్న గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, తన 109వ చిత్రం 'NBK109' కోసం బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లితో చేతులు కలిపారు. కేవలం ప్రకటనతోనే ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. నందమూరి అభిమానులతో పాటు, తెలుగు సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురు చూస్తున్న ఈ చిత్ర టైటిల్ టీజర్‌కి ముహూర్తం ఖరారైంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకొని, 'NBK109' పై అంచనాలను రెట్టింపు చేశాయి. పోస్టర్లు, రెండు భారీ యాక్షన్ గ్లింప్స్‌లు అందరినీ కట్టిపడేశాయి. ముఖ్యంగా బాలకృష్ణను మునుపెన్నడూ చూడని కొత్త అవతారంలో దర్శకుడు బాబీ చూపిస్తున్న తీరుకి అందరూ ఫిదా అయ్యారు. టైటిల్‌తో పాటు, ఈ సినిమాకి సంబంధించిన మరిన్ని విషయాలు తెలుసుకోవాలని అభిమానులు, సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే, ఈ కార్తీక పూర్ణిమకి వారి నిరీక్షణకు తెరపడనుంది. తాజాగా టైటిల్ టీజర్ విడుదల తేదీని నిర్మాతలు ప్రకటించారు. కార్తీక పూర్ణిమ శుభ సందర్భంగా, నవంబర్ 15న '%చీదీఖ%109' టైటిల్ టీజర్‌ను విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ ఆకట్టుకుంటోంది. విభిన్న దుస్తులు ధరించి, ప్రత్యేకంగా రూపొందించిన ఆయుధాలను చేతబట్టిన బాలకృష్ణ లుక్ ఎంతో శక్తివంతంగా ఉంది. నెత్తురంటిన గొడ్డలిని పట్టుకొని, పొడవాటి జుట్టు, గుబురు గడ్డంతో బాలకృష్ణ నిల్చొని ఉన్న రూపం మరో స్థాయిలో ఉంది. ఈ ఒక్క పోస్టర్ సినిమాపై అంచనాలను ఎన్నో రెట్లు పెంచేలా ఉంది.


# పూజా కార్యక్రమాలతో జిపిఎల్ ప్రారంభం



అల్లు ఆర్ట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడక్షన్స్ నెంబర్ 1గా తెరకెక్కుతున్న చిత్రం జి.పి.ఎల్. అల్లు లత ప్రేసెన్స్‌తో అల్లు సాయి లక్ష్మణ్ నిర్మాతగారావు జి.ఎం నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో జరిగాయి. పవన్ శంకర్, యాని, తనికెళ్ళ భరణి, హెబ్బ పటేల్, బ్రహ్మాజీ, నాగ మహేష్, నవీన్ తదితరులు ఈ సిని మాలో ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. లవ్ ఇన్వెస్టిగేషన్ సస్పెన్స్ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమా హైదరాబాద్ మరియు వైజాగ్, కోడై కెనాల్ లో జరగనుంది. నవంబర్ 14 నుండి మొదటి షెడ్యూల్ ప్రారంభం కానుంది. డైరెక్టర్‌రావు జి.ఎం.నాయుడు మాట్లాడుతూ... పవన్ కళ్యాణ్ అభిమానిగా నేను ఈ సినిమాను తెరకెక్కిస్తు న్నాను. జి.పి.ఎల్ (గాడ్స్ ప్రీమియర్ లీగ్) టైటిల్ ఈ కథకు సరిగ్గా సరిపోతుంది... మనం ఏదైనా పైన ఉన్న భగవంతుడి ఆదేశాల మేరకు నడుస్తాము అనే పాయింట్ తో ఈ సినిమా కథాంశం ఉండబోతోందని తెలిపారు.

# నవంబర్ 23 ది రానా దగ్గుబాటి షో

స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రానా దగ్గుబాటి నిర్మించి, క్రియేట్ చేసి, హోస్ట్ చేస్తున్న ఈ సరికొత్త అన్‌స్క్రిప్టెడ్ ఒరిజినల్ సిరీస్, ఎనిమిది ఎపి సోడ్ల కార్యక్రమంలో ప్రముఖ సెలబ్రిటీలు పాల్గొని, రానాతో అన్ ఫిల్టర్డ్ సంభాషణలు, ఎక్సయిటింగ్ యాక్టివిటీస్ లో పాల్గొంటారు. ఈ షోలో దుల్కర్ సల్మాన్, నాగ చైతన్య అక్కినేని, సిద్ధూ జొన్నలగడ్డ, శ్రీలీల, నాని, ఎస్.ఎస్.రాజమౌళి, రామ్‌గో పాల్‌వర్మ వంటి ప్రము ఖులు పాల్గొంటారు. నవంబర్23 నుంచి ప్రైమ్ వీడియోలో ప్రత్యేకంగా 240 దేశాలు, ప్రాదేశిక ప్రాంతాల్లో ప్రసారం కానున్న ఈ షోలో ప్రతి శనివారం ఒక కొత్త ఎపిసోడ్ విడుదల అవుతుంది. భారత దేశంలో అత్యంత ఇష్టపడే ఎంటర్ టైన్మెంట్ డెస్టినేషన్ ప్రైమ్ వీడియో తన మొదటి టాక్ షో – ది రానా దగ్గుబాటి షో – నవంబర్ 23 నుండి ప్రారంభమవుతుందని ప్రకటిం చింది. రానా దగ్గుబాటి స్వయంగా ఎగ్జిక్యూ టివ్ ప్రొడ్యూ సర్‌గా వ్యవహ రిస్తూ హోస్ట్ చేస్తున్న ఈ ఎనిమిది ఎపిసోడ్ సిరీస్‌లో ప్రముఖ సెలబ్రి టీలు పాల్గొంటారు. దుల్కర్ సల్మాన్, నాగచై తన్య, నానీ, సిద్ధూ జొన్నల గడ్డ, శ్రీలీల, ఎస్.ఎస్. రాజమౌళి, రామ్‌గోపాల్‌వర్మ వంటి అనేక మంది ప్రత్యేక అతి థులు ఇం దులో ఉంటారు. సన్నిహిత సంభాష ణలు, సరదా చలోక్తులతో సాగే ఈ సిరీస్ ద్వారా వారు తెలియని కోణాలను రానా ఆవిష్క రిస్తారు. భారతదేశం సహ ప్రపంచ వ్యాప్తంగా 240 దేశాలు, ప్రాదే శిక ప్రాంతాల్లో నవంబర్ 23 నుంచి ది రానా దగ్గు బాటి షో ప్రైమ్ వీడియోలో ప్రత్యేకంగా విడు దల కానుంది.



# జీబ్రా మంచి కంటెంట్ – మెగాస్టార్




టాలెంటెడ్ హీరో సత్య దేవ్, కన్నడ స్టార్ డాలీ ధనంజయ హైలీ యాంటిసిపేటెడ్ మల్టీ స్టారర్ జీబ్రా. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్ఎన్ రెడ్డి, ఎస్ పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మిస్తు న్నారు. జీబ్రా మూవీ నవంబర్ 22న థియేటర్లలోకి రానుంది. ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మెగాస్టార్ చిరంజీవి లాంచ్ చేశారు. ట్రయిలర్ సినిమా ప్రధాన కథాంశాన్ని రివిల్ చేస్తోంది, ఇది వాస్తవ సంఘటనల నుండి ప్రేరణ పొందింది, బ్యాంకు ఫ్రాడ్ చుట్టూ తిరిగే కథాంశం. ఆర్థిక నేరాల డేంజరస్ వరల్డ్ లో చిక్కుకుంటాడు హీరో. రెస్పెక్ట్ అల్టిమేట కరెన్సీ అని భావించే రూత్ లెస్ గ్యాంగ్‌స్టర్ డాలీ నుంచి అతనికి పెద్ద ముప్పు ఉంటుంది. ఈ డేంజర్ నుండి తప్పించుకోవడానికి, హీరో, ఫ్రెండ్స్ గ్యాంగ్ తీసుకున్న రిస్క్ ని ఎక్సయింటింగ్‌గా ప్రజెంట్ చేస్తోంది.
ఈ మూవీ సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లింగ్ అంశాలతో పాటు రోమాన్స్, ఫన్ బ్లెండ్‌ని అద్భుతంగా అంది స్తోంది. సత్యదేవ్ హీరోగా అదరగొట్టారు, విలన్‌గా డాలీ ధనంజయ టెర్రిఫిక్‌గా వున్నారు. సునీల్ పాత్రలో కూడా నెగెటివ్ షేడ్స్ వున్నాయి. సత్య కామిక్ రిలీఫ్ అందించారు. సత్య దేవ్ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటించింది. సత్యరాజ్ కూడా తనదైన ముద్ర వేశారు. ఈశ్వర్ కార్తీక్ బ్రిలియంట్ రైటింగ్మ స్టైలిష్ టేకింగ్ తో ఆకట్టుకున్నాడు. సత్య పొన్మార్ కెమెరా పనితనం ప్రత్యేకంగా నిలిచింది, రవి బస్రూర్ తన ఎనర్జిటిక్ స్కోర్‌తో విజువల్స్‌ని ఎలివేట్ చేశాడు. పద్మజ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ గ్రాండ్ ప్రొడక్షన్ డిజైన్ ప్రతి ఫ్రేమ్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఎస్ శ్రీలక్ష్మి రెడ్డి సహ నిర్మాత. మీరాఖ్ డైలాగ్స్ రాస్తుండగా, ఎడిటింగ్‌ని అనిల్ క్రిష్ ఎడిటర్ . టీజర్, ప్రోమోలు సంచలనం సృష్టించగా, ట్రైలర్ వాటిని మరో స్థాయికి తీసుకెళ్లింది. జీబ్రా మెగా ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి మాట్లాడుతూ..కొన్ని ఫంక్షన్స్‌కి రావడం ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. ప్రేమతో పిలిస్తే వస్తాను. నాకు ప్రేమ కావాలి, అభిమానం కావాలి. ఇక్కడ ఆ ప్రేమ అభిమానం మెండుగా లభిస్తుంది. ఇక్కడున్న ప్రతి ఒక్కరూ అంత ప్రేమ అభిమానం కురిపిస్తుంటే అది ఆస్వాదించడానికి నేను వచ్చినందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ వేడుక ఇంత ఘనంగా జరగడానికి కారణమైన మీ అందరికీ నా అభినందనలు తెలియజేస్తున్నాను. కోవిడ్ సమయంలో ఎలాంటి సినిమాలు తీసి జనాలని రంజింపచేయాలనే ఒక మీమాంస ఇండస్ట్రీలో నెలకొంది. జనాలు ఓటీటీలో సినిమాలు చూడడం అలవాటు చేసుకున్న తర్వాత, పెద్ద సినిమాలకు, బిగ్ ఈవెంట్ సినిమాలి తప్పితే వాళ్ళని థియేటర్స్ కి రప్పించడం చాలా కష్టమనే అభిప్రాయం వ్యక్తమైనప్పుడు ఇండస్ట్రీకి ఐదెమ్ కష్టకాలం అనిపించింది. పెద్ద సినిమాలు ఆడినంత మాత్రాన అది ఇండస్ట్రీ కాదు, ఇక్కడ అన్ని సినిమాలు ఆడాలి, షూటింగ్ లు జరుపుకోవాలని, ఉపాధి కల్పించాలి, ప్రతి ఒక్కరూ కళకళలాడాలి, అప్పుడే పరిశ్రమ సజావుగా కొనసాగుతూ ఉంటుందనే నాలాంటి వాళ్లకు ఒక చిన్న బెరుకు వచ్చింది. అయితే అవన్నీ కూడా కరెక్ట్ కాదని ప్రేక్షకులు నిరూపించారు. దానికి ఉదాహరణగా ఈ సంవత్సరం ప్రశాంత్ వర్మ, తేజసజ్జా కలయికలో హనుమాన్ తో శుభారంభమైంది. అది ఆల్ ఇండియా సినిమాగా గొప్ప విజయం సాధించింది. చిన్న సినిమాలని పెద్ద సినిమాలుగా మార్చారు మన తెలుగు ప్రేక్షకులు. తర్వాత వచ్చిన కమిటీ కుర్రాళ్ళు, డిజె టిల్లు 3, ఆయ్, మత్తువదలరా 2 ఇలా వరుసగా సినిమాలో సూపర్ హిట్ అవుతూ వచ్చాయి. మొన్న దీపావళికి లక్కీ భాస్కర్, క, అమరన్ ఎంతో ఆదరణ పొందాయి. టీంలో ఉన్న ప్రతి ఒక్కరికి నా హృదయ పూర్వక అభినందనలు తెలియజేసుకుంటున్నాను. ఆల్ ది వెరీ బెస్ట్' అన్నారు.



# సీరత్‌కపూర్ క్యూట్ గ్లామర్

సీరత్ కపూర్.. అమ్మడు ఇండస్ట్రీలోకి వచ్చి చాలా కాలమైంది కానీ ఇంకా సరైన రీతిలో కెరీర్ ను సెట్ చేసుకోలేదు. అయితే గ్యాప్ లేకుండా రెగ్యులర్ గా ఏదో ఒక సినిమాలో కనిపించే ప్రయత్నం చేస్తోంది. అలాగే సోషల్ మీడియాలో కూడా అమ్మడు గ్లామర్ ప్రజెంటేషన్ తో నెటిజన్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఇక రీసెంట్ గా మరోసారి తన సొగసుతో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఫొటోలో ఆమె స్ట్రిప్డ్ టాప్ మరియు డెనిమ్ ఓవర్ ఆల్‌తో కూల్ లుక్‌లో కనిపించింది. "చుట్టూ చూడండి, ఎల్లప్పుడూ మార్గదర్శక సంకేతం ఉంటుంది!" అనే క్యాప్షన్‌తో పోస్ట్ చేసిన ఈ ఫోటోలో సీరత్ క్యూట్ స్మైల్‌తో అభిమానులను ఆకట్టుకుంది. ఈ ఫోటోలో ఆమెను చూసి, నెటిజన్లు ఫ్యాషన్ సెన్స్ మరియు చార్మ్‌కు ఫిక్స్డిదా అవుతున్నారు. సీరత్ కపూర్ తన సినీ కెరీర్‌ను 2014లో వచ్చిన రన్ రాజా రన్ చిత్రంతో ప్రారంభించింది. మొదటి చిత్రమే అయినా ఆమె నటనలో చూపిన నైపుణ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఆ సినిమా ద్వారా యూత్ హృదయాలను గెలుచుకున్న సీరత్, గ్లామర్‌తో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది. తరువాత ఆమె టైగర్, కృష్ణ అండ్ హిజ్ లీలా, మా వినతా వంటి సినిమాల్లో తన ప్రతిభను ప్రదర్శించింది. ఇటీవల ఆమె భామాకలాపం 2, మనమే వంటి సినిమాల్లో నటించి, తన యాక్టింగ్ స్కిల్స్‌ను మరింత మెరుగుపర్చుకుంది. సీరత్ కపూర్‌కి కెరీర్‌లో పెద్ద హిట్ లభించక పోయి నప్పటికీ, ఆమె తన గ్లామర్ మరియు ప్రదర్శనతో అభిమానులను ఆకర్షించడంలో విజయవంతం అవుతోంది. ముఖ్యంగా సోషల్ మీడియా ద్వారా ఫ్యాన్స్‌కు నిత్యం టచ్‌లో ఉండే సీరత్, తరచుగా ఫోటోషూట్ల ద్వారా తన గ్లామర్ ప్రెజెన్స్‌ను ఫ్యాన్స్‌తో పంచుకుంటోంది.

# 15న "డ్రింకర్ సాయి" టీజర్




ధర్మ, ఐశ్వర్య శర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "డ్రింకర్ సాయి". బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్ అనేది ఈ చిత్ర ట్యాగ్ లైన్. ఈ చిత్రాన్ని ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్స్ పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవ రాజు లహరిధర్ నిర్మిస్తున్నారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. "డ్రింకర్ సాయి" సినిమా టీజర్ రిలీజ్ అనౌన్స్ మెంట్ చేశారు మేకర్స్. ఈ మూవీ టీజర్‌ను ఈ నెల 15న సాయంత్రం 4.05 నిమిషాలకు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. రీసెంట్ గా స్టార్ డైరెక్టర్ మారుతి లాంఛ్ చేసిన "డ్రింకర్ సాయి" సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది.

# విరుష్క జోడీ విహారం




విరుష్క జోడీ జీవితాన్ని ఆస్వాదించడంలో ది బెస్ట్ అని చెప్పాలి. క్రికెటర్లను పెళ్లాడిన జోడీలు చాలా ఉన్నాయి. కానీ వాళ్లందరిలో విరుష్క జోడీ మాత్రం ఎప్పుడూ సంథింగ్ స్పెషల్ గా హైలైట్ అవుతుంది. ఒకరు ఫేమస్ నటి కావడం.. మరొకరు వరల్డ్ వైడ్ ఫేమస్ ప్లేయర్ కావడంతోనే ఇది సాధ్యమైంది. ఆ జంట ఎక్కడికి వెళ్లినా? ప్రపంచంలో కళ్లన్నీ ఆ జోడీని వెంటాడుతూనే ఉంటాయి. కొంత కాలంగా ఆటగాళ్లతో పాటు వాళ్ల ఫ్యామిలీని కూడా వెంట తీసుకునే వెసులు బాటు బోర్డు కల్పించడంతో? ఎక్కడున్నా ఫ్యామిలీ లైఫ్ ని మాత్రం మిస్ అవ్వడం లేదు. పండగలొచ్చినా.. పబ్బాలొచ్చినా? ఏ దేశంలో ఉంటే ఆ దేశంలోనే భారతీయ సంప్రదాయం ప్రకారం జరుపుకుంటున్నారు. తాజాగా ఆస్ట్రేలియాతో సిరీస్ లో భాగంగా భారత జట్లు అసిస్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇప్పటికే జట్టు సభ్యులంతా ప్రాక్టీస్ లో బిజీ అయ్యారు. కానీ విరాట్ కోహ్లీ మాత్రం భార్యను వెంటేసుకుని పెర్త్ వీధుల్లో షికార్లు చేస్తున్నాడు. విరుష్క జోడీ వెంట కుమారుడు అకాయ్ ను కూడా తీసుకుని వెళ్లారు. పెర్త్ వీధుల్లో ఇలా విహారం చేస్తున్నారు. జీన్స్ అండ్ టీషర్ట్ కాంబినేషన్ దుస్తుల్ని అనుష్క ధరించగా..విరాట్ టీషర్ట్ ట్రాక్ లో కనిపిస్తున్నాడు. ఇద్దరు చేతుల్లో శీతల పానీయాలున్నాయి. విరాట్ ఆడే ఏ మ్యాచ్ ను అనుష్క మిస్ అవ్వదు. తప్పక హాజరవుతుంది. దగ్గరుండి భర్తను ప్రోత్సహిస్తుంది. గ్యాలరీలో కూర్చుని ఎంకరేజ్ చేస్తుంది. విరాట్ సిక్స్ కొట్టినా..ఫోర్ కొట్టినా చప్పట్లు కొట్టి కేరితంలు వేస్తుంది. ప్రతిగా విరాట్ ఫ్లైయింగ్ కిస్సులు విసురుతాడు. ప్రేమి కులుగా ప్రయాణం ఎలా మొదలైందో? భార్యాభర్తలైన తర్వాత అదే ప్రయాణాన్ని అంతే ఫ్రెష్‌గా కొనసాగిస్తున్నారు. ఆ రకంగా వాళ్లిద్దరు నవంతరం దంపతులకు ఆదర్శం.






PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044